PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 53 | విజయవాడ, సోమవారం 23 సెప్టెంబర్ 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 23 September 2024 | Rs

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలపై

దశలవారీ పోరాటం

- యుటిఎఫ్ కార్యవర్గంలో నిర్ణయం

3

6

దులీప్ ట్రోఫీ విజేత ఇండియా-ఎ

- రన్నర్స్‌గా ఇండియా- సి
- ముగిసిన దులీప్ ట్రోఫీ

దేశంలో ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని కాపాడటంలో

ఏచూరి నిత్య స్ఫూర్తి

- సంతాప సభలో వక్తలు
- అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో కీలకపాత్ర

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దేశంలో ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామాజిక న్యాయం, ఫెడరలిజం నిలబెట్టడంలోనూ, నేడు విజృంభిస్తున్న మతోన్మాదాన్ని అడ్డుకోవడంలోనూ సీతారాం ఏచూరి అలుపెరుగని పోరాటం చేశారని పలువురు వక్తలు పేర్కొన్నారు. సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాపసభ ఆదివారం ఉదయం విజయవాడ మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. దీనికి తెలుగుదేశం, వైసిపి, కాంగ్రెస్, ఆమ్‌ఆద్మీ, విసికెలతోపాటు అన్ని వామపక్ష పార్టీల నాయకులూ హాజరయ్యారు. తొలుత వక్తలను సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు వేదికపైకి ఆహ్వానించగా, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సభాధ్యక్షత వహించారు. తొలుత పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఎ బేబి, మంత్రి కొలుసు పార్థసారథి.. ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం సంతాప సూచకంగా ఒక నిమిషం మౌనం పాటించారు.

ఏచూరికి నివాళులర్పిస్తున్న ఎం.ఎ.బేబి, కొలుసు పార్థసారథి, అంబటి రాంబాబు, బివి రాఘవులు, కె రామకృష్ణ, వి శ్రీనివాసరావు, సిహెచ్ బాబురావు

బహుముఖ ప్రజ్ఞాశాలి : ఎం.ఏ.బేబి

ఏచూరి బహుముఖ ప్రజ్ఞాశాలి అని చిన్న వయసులోనే కేంద్ర నాయకత్వంలో ప్రముఖ నాయకుడిగా ఎదిగారని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎం.ఏ.బేబి తెలిపారు. మార్క్సిజం, లెనినిజం యొక్క విశిష్టతను ఆయన తెలియజేశారని పేర్కొన్నారు. ప్రజాతంత్ర శక్తులను ఐక్యం చేయడానికి ఇండియా బ్లాక్ ఏర్పాటు చేయడంలో అన్ని పార్టీల అభిప్రాయాలను స్వీకరిస్తూనే ఏచూరి నిర్వహించిన పాత్రను మర్చిపోలేమని పేర్కొన్నారు. ఏచూరికి అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంతోనూ సంబంధాలు ఉన్నాయని తెలిపారు. ఎప్పుడు అంతర్జాతీయ సమావేశాలకు వెళ్లినా ఏచూరి గురించి అడిగేవారని తెలిపారు. నాలుగున్నర దశాబ్దాల పాటు విద్యార్థి ఉద్యమం నుండి తాము కలిసి పనిచేశామని అన్నారు. పార్టీ యువతను ప్రమోట్ చేయడానికి సిద్ధమైన సమయంలో 1992 పద్నాలుగో మహాసభలో సోవియట్ యూనియన్, తూర్పు యూరప్ దేశాల్లో కమ్యూనిస్టులు దెబ్బతిన్న సమయంలో సోషలిజం అజేయం, శాస్త్రీయం అని దాని అమల్లో లోపాల వల్లే దెబ్బతిందనే తీర్మానాన్ని ఏచూరి ప్రవేశపెట్టారని తెలిపారు. దాన్ని మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించిందన్నారు.

పేదల కోసం అహర్నిశలూ పనిచేశారు : కొలుసు పార్థసారథి

పేదల కోసం అహర్నిశలూ పోరాడిన వ్యక్తి మరణం బాధాకరమని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలశాఖ మంత్రి, తెలుగుదేశం నాయకులు కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. తెలుగువాడు కావడం గర్వకారణమన్నారు. ప్రజాస్వామ్య విలువల కోసం పనిచేశారని తెలిపారు. ఇందిరాగాంధీ అంటేనే భయపడుతున్న సమయంలో ఆమె ఎదురుగా నిలబడి యూనివర్శిటీలో చాన్సలర్ పదవికి రాజీనామా చేయాలని కోరిన ధీరుడని తెలిపారు. ఎక్కడున్నా తెలుగు ప్రజలకు, తెలుగు నేలకు ఆత్మబంధువుగా ఉన్నారని వివరించారు. రాష్ట్రంలో ఎప్పుడు ప్రజాస్వామ్యానికి ఆపద ముంచుకొచ్చినా ముందుండి పోరాడారని వివరించారు. ఎన్‌టిఆర్‌ను గద్దెదించిన సమయంలో శాసనసభ్యులందరూ ఢిల్లీకి వెళ్లిన సమయంలో ఏచూరి చేసిన కృషి మరిచిపోలేమని తెలిపారు. ఆయన జీవితం మొత్తం దోపిడీ వ్యవస్థలకు వ్యతిరేకంగా పోరాడారని వివరించారు. పెట్టుబడుల ఉపసంహరణకు, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడారని తెలిపారు. స్టీలు ప్లాంటును కాపాడుకునేందుకు మూడేళ్లగా కృషి చేస్తున్నారని వివరించారు. ఆయనకు అధికారం ముఖ్యం కాదని, ఈ తరం రాజకీయ నాయకులకు ఆయన జీవితం పాఠంగా ఉండాలని పేర్కొన్నారు. అమెరికాతో అణు ఒప్పందం చేసుకున్న సమయంలో దేశ సార్వభౌమత్వానికి ఈ ఒప్పందం ముప్పుగా పరిణమిస్తుందని బలంగా

మిగతా 5లో

శ్రీలంక అధ్యక్ష ఎన్నికల్లో

దిసనాయకె ఘన విజయం

తొలి సారి అధ్యక్ష పీఠంపై మార్క్సిస్టు నేత

నేడు ప్రమాణస్వీకారం • సిపిఎం అభినందనలు

కొలంబో: శ్రీలంక అధ్యక్ష ఎన్నికల్లో మార్క్సిస్టు నేత అనుర కుమార దిసనాయకె చారిత్రాత్మక విజయం సాధించారు. శ్రీలంకలో ఆర్థిక వ్యవస్థ నిలువునా కుప్పకూలిన తర్వాత మొదటిసారి జరిగిన ఈ ఎన్నికల్లో రెండో రౌండ్ ప్రాధాన్యతా ఓట్ల లెక్కింపు తర్వాత జనతా విముక్తి పెరమున(జెవిపి) నేతృత్వంలోని నేషనల్ పీపుల్స్ పవర్ (ఎన్‌పిపి) కూటమి అభ్యర్థి దిసనాయకె అత్యధిక మెజార్టీతో గెలుపొందారు. సోమవారం ఆయన శ్రీలంక తొమ్మిదో కార్యనిర్వాహక అధ్యక్షునిగా పదవీ స్వీకార ప్రమాణం చేయనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఎన్నికల సంఘం ప్రకటించిన వివరాల ప్రకారం మొత్తం పోలైన ఓట్లలో దిసనాయకెకు 42.31 శాతం ఓట్లు రాగా, ఆయన సమీప ప్రత్యర్థి, ప్రతిపక్ష సామగి జన సందానయ పార్టీ (ఎస్‌జెపి) అభ్యర్థి సాజిత్ ప్రేమదాస 32.76 శాతం ఓట్లతో రెండో స్థానంలో నిలిచారు. ఇండిపెండెంట్ అభ్యర్థిగా బరిలోకి దిగిన ప్రస్తుత అధ్యక్షుడు రణిల్ విక్రమ సింఘెకు కేవలం 17.27 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. దీంతో ఆయన మొదటి రౌండ్‌లోనే పోటీ నుంచి నిష్క్రమించారు. మొత్తం పోలైన ఓట్లలో విజయానికి అవసరమైన 50శాతానికి పైగా ఓట్లు ఎవరికీ రాకపోవడంతో 1981 ప్రెసిడెన్షియల్ ఎలక్షన్ యాక్టు ప్రకారం మొదటి

మిగతా 5లో

అనుర కుమార దిసనాయకె నేషనల్ పీపుల్స్ పవర్ (ఎన్‌పిపి) అభ్యర్థి	
పోలైన ఓట్లు	56,34,913
ప్రాధాన్యత ఓట్లు	1,05,264
మొత్తం	**57,40,179**
ఓటింగ్ శాతం	42.31
సాజిత్ ప్రేమదాస సామగి జన సందానయ పార్టీ (ఎస్‌జెపి) అభ్యర్థి	
పోలైన ఓట్లు	43,83,035
ప్రాధాన్యత ఓట్లు	1,67,867
మొత్తం	**45,30,902**
ఓటింగ్ శాతం	32. 76
రణిల్ విక్రమ్ సింఘె (ఇండిపెండెంట్ అభ్యర్థి)	
ఓట్లు	22, 99,767
ఓటింగ్ శాతం	17.27

- ఎస్‌ఎల్‌పిపి అభ్యర్థికి 2.57 శాతం ఓట్లు రాగా, మిగతా చాలా మంది అభ్యర్థులు అడ్రస్ లేకుండా పోయాం

కల్తీ నెయ్యిపై విచారణకు 'సిట్'

- సిఎం చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

టిటిడి లడ్డూ నెయ్యి కల్తీ వ్యవహారంతో పాటు అధికార దుర్వినియోగంపైన కూడా ప్రత్యేకంగా స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్)ను వేస్తున్నట్లు సిఎం చంద్రబాబు నాయుడు వెల్లడించారు. దర్యాప్తు అధికారిగా ఐజి స్థాయి అధికారిని నియమిస్తామన్నారు. సిట్ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయన్నారు. భవిష్యత్తులో ఇటువంటివి జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఉండవల్లిలోని ఆయన నివాసంలో ఆదివారం రాత్రి సిఎం మీడియాతో మాట్లాడారు. ఎంతో పవిత్రమైన శ్రీవారి ప్రసాదంలో జంతుకొవ్వు వినియోగించి లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేశారన్నారు. తిరుమల మొత్తం ప్రక్షాళన చేసి పూర్వ వైభవం తీసుకురానున్నట్లు చంద్రబాబు వెల్లడించారు. తిరుమల ప్రక్షాళనకు దేవుడు తనకు ఒక అవకాశం ఇచ్చాడని, లడ్డూ నాణ్యతపై అనుమానంతోనే 4 ట్యాంకర్లలో నెయ్యి శ్యాంపిల్స్‌ని ఎన్‌డిడిబికి పంపామన్నారు.

ల్యాబ్‌లో పరీక్షల తర్వాత ఎస్ వేల్యూలో భారీ వ్యత్యాసాలు వెలుగు చూశాయన్నారు. వెంటనే ఇఆ ఆయా సంస్థలకు నోటీసులిచ్చి బ్లాక్ లిస్ట్‌లో పెట్టారని, అనంతరం చర్యలకు నిపుణుల కమిటీ వేసి మళ్ళీ టెండర్లు పిలిచారన్నారు. గత ఐదేళ్లలో వైసిపి పాలనలో తిరుమలను రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చేశారని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. లడ్డూ తయారీకి వాడే పదార్థాలకు రివర్స్ టెండరింగ్ పెట్టి నాణ్యత దెబ్బతీశారన్నారు. ఫలితంగా ప్రధాన సంస్థలు ఏపీ టెండర్లలో పాల్గొనలేకపోయాయని తెలిపారు. చేసిన తప్పును సమర్థించుకుంటూ ప్రధానికి లేఖ రాయడానికి జగన్‌కు ఎంత ధైర్యమని సిఎం చంద్రబాబు విమర్శించారు.

హిందూ సంప్రదాయం ప్రకారం ఎవరైనా చనిపోతే ఒక సంవత్సరం పాటు సంప్రదాయాలను గౌరవించి ఆలయానికి వెళ్లబోమని, ఇఆ ధర్మారెడ్డి వారి కుమారుడు చనిపోతే 12వ రోజు ఆలయానికి వస్తారా? ఇది అపచారం కాదా? అని ఆయన ప్రశ్నించారు. మాజీ ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి భార్య ఒక వైపు బైబిల్ పట్టుకుని తిరుగుతారని, భూమన కరుణాకర్‌రెడ్డి ఆయన కుమార్తె వివాహం క్రిస్టియన్ సంప్రదాయం ప్రకారం చేశారన్నారు. సుబ్బారెడ్డి ఛైర్మన్‌గా 3.75 లక్షల విఐపి టిక్కెట్లు ఇచ్చుకున్నారని తెలిపారు.

నేడు తిరుమలలో శాంతి హోమం

టిటిడి ఆగమ సలహా మండలి శాంతిహోమం నిర్వహించాలని నిర్ణయించిందని, సోమవారం ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు శాంతి హోమం, పంచగవ్యప్రోక్షణ చేస్తారని చంద్రబాబు తెలిపారు. మీడియా సమావేశంలో దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు.

అమెరికాలో మళ్లీ కాల్పులు

- నలుగురు మృతి

వాషింగ్టన్ : అమెరికాలో మరోసారి కాల్పులు కలకలం సృష్టించాయి. అలబామ రాష్ట్రం బర్మింగ్‌హామ్‌లోని ఫైవ్ పాయింట్స్ సౌత్ డిస్ట్రిక్ట్‌లో గుర్తు తెలియని దుండగులు . శనివారం రాత్రి 11 గంటల సమయంలో కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో నలుగురు ప్రాణాలు కోల్పోగా, మరో తొమ్మిది మంది తీవ్రంగా గాయపడ్డారు. పలువురు ఈ కాల్పులకు పాల్పడినట్లు భావిస్తున్నట్లు పోలీసు అధికారి ట్రూమాన్ ఫిట్జ్‌గెరాల్డ్ మీడియాకు ఆదివారం తెలిపారు. ఒక మహిళ సహా ముగ్గురు అక్కడికక్కడే మరణించారని చెప్పారు. మరొకరిని స్థానిక ఆసుపత్రికి తరలించగా, అక్కడ చనిపోయారని తెలిపారు. ఈ ఘటనలో తొమ్మిదిమంది తీవ్రంగా గాయపడ్డారని, వారిలో నలుగురికి ప్రాణాపాయ గాయాలున్నాయని చెప్పారు. ఈ ఏడాది ఇప్పటివరకూ అమెరికాలో 403 సామూహిక కాల్పుల ఘటనలు చోటచేసుకున్నాయి. 12,416 మంది ప్రాణాలు కోల్పోయారు.

వైసిపి కార్యాలయంపై దాడి

- నిరసన పేరుతో బిజెపి, బిజెవైఎం దుశ్చర్య
- జగన్‌మోహన్‌రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం
- దాడిని ఖండించిన సిపిఎం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తిరుమల ప్రసాదం కల్తీ పేరుతో సంఘ పరివార్ రాష్ట్రంలో ఉద్రిక్తతలను రెచ్చగొట్టేందుకు కుట్రలు చేస్తోంది. ఆదివారం బిజెపి, బిజెవైఎం కార్యకర్తలు మత ఉద్రిక్తతలు రెచ్చగొట్టేలా నినాదాలు చేస్తూ తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంపై దాడికి తెగబడ్డారు. బిజెవైఎం రాష్ట్ర అధ్యక్షులు మిట్టా వంశీకృష్ణ ఆధ్వర్యాన తాడేపల్లి కార్యాలయానికి చేరుకున్న కార్యకర్తలు హిందువుల మనోభావాలను దెబ్బతీశారంటూ నినాదాలు చేస్తూ తమ వెంట తెచ్చుకున్న కాషాయం కలర్ వున్న పాలథీన్ ప్యాకెట్‌లను, చెప్పులను వైసిపి కార్యాలయంపైకి విసిరారు. 108 సార్లు తిరుమల శ్రీవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ వైవి సుబ్బారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వైసిపి కార్యాలయం గేట్లు ఎక్కి లోపలకు దూసుకుపోయేందుకు ప్రయత్నించారు. అలాగే జగన్ నివాసంలోకి వెళ్లేందుకు ప్రయత్నించడంతో అక్కడ దాదాపు గంటపాటు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అక్కడ వున్న సెక్యూరిటీ సిబ్బంది ప్రధాన ద్వారం గేట్లు వేయడంతో గేటు ముందు కూర్చొని జగన్, వైవి సుబ్బారెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జగన్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. వైసిపి కార్యాలయంపైకి దాడికి వచ్చారన్న సమాచారంతో మాజీ మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, టిజెఆర్ సుధాకర్‌బాబు, నాయకులు దేవినేని అవినాష్, నారాయణమూర్తి తదితరులు అక్కడికి చేరుకునే లోపే పోలీసులు

మిగతా 2లో

తాడేపల్లిలోని వైసిపి కార్యాలయం పై కాషాయ రంగులు చల్లి విద్వేష నినాదాలు చేస్తున్న బిజెవైఎం మూకలు

సముద్ర భద్రతా సహకారంపై దృష్టి

క్వాడ్ సదస్సు పిలుపు

వాషింగ్టన్ : క్వాడ్ కూటమి మరే ఇతర దేశానికి ఉద్దేశించ బడినది కాదని నమ్మబలికేందుకు సభ్య దేశాలు యత్నిస్తుండగా, అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ చైనాపై దాడితో క్వాడ్ సమావేశాన్ని ప్రారంభించారు. దక్షిణ చైనా సముద్రంలో చైనా చర్యలపై మరింత దృఢమైన వైఖరిని అవలంభించాలని ఆయన కోరారు. దీనికి క్వాడ్‌లోని మిగతా దేశాలైన భారత్, జపాన్, ఆస్ట్రేలియా తందాన తాన అన్నాయి. దక్షిణ చైనా సముద్రం అంతటా భద్రతలో తమ సహకారాన్ని మరింత విస్తరింపజేయాలని, సముద్ర పర్యవేక్షణ పెంచాలని నిర్ణయించాయి. ఈ సదస్సుభారత ప్రధాని నరేంద్ర మోడీ, జపాన్ ప్రధాని ఫ్యుహియో కిషిదా, ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోని అల్బనీస్ పాల్గొన్నారు. క్వాడ్ సంయుక్త ప్రకటనలో గత సంవత్సరం కన్నా పదునైన భాషను ఉపయోగించారు. నేరుగా చైనా పేరు ప్రస్తావించకుండానే తూరుప, దక్షిణ చైనా సముద్రాలలో పరిస్థితి గురించి తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.

మోడీ ప్రస్తుత పర్యటనలో బైడెన్‌తో శనివారం జరిపిన భేటీ అనంతరం విడుదలజేసిన సంయుక్త ప్రకటనలోనూ సముద్ర మార్గాల నావిగేషన్, స్వచ్ఛమైన ఇంధన సరఫరా గొలుసులు నిర్మాణానికి రోడ్డు మ్యాప్ ప్రకటించారు. ప్రధాని మోడీ నేతృత్వంలోని భారత ప్రతినిధి బృందంలో విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జైశకంర్, విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్త్రీ, అమెరికాలోని భారత రాయబారి వినయ్ క్వాత్రా ఉన్నారు. అమెరికా ప్రతినిధి బృందంలో విదేశాంగ మంత్రి ఆంటోని బ్లింకెన్, జాతీయ భద్రతా సలహారాదు జేక్ సులివాన్, భారత్‌లోని అమెరికా రాయబారి ఎరిక్ గార్సెట్టి ఉన్నారు. ఇద్దరు నాయకులు పరస్పర ఆసక్తి ఉన్న రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత మెరుగుపరచుకోవడానికి తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. ఇండో-పసిఫిక్ వెలుపల తలెత్తే ప్రాంతీయ సమస్యలపైన ఈ ఇరువురు నేతలు అభిప్రాయాల మార్పిడి చేసుకున్నారని ఈ వర్గాలు తెలిపాయి. భారత్- అమెరికా భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకెళ్లడంలో బైడెన్ ఎంతో కృషి చేశారని మోడీ ప్రశంసలు కురిపించారు.



సదస్సులో బైడెన్, కిషిదా, అల్బనీస్‌లతో మోడీ

బైడెన్ మరోసారి తడబడ్డారు

ట్రంప్‌తో ప్రెసిడెన్షియల్ డిబేట్‌లో మొదలైన బైడెన్ తడబాటు పరంపర క్వాడ్ సదస్సులోనూ కొనసాగింది. ఇండో పసిఫిక్ కూటమి క్వాడ్ సదస్సునుద్దేశించి బైడెన్ మాట్లాడుతూ తడబాటుకు గురయ్యారు. భారత ప్రధాని నరేంద్ర మోడీని పరిచయం చేసే క్రమంలో ఒక్క క్షణం ఆగిపోయారు. ఇప్పుడు ఎవరిని పరిచయం చేస్తున్నాను? అంటూ పక్కన ఉన్న తన సిబ్బందిని ఆయన మెల్లగా అడిగారు. ఇది వరకు పలు సందర్భాల్లో తడబడడం, ఆయన మానసిక స్థితిపై విస్తృతంగా ప్రచారం జరిగిన నేపథ్యంలో సొంత పార్టీ నుంచే వ్యతిరేకత రావడంతో ఎన్నికల బరి నుంచి బైడెన్ తప్పుకుని, హారిస్‌ను అభ్యర్థిగా నిలిపిన సంగతి తెలిసిందే.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు మృతి

ప్రజాశక్తి- యంత్రాంగం

రాష్ట్రంలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం... అనంతపురం జిల్లా కేంద్రంలోని స్టాలిన్ నగర్‌కు చెందిన దాసరి శ్రీనివాసులు (23), షేక్ మస్తాన్ (19), ఎర్రగుడి పవన్ కుమార్, ఓబులశెట్టి పవన్ (23) కారులో నార్పలకు శనివారం రాత్రి 12 గంటల సమయంలో బయలుదేరారు. నార్పల నుండి అనంతపురానికి వేరుశనగ విత్తనాలతో వస్తున్న లారీ బుక్కరాయసముద్రం మండలం రేగులకుంట సమీపాన ఆ కారును ఢీకొనడంతో అందులోని నలుగురూ అక్కడికక్కడే మృతి చెందారు. కాగా నెల్లూరు జిల్లాకు చెందిన 8 మంది కారులో అరుణాచలానికి వెళ్లి తిరిగి వస్తుండగా తిరుపతి జిల్లా చిల్లకూరు సమీపంలో ఆదివారం తెల్లవారు జామున కంటైనర్ లారీని వారి కారు వెనుక నుంచి ఢీకొంది. దీంతో, కారు డ్రైవర్ జగదీష్ (50), నెల్లూరు మండలం కాకుపల్లి గ్రామానికి చెందిన గోనెల బాబు (45), వనంతోపునకు చెందిన వెన్నెల మేఘన (8) మరణించారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడడంతో ఆస్పత్రికి తరలించారు.

జనతాకీ అదాలత్‌లో మాట్లాడుతున్న కేజ్రీవాల్

నేను దొంగనా? వారు దొంగలా?

- జనతాకీ అదాలత్‌లో అరవింద్ కేజ్రీవాల్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

తనను అవినీతిపరుడిగా చిత్రీకరించేందుకు ప్రధాని మోడీ కుట్ర పన్నారని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధినేత, ఢిల్లీ మాజీ సిఎం అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. 'విద్య, వైద్యం, విద్యుత్ ఉచితంగా అందిస్తున్న నేను దొంగనా? లేదా నన్ను జైలుకు పంపిన వ్యక్తులు దొంగలా?' అని ఆయన ప్రజలను ప్రశ్నించారు. ఇక్కడి జంతర్‌మంతర్ వద్ద ఆదివారం జరిగిన 'జనతాకీ అదాలత్' కార్యక్రమంలో కేజ్రీవాల్ మాట్లాడారు. 'ప్రధాని నరేంద్ర మోడీ మాపై కుట్ర పన్నారు. నన్ను, (ఆప్ నేత) మనీష్ సిసోడియా అవినీతిపరుడని నిరూపించేందుకు కుట్ర చేశారు. మా ప్రతిష్టను దెబ్బతీసేందుకు ప్రయత్నించారు' అని అన్నారు. 'సిఎం కుర్చీపై ఆకలి లేకపోవడం వల్లే రాజీనామా చేశా. డబ్బు సంపాదించడానికి కాదు, దేశ రాజకీయాలను మార్చేందుకే వచ్చా' అని అన్నారు. పదేళ్లపాటు సిఎంగా ఉండి కూడా ఢిల్లీలో తనకు సొంత ఇల్లు లేదన్నారు. బిజెపి తనను అవినీతిపరుడని అనడంతో బాధపడ్డానని కేజ్రీవాల్ ఆవేదన వ్యక్తం చేశారు. 'అరవింద్ కేజ్రీవాల్ నిజాయతీ లేనివాడైతే ప్రజలకు ఉచిత విద్యుత్, మహిళలకు బస్సు ప్రయాణం ఉచితంగా ఇచ్చేవాడా? పిల్లల కోసం స్కూళ్లు కట్టించేవాడా? ఆస్పత్రుల్లో వైద్యం ఉచితంగా అందించేవాడా?' అని ప్రశ్నించారు. 22 రాష్ట్రాల్లో బిజెపి అధికారంలో ఉందని, వారు ఏ రాష్ట్రంలోనైనా ఉచిత

మిగతా 5లో

త్వరలో నామినేటెడ్ పదవులు భర్తీ

- టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న నామినేటెడ్ పోస్టుల భర్తీకి కసరత్తు చేస్తున్నామని, త్వరలో వీటిని భర్తీ చేస్తామని టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారికి నామినేటెడ్ పదవుల నియామకాల్లో సముచిత ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. కూటమిలోని మూడు పార్టీల్లో కష్టపడ్డ నేతలకు ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, గ్రామస్థాయి పార్టీ నేతలతో ఆదివారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రభుత్వం వచ్చిన 100 రోజుల్లో చేసిన పనులు, గత పాలకుల పాపాలను ప్రజలకు తెలియజేయాలని అన్నారు. 100 రోజుల్లో ఏం చేశామో ప్రజలకు చెప్పాలన్నారు. నేతలు ఇంటింటికీ వెళ్లాలని ఆదేశించారు. గ్రామ, వార్డు సచివాలయాలతో పార్టీ ప్రజా

ప్రతినిధులు సమన్వయం చేసుకోవాలని చెప్పారు. దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్స్ ఇస్తామన్నారు. 2029 నాటికి టిడిపిని తిరుగులేని శక్తిగా మారుస్తామని అన్నారు. గత పాలకులు ప్రజల సెంటిమెంట్‌తోనూ ఆడుకునే స్థాయికి దిగజారారని విమర్శించారు. తిరుపతి లడ్డూలో జంతువుల కొవ్వు వినియోగించారని, దోషులను వదలబోమని హెచ్చరించారు. గత ప్రభుత్వం ఒక్క డిఎస్‌సి కూడా నిర్వహించకుండా యువతను తీవ్ర నిరాశలో కూరుకుపోయేలా చేసిందని విమర్శించారు. తమ ప్రభుత్వం తొలి సంతకం మెగా డిఎస్‌సి హామీపై చేసిందని తెలిపారు. రాబోయే రోజుల్లో భారీ ఎత్తున పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. 2029 నాటికి నిరుపేదలందరికీ ఇళ్లు నిర్మిస్తామని, ఏడాదిలో 8.25 లక్షల ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. పోలవరాన్ని త్వరితగతిన పూర్తిచేస్తామని చెప్పారు. త్వరలోనే రాజధాని పనులు మొదలుపెడతామని, అమరావతికి ప్రసిద్ధ విద్యాసంస్థలు వస్తున్నాయని తెలిపారు. జలవనరులు, జాతీయ రహదారుల ప్రాజెక్టులు, మౌలిక వసతులకు రూ.2,500 కోట్లు, కేంద్ర ప్రభుత్వం రాజధానికి ప్రత్యేక ఆర్థిక సాయం రూ.15 వేల కోట్లు ప్రకటించిందన్నారు. భవిష్యత్తులో థర్మల్ విద్యుత్ వినియోగాన్ని తగ్గించి సౌర విద్యుత్ వాడకాన్ని పెంచాలన్నారు.

టిడిపిపై తప్పుడు ప్రచారం

- మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తమ పార్టీ గురించి వైసిపి నాయకులు అనేక తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని టిడిపి నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి విమర్శించారు. టిడిపి వంద రోజుల పాలనలో అనేక విజయాలు సాధించామని చెప్పారు. టిడిపి కార్యాలయంలో ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. జగన్ వంద రోజుల పాలనలో కేవలం రూ.250 పెన్షన్ పెంచడం తప్పితే ఏమీ చేయలేదన్నారు. డిబిటి పథకం ద్వారా దోచుకో, పంచుకో, తినుకో అని పథకాలు చేశారే తప్ప ప్రజలకేమీ చేయలేదని విమర్శించారు.

తప్పుడు సమాచారంతో ప్రధానికి జగన్ లేఖ : పట్టాభిరామ్

తిరుమల లడ్డూ విషయంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి తప్పుడు సమాచారంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లేఖ రాశారని టిడిపి అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ విమర్శించారు. జగన్ ప్రభుత్వంలోని వ్యవస్థలన్నింటినీ సర్వనాశనం చేశారని టిడిపి బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ బుచ్చిరామ్ ప్రసాద్ విమర్శించారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

ఎమ్మెల్యే నానాజీపై సమగ్ర విచారణ జరపాలి

- కెవిపిఎస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కాకినాడలోని రంగరాయ మెడికల్ కాలేజీ స్పోర్ట్స్ వైస్ ఛైర్మన్ దళితుడైన డాక్టర్ ఉమామహేశ్వరరావును నోటికి వచ్చినట్లు బూతులు తిట్టి దాడిచేసిన జనసేన ఎమ్మెల్యే పంతం నానాజీ, ఆయన అనుచరులపై సమగ్ర విచారణ జరిపి కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కెవిపిఎస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మల్యాద్రి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మెడికల్ కాలేజీ ఆవరణలో తమ అనుచరులకు వాలీబాల్ ఆడుకునేందుకు అవకాశం ఇవ్వలేదని దాడి చేయడం తగదని అన్నారు. తక్షణం పంతం నానాజీ ఆయన అనుచరులపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

చిరంజీవికి గిన్నిస్‌బుక్ విశిష్ట గౌరవం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నాలుగు దశాబ్దాలకుపైగా సినీ ప్రస్థానంలో కోట్లాది అభిమానులను సొంతం చేసుకున్న ప్రముఖ కథానాయకుడు మెగాస్టార్ చిరంజీవి.. సినీ పరిశ్రమకు చేసిన సేవలకు విశిష్ట గౌరవం లభించింది. ఆయన గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నారు. 156 చిత్రాలు.. 537 పాటలు.. 24 వేల స్టెప్పులతో అలరించినందుకు ఆయనకు ఈ రికార్డు దక్కింది. హైదరాబాద్‌లో నిర్వహించిన వేడుకలో గిన్నిస్ బుక్ ప్రతినిధులు, బాలీవుడ్ నటుడు అమీర్ ఖాన్ ఈ అవార్డును చిరంజీవికి ప్రదానం చేశారు. ప్రముఖ దర్శకులు రాఘవేంద్రరావు, బి.గోపాల్, కోదండరామిరెడ్డి, గుణశేఖర్, బాబీతో పాటు నిర్మాతలు అల్లు అరవింద్, అశ్వనీదత్, శ్యామ్‌ప్రసాద్ రెడ్డి, సురేశ్ బాబు, జెమిని కిరణ్, మైత్రి రవిశంకర్, తమ్మారెడ్డి భరద్వాజ, కేఎస్ రామారావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. చిరంజీవికి అభినందనలు తెలిపారు.

విహారయాత్రలో విషాదం

- జలపాతంలో కొట్టుకుపోయిన ఐదుగురు వైద్య విద్యార్థులు
- ఇద్దరి ఒడ్డుకు చేరగా ముగ్గురు గల్లంతు

ప్రజాశక్తి- రంపచోడవరం (అల్లూరి జిల్లా)

అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి మండలంలోని జలపాతంలో ఒక్కసారిగా పెరిగిన వరద ఉధృతికి ఐదుగురు వైద్య విద్యార్థులు గల్లంతయ్యారు. వారిలో ఇద్దరు బయటపడ్డారు. మిగిలిన ముగ్గురు ఆచూకీ లభ్యం కాలేదు. ఆదివారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి తోటి విద్యార్థుల కథనం ప్రకారం... ఏలూరులోని ఆశ్రమ మెడికల్ కాలేజీలో చదువుతున్న 13 మంది వైద్య విద్యార్థులు విహారయాత్రకు వచ్చారు. మారేడుమిల్లి మండలం వాలమూరు గ్రామంలోని జలతరంగిణి జలపాతంలో స్నానం చేస్తుండగా మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి వాగు ఒక్కసారిగా పొంగడంతో ఐదుగురు గల్లంతయ్యారు. వారిలో ఇద్దరు బయటపడ్డారు. విజయనగరం జిల్లా బొబ్బిలికి చెందిన కె.సౌమ్య, బి.అమృత, ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన సిహెచ్.హరిదీప్ గల్లంతయ్యారు. వారి కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. బయటపడిన దాడి గాయత్రి పుష్ప, చింత హరిణిప్రియలను రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. వారిలో పరిస్థితి విషమంగా ఉన్న హరిణిని మెరుగైన వైద్యం కోసం రాజమండ్రి ఏరియా ఆస్పతికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహాధర్నానుద్దేశించి మాట్లాడుతున్న స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు అయోధ్యరామ్

విశాఖ ఉక్కు పరిరక్షణకు మహాధర్నా

ప్రజాశక్తి- ఉక్కునగరం, గాజువాక (విశాఖపట్నం)

విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం సిఐటియు ఆధ్వర్యాన నిర్వాసిత కాలనీల్లో ఆదివారం మహాధర్నా చేపట్టారు. అగనంపూడి, వడ్లపూడి, పెదగంట్యాడ, గంగవరం, ఉక్కు నగరంలో ధర్నాలు నిర్వహించారు. ధర్నాలనుద్దేశించి స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ.. ఉద్యమాన్ని నిర్వాసిత గ్రామాల్లో బలోపేతం చేయడం కోసం ఈ మహాధర్నా చేపట్టినట్లు తెలిపారు. జివిఎంసి కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ సెంటిమెంట్‌తో విశాఖ స్టీల్‌ప్లాంట్ ఏర్పడిందని, దీనిని ప్రతి ఒక్కరూ గౌరవించాలని అన్నారు. స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి.దాస్ మాట్లాడుతూ కార్మికులను ప్రోత్సహించకుండా, పూర్తి స్థాయి ఉత్పత్తి చేయకుండా స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షిస్తామని చెబుతున్న ప్రభుత్వ, యాజమాన్య మాటలు నీటి మీద రాతలే అని విమర్శించారు. ప్రభుత్వం, యాజమాన్యం వైఖరిని తక్షణం మార్చుకోకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. మాజీ కార్పొరేటర్ కె.విమల మాట్లాడుతూ.. బిజెపి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను అమ్మకానికి పెట్టి నిర్వాసితుల భవిష్యత్తును అంధకారంలోకి నెడుతోందని విమర్శించారు. రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం తక్షణం ఈ సమస్యపై కేంద్ర సర్కారుపై ఒత్తిడి తెచ్చి స్టీల్‌ప్లాంట్‌ను కాపాడాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా విశాఖ అధ్యక్షులు కెఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఉక్కు పరిరక్షణకు హామీ ఇచ్చిన కూటమి టిడిపి కూటమి ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోవడం లేదని, పరిస్థితిలో మార్పు రాకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

హంద్రీనీవా ఎత్తిపోతల ప్రాజెక్టు మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

వచ్చే సీజన్‌కు హంద్రీనీవా పూర్తి

- రాయలసీమను రతనాలసీమగా మారుస్తాం
- ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్, అనంతపురం ప్రతినిధి

హంద్రీనీవాను వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికి పూర్తి చేస్తామని ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. హంద్రీనీవా ప్రధాన కాలువ నుండి సాగునీటి కాలువల ద్వారా స్థిరీకరించిన ఆయకట్టుకు నీరందించి రాయలసీమను రతనాలసీమగా మారుస్తామని అన్నారు. నంద్యాల, అనంతపురం జిల్లాల్లో ఆయన ఆదివారం పర్యటించి పలు ప్రాజెక్టులను పరిశీలించారు. తొలుత నందికొట్కూరులో మల్యాల ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించి జలహారతి ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హంద్రీనీవా సామర్థ్యం పెంచేందుకు, ప్రధాన కాలువను విస్తరించడానికి పరిశీలనకు వచ్చినట్లు తెలిపారు. ఆసియాలోనే పెద్దది, పొడవైన ఎత్తిపోతల పథకం నిర్మించిన ఘనత టిడిపిదేని అన్నారు. 3850 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసేలా మల్యాల ఎత్తిపోతల పథకాన్ని నిర్మించినట్లు తెలిపారు. జగన్ పాలనలో హంద్రీనీవా పనులు వెనుకబడిపోయాయని, ప్రాజెక్ట్ సామర్థ్యం 40 టిఎంసిలు అయితే కనీసం 20 టిఎంసిల నీటిని కూడా రాయలసీమకు అందించలేదని విమర్శించారు. గత ప్రభుత్వం చేసిన తప్పులు సరిదిద్ది, హంద్రీనీవాను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకోస్తామని తెలిపారు. టిడిపి ప్రభుత్వంలో హంద్రీనీవా కాలువల పనులు 90 శాతం పూర్తి చేస్తే జగన్ మిగిలిన 10 శాతం పనులు పూర్తి చేయలేదన్నారు. నెలలో రెండుసార్లు రాయలసీమలో పర్యటించి సీమ ప్రాజెక్టులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం అనంతపురంలో హంద్రీనీవా ప్రాజెక్టును మంత్రి నిమ్మల పరిశీలించారు. నగరంలోని ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాయలసీమ ప్రాంతానికి సాగు, తాగునీటిని అందించడం తమ తొలి ప్రాధాన్యత అని చెప్పారు. హంద్రీనీవా ప్రవాహ సామర్థ్యం 3500 క్యూసెక్కులైతే 1850 క్యూసెక్కులకు మించి ఇవ్వలేని పరిస్థితి ఉందన్నారు. తమ ప్రభుత్వం సాగు,తాగునీటి ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యతనిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, బిసి సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ తదితరులు పాల్గొన్నారు.

దళిత డాక్టర్‌పై దాడి హేయం

- మాజీ ఎమ్మెల్యే టిజెఆర్ సుధాకర్‌బాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కాకినాడలోని రంగరాయ మెడికల్ కాలేజీలో దళిత ప్రొఫెసర్‌పై జనసేన ఎమ్మెల్యే పంతం నానాజీ దాడి చేయడం దుర్మార్గమైన చర్య అని వైసిపి మాజీ ఎమ్మెల్యే టిజెఆర్ సుధాకర్‌బాబు పేర్కొన్నారు. దళిత ప్రొఫెసర్‌పై జరిగిన దాడిని అంతా ఖండించాలని కోరారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. పంతం నానాజీ అందరిముందు ప్రొఫెసర్‌ను దుర్భాషలాడుతూ చెంపమీద కొట్టడం ఏమిటని ప్రశ్నించారు. కూటమి వచ్చాక రాష్ట్రంలో సామాన్యులకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు. పంతం నానాజీపై కేసు పెట్టకుండా రాజీ చేయించుకోవడం తగదని, తక్షణం ఆయనపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే తమ ఎమ్మెల్యే దళితులపై దాడి చేయడం పట్ల పవన్‌కల్యాణ్ స్పందించాలన్నారు.

వైసిపి కార్యాలయంపై దాడి

(మొదటి పేజీ తరువాయి)

బిజెపి, బిజెవైఎం కార్యకర్తలను అరెస్టు చేసి మంగళగిరి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలి : వైసిపి

వైసిపి కార్యాలయంపై దాడికి పాల్పడ్డ బిజెవైఎం కార్యకర్తలను కఠినంగా శిక్షించాలని వైసిపి గ్రీవెన్స్‌సెల్ రాష్ట్ర అధ్యక్షులు అంకంరెడ్డి నారాయణమూర్తి తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమ కార్యాలయంపై దాడికి వచ్చినవారు తమ పార్టీ సెక్యూరిటీ ఆఫీసర్ ఈశ్వర్, ఆర్‌ఎస్‌ఐ వీరేష్, కానిస్టేబుల్స్ రవీంద్రరెడ్డి, ఖాజాను భయభ్రాంతులకు గురిచేశారని తెలిపారు. వైసిపి కేంద్ర కార్యాలయానికి భద్రత పెంచాలని కోరారు.

దాడి హేయమైంది : మాజీ మంత్రి అంబటి

బిజెవైఎం కార్యకర్తలు తమ కార్యాలయంపైకి దాడికి తెగబడటాన్ని ప్రజాస్వామ్యవాదులంతా తీవ్రంగా ఖండించాలని మాజీ మంత్రి అంబటి రాంబాబు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కుట్ర రాజకీయాలు నడుస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి కార్యాలయంపై జరిగిన దాడికి పురందేశ్వరి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వందరోజుల వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు పాల్పడుతున్న హింసా రాజకీయాలను అంతా ఖండించాలని కోరారు.

దాడికి సిపిఎం ఖండన

తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంపై బిజెపి దాడిని సిపిఎం తీవ్రంగా ఖండించింది. తిరుపతి లడ్డూ సమస్యను ఆసరా చేసుకుని బిజెపి అనుబంధ బిజెవైఎం కార్యకర్తలు వైసిపి కేంద్ర కార్యాలయంపై దాడి చేయడాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సంఘ్ పరివార్ శక్తులు ఒక పథకం ప్రకారం తిరుపతి లడ్డూ సమస్యను ఆసరా చేసుకుని మత ఉద్రిక్తతలు రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. ఇలాంటి దాడులను అరికట్టాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై వుందని, రాష్ట్రంలో శాంతి భద్రతలను, ప్రజల మధ్య మత సామరస్యాన్ని కాపాడాలని కోరారు.

తప్పు చేసిన వారిని జగన్ సమర్థించడం తగదు : పవన్ కల్యాణ్

- నంబూరు ఆలయంలో ప్రాయశ్చిత్త దీక్ష

ప్రజాశక్తి- యంత్రాంగం

దీక్షలో పవన్ కల్యాణ్

గత ఐదేళ్లలో టిటిడి బోర్డు చేసిన తప్పులను వైఎస్ జగన్ సమర్థించడం సరికాదని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. గుంటూరు జిల్లా నంబూరులోని దశావతార వెంకటేశ్వర ఆలయంలో ఆయన ఆదివారం ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. లడ్డూ వివాదంలో ఎలాంటి రాజకీయ లాభాపేక్ష లేదన్నారు. గత ప్రభుత్వం సంస్కరణల పేరుతో అనేక మార్పులు చేసిందని తెలిపారు. వైసిపి పాలనలో 219 ఆలయాలను అపవిత్రం చేశారని విమర్శించారు. టిటిడిపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాల్సిన అవసరముందని పేర్కొన్నారు. లడ్డూ వివాదంపై రాజకీయ లబ్ధి ఉందని వైసిపి ఆరోపించడం సరికాదన్నారు. తప్పులు జరుగుతుంటే చేతులు కట్టుకొని కూర్చోలేమని తెలిపారు. తాను సనాతన ధర్మాన్ని రక్షించేందుకు కృషి చేస్తానని, ఏ మతం వారికి అన్యాయం జరిగినా స్పందిస్తానని చెప్పారు. తిరుమల ప్రసాదాల నాణ్యత లోపం, కల్తీ గురించి తాము గతంలోనే చెప్పామని.. అయినా, జగన్ ఎప్పుడూ స్పందించలేదన్నారు. 2019 తరువాత వైసిపి ప్రభుత్వం తిరుమలలో ఎన్నో మార్పులు చేసిందన్నారు. శ్రీవాణి ట్రస్టు పేరుతో రూ.10 వేలు వసూలు చేసి రూ.500 టికెట్లు ఇచ్చారని ఆరోపించారు. తిరుమలలో ఎన్నో అక్రమాలు జరుగుతుంటే ధర్మారెడ్డి, సుబ్బారెడ్డి ఏం చేశారని ప్రశ్నించారు. దోషులకు శిక్ష పడాల్సిందేనని, వేదన కలిగినప్పుడు పోరాడతానని తెలిపారు. ఈ అంశంపై కెబినెట్లో, అసెంబ్లీలో చర్చ జరగాలని కోరారు.

డిప్యూటీ సిఎంతో టిటిడి ఇఒ భేటీ

డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్‌తో టిటిడి ఇఒ జె శ్యామలరావు ఆదివారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ధార్మిక అంశాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడొద్దని పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారు. లడ్డూ తయారీలో వినియోగించిన నెయ్యి కల్తీతో పాటు అందులో జంతు అవశేషాలు ఉన్నాయనే అంశాన్ని పవన్‌కల్యాణ్‌కు ఇఒ వివరించారు. గత పాలకమండలి హయాంలో నెయ్యి సరఫరాదారులను ఎంపిక చేసిన ప్రక్రియను, ల్యాబ్ పరీక్షల్లో వెల్లడైన ఫలితాలను వివరించారు. ప్రస్తుతం లడ్డూ ప్రసాదం, శ్రీవారి ప్రసాదాల తయారీలో నిబంధనలను, శాస్త్రోక్తమైన నియమాలను పకడ్బందీగా అమలు చేస్తున్నామని ఇఒ తెలిపారు. టిటిడి సంప్రోక్షణ కార్యక్రమాన్ని చేపడుతోందని తెలిపారు. ఈ సందర్భంగా భక్తుల మనోభావాలకు విఘాతం కలగకుండా చూడాలని ఇఒకు పవన్‌కల్యాణ్ సూచించారు.

లడ్డూ అంశంలో వాస్తవాలు నిగ్గు తేల్చండి

- ప్రధాని మోడీకి మాజీ సిఎం జగన్ లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో / తిరుపతి సిటీ :

తన రాజకీయాల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు టిటిడి ప్రతిష్టను దిగజార్చేలా తిరుమల ప్రసాదంపై అనుమానాలను పెంచేలా మాట్లాడిన అంశాలపై కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని నిగ్గుతేల్చాలని వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి ఆదివార వైఎస్ జగన్ లేఖ రాశారు. ఎన్నికలకు ముందు టిడిపి రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక అమలు చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని తెలిపారు. రాష్ట్రంలో వంద రోజుల పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు లడ్డూ తయారీలో నెయ్యి బదులు జంతువుల కొవ్వును వాడారని దుష్ప్రచారంతో ప్రజల మనోభావాలను రెచ్చగొడుతున్నారని తెలిపారు. టిటిడిలో నాణ్యతను తనిఖీ చేసేందుకు పకడ్బందీ వ్యవస్థ వుందని పేర్కొన్నారు. చాలా పర్యాయాలు నెయ్యిలో నాణ్యత లేదని వెనక్కు పంపిన సందర్భాలూ అనేకం వున్నాయని తెలిపారు. టిడిపి హయాంలో 15 సార్లు నెయ్యి ట్యాంకర్లు తిరస్కరణకు గురైతే తమ ప్రభుత్వ హయాంలో 18 పర్యాయాలు నాణ్యతా ప్రమాణాలు లేవని నెయ్యి ట్యాంకర్లను వెనక్కు పంపామన్నారు. చంద్రబాబు ఆరోపణలపై నిజనిజాలను తేల్చాలని కోరారు. తిరుమల ఆలయ వ్యవహారాల్లో రాష్ట్ర ప్రభుత్వ పాత్ర పరిమితంగా వుంటుందని తెలిపారు. వివిధ రంగాల్లో నిష్ణాతులు, భక్తులు, ఇతర రాష్ట్రాలకు చెందిన మంత్రులు, కేంద్ర మంత్రులతో కూడి వున్న ధర్మకర్త మండలి ఈ వ్యవహారాలను పర్యవేక్షిస్తుందన్నారు. అయినా టిడిపి రాజకీయంగానే దుష్ప్రచారం చేస్తోందన్నారు. సున్నితమైన అంశాన్ని రాజకీయ అవసరాల కోసం వాడుకుంటున్నారని విమర్శించారు. లడ్డూ వివాదంలో వాస్తవాలు అందరికీ తెలియాల్సిన అవసరం వుందని, ఆ మేరకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఏ విచారణకైనా సిద్ధం : భూమన కరుణాకర్ రెడ్డి

శ్రీవారి లడ్డు తయారీలో కల్తీ నెయ్యి వాడారని సిఎం చంద్రబాబు నాయుడు చేసిన ఆరోపణలు అవాస్తవమని, దీనిపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి చేతకాని, సిబిఐ చేతకాని విచారణ జరిపించాలని టిటిడి మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి సవాల్ విసిరారు. తిరుపతిలోని ఆయన నివాసంలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ మాజీ సిఎం వైఎస్ జగన్‌ని, వైసిపిని నామరూపాలు లేకుండా చేసి, రాజకీయంగా అణగదొక్కాలనే ఉద్దేశంతోనే ఇలాంటి దిగజారుడు రాజకీయాలకు చంద్రబాబు పాల్పడ్డారని ఆరోపించారు. ఏ పాలక మండలిలోనైనా నెయ్యి సరిపడా తదితర వాటిని పర్యవేక్షించేందుకు కమిటీ ఉంటుందని, తమ హయాంలో ఉన్న కమిటీలో ప్రస్తుతం టిడిపిలో ఉన్న మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే వేమూరి ప్రశాంతిరెడ్డి, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు, ప్రధాని మోడీకి సుపరిచితుడైన వైద్యనాథన్ కృష్ణస్వామి సభ్యులుగా ఉన్నారని, వారే ఈ విమర్శలపై నిజానిజాలు నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. టిడిపి హయాంలో హెల్త్ ఆఫీసర్‌గా పని చేసిన సరిష్ట సైతం ప్రసాదాల తయారీలో కల్తీ జరిగే ఆస్కారమే లేదని ప్రకటించిన విషయం వాస్తవం కాదా అన్నారు. ప్రస్తుతం చంద్రబాబు విమర్శిస్తున్న తమిళనాడుకు చెందిన ఇదే కంపెనీ టిడిపి హయాంలోనూ నెయ్యి సరిఫరా చేసిందన్నారు. కలుషితమైంది నెయ్యి కాదు.. బాబు మనస్తత్వం అని విమర్శించారు. చంద్రబాబు ఆరోపణలపై ప్రధాని నరేంద్ర మోడీ స్పందించాలన్నారు.

బుడమేరు ముంపుతో వ్యాపారాలు వెలవెల

- దుకాణాల పునరుద్ధరణకు అష్టకష్టాలు

ప్రజాశక్తి- కృష్ణా ప్రతినిధి

బుడమేరు ముంపు ప్రభావంతో మధ్య తరగతి, చిరు వ్యాపారులు, హాకర్లు సమస్యల సుడిలో చిక్కుకున్నారు. ముంపు బారిన పడిన దుకాణాలను పూర్తి స్థాయిలో పునరుద్ధరించేందుకు ప్రభుత్వ చేయూత, బ్యాంకుల రుణ సాయం కోసం ఎదురు చూస్తున్నారు. మరోపక్క వ్యాపారాలు పడిపోవడంతో దుకాణాల అద్దెలకు, కుటుంబ పోషణకు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో 32 డివిజన్లు బుడమేరు వరద ముంపునకు గురయ్యాయి. మూడు లక్షల మంది ప్రజలు వరదలో చిక్కుకున్నారు. అజిత్‌సింగ్ నగర్, కండ్రిక, పాయకాపురం, కొత్త రాజరాజేశ్వరిపేట, జక్కంపూడి వైఎస్ఆర్ కాలనీ, పాలప్రాజెక్టు, భవానీ పురం, విద్యాధరపురం తదితర ప్రాంతాల్లోని అత్యధికులు ముఠా, భవన నిర్మాణ పనులకు వెళతారు. ఆటోలు కిరాయికి తోలుకుంటూ జీవిస్తారు. పది రోజులపాటు లక్షలాది మంది వరదలో బిక్కుబిక్కుమంటూ జీవనం సాగించారు. మరికొందరు బయటకు వచ్చి బంధువులు, స్నేహితులు, తెలిసిన వారి ఇళ్లల్లో తలదాచుకున్నారు. కానీ, ఇళ్లల్లోని వస్తువులు, ఫర్నిచర్, ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ పరికరాలు, తదిరత్రా సామగ్రి మునిగిపోవడంతో ఒక్కో కుటుంబం సరాసరి రూ.50 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు నష్టపోయింది. ముంపు ప్రభావం తగ్గిన తర్వాత కూడా పూర్తి స్థాయిలో ఉపాధి లభించడం లేదు. ప్రభుత్వం ప్రకటించిన పరిహారం కూడా ఇంకా అందలేదు. దీంతో, రోజువారీ ఖర్చులు లేకపోవడంతో అత్యవసరమైతే తప్ప సరుకులు, వస్తువులు కొనుగోలు చేయడం లేదు. ఈ పరిస్థితిలో వ్యాపారాలు పూర్తిగా తగ్గిపోయాయి. చిన్న వ్యాపారులపై తీవ్ర ప్రభావం పడింది. ముంపునకు గురైన సింగ్‌నగర్ రైలు కట్టనుంచి కండ్రిక వరకు తొమ్మిది డివిజన్లలో 400 మంది చిన్న, మధ్య తరగతి వ్యాపారులు, హాకర్ల పరిస్థితి దయనీయంగా మారింది.

విజయవాడ బీసెంట్ రోడ్

బాల శ్రీనివాసరావు

ఎ.కొండలరావు

వెంకట అరవిందకుమార్

ఎస్‌కె.సుభానీ

కృష్ణ సాయి ప్రసాద్

విజయవాడ ప్రకాష్‌నగర్‌కు చెందిన ముచ్చల బాల శ్రీనివాసరావు పదేళ్ల నుంచి షాపును అద్దెకు తీసుకుని కిరాణా వ్యాపారం చేస్తున్నారు. రోజుకు సగటున ఏడాది క్రితం వరకు రూ.6 వేల వరకు వ్యాపారం చేసేవారు. సమీపంలో డీ మార్టు పెట్టడంతో ఆయన వ్యాపారం పడిపోయింది. వరద రాక ముందు వరకు రోజుకు రూ.4 వేల వరకు వ్యాపారం జరిగేది. వరద వచ్చిన తర్వాత వ్యాపారం రూ.2 వేలకు పడిపోయింది. వరద కారణంగా ఆయన షాపు ముంపునకు గురికావడంతో రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లింది. ప్రచారీ సరుకులు, బియ్యం తదితరాలు వరద నీటిలో మునిగిపోయాయి. దీంతో, రూ.30 వేలు అప్పు చేసి కొద్ది మొత్తంలో హోల్‌సేల్‌గా సరుకులు కొనుగోలు చేసి వ్యాపారం మళ్లీ మొదలు పెట్టారు. నామమాత్రపు వ్యాపారంతో నెలకు రూ.7 వేలు అద్దె చెల్లించలేనని, కుటుంబపోషణ కూడా కష్టమని బాల శ్రీనివాసరావు వాపోతున్నారు. కిరాణా దుకాణం పూర్తి స్థాయిలో పునరుద్ధరణకు ప్రభుత్వం బ్యాంకు రుణాలు ఇప్పించాలని కోరుతున్నారు.

కొండలరావుకు చెందిన శ్రీ విజయలక్ష్మి స్టీల్ హౌస్‌లో వరదలకు ముందు రోజువారీ రూ.12 వేలు స్టీల్, అల్యూమినియం, ఇత్తడి సామాన్లు విక్రయించేవారు. ఇప్పుడు వ్యాపారం రోజుకు రూ.5 వేలకు పడిపోయింది. ఇంటికి, కొట్టుకు అద్దె నెలకు రూ.25 వేలు చెల్లించాలి. సయ్యద్ రియాజ్‌కు చెందిన ఆర్‌ఆర్ ఫుట్‌వేర్ వ్యాపారం రూ.10 వేల నుంచి రూ.4 వేలకు పడిపోయింది. దుకాణానికి నెలకు రూ.10 వేలు అద్దె చెల్లించాలి. వనమా వెంకట అరవిందకుమార్‌కు చెందిన శ్రీ విజయదుర్గా క్లాత్ స్టోర్ నీట మునగడంతో రూ.30 లక్షలు నష్టపోయారు. వరదలకు ముందు వరకూ రోజుకు రూ.15 వేల మేర వస్త్ర విక్రయాలు జరిగేవి. ఇప్పుడు వ్యాపారం రూ.2 వేలకు పడిపోయింది. నెలకు రూ.25 వేలు అద్దె చెల్లించాలి. అనపర్తి ఉమాశంకర్ తోపుడు బండిపై రోజుకు పది అరటి గెలలు అమ్మేవారు. దీనిద్వారా ఖర్చులుపోను రూ.600 మిగిలేవి. పూల వ్యాపారం రూ.1,000 వరకు చేసేవారు. దీనిలో రూ.300 మిగిలేది. ఇప్పుడు నాలుగు అరటి గెలలు మాత్రమే విక్రయించగలుగుతున్నారు. రూ.300 విలువైన పూలు మాత్రమే అమ్ముతున్నారు. దీంతో, కూలి ఖర్చులు కూడా గిట్టుబాటు కావడం లేదని ఆయన వాపోతున్నారు. ఎస్‌కె.సుబానీ చేసే సమోసా వ్యాపారం రూ.2 వేల నుండి రూ.700కు పడిపోయింది. దీంతో, ఇంటికి రూ.150 తీసుకెళ్లడం కూడా కష్టమైందని ఆయన వాపోతున్నారు. వరద ప్రాంతాల్లోనే కాదు... భారీగా వ్యాపారం జరిగే బీసెంట్ రోడ్డులోని హాకర్ల వ్యాపారమూ తగ్గిపోయింది.

బీసెంట్ రోడ్డులో వనమా కృష్ణసాయి ప్రసాద్ రోడ్డుపక్కన తోపుడు బండిపై నైట్ డ్రస్‌లు విక్రయిస్తారు. ఆగస్టు చివరి వరకు రోజువారీ రూ.6 వేల వరకు వ్యాపారం సాగింది. సెప్టెంబర్లో వరదలు వచ్చినప్పటి నుంచి వ్యాపారం రూ.3 వేలకు పడిపోయింది. ఇదే ప్రాంతంలో ఆర్.రామారావు రోడ్డు పక్కన గాజులు విక్రయిస్తూ రోజుకు రూ.4 వేల వరకూ వ్యాపారం చేసేవారు. ఇప్పుడు రోజుకు రూ.1000 విక్రయించడం గగనంగా మారిందని ఆయన వాపోతున్నారు. ఇలా బీసెంట్ రోడ్లోని 98 మంది హాకర్లు వ్యాపారాలు బాగా మందగించాయి.

విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

- ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

విద్యా రంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్ అన్నారు. అనంతపురంలోని గణేనాయక్ భవనంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ముఖ్య నాయకుల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో ప్రసన్నకుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో నెలకొన్న విద్య రంగ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధం కావాలని కోరారు. అందుకు తగిన ప్రణాళిక ఏర్పాటు చేయడం కోసం అనంతపురం వేదిక కాబోతోందని తెలిపారు. అక్టోబర్ 5 నుంచి 8వ తేదీ వరకు అనంతపురంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నిర్మాణ మహాసభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ మహాసభకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 450 మంది ఎస్ఎఫ్ఐ నాయకులు, పిడిఎఫ్ ఎమ్మెల్సీలు, విద్యావేత్తలు హాజరవుతారని తెలిపారు. ఈ మహాసభలో ఎస్ఎఫ్ఐ చేసే పోరాటాలకు ప్రణాళిక ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను నిర్వహించలేమంటూ 700 ఎంబిబిఎస్ సీట్ల రద్దు కోసం ఎన్ఎంసికి లేఖ రాయడం దుర్మార్గమన్నారు. అంతేకాక మరో ఏడు కళాశాలల నిర్మాణం ఆపాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాడన్ని ఎస్ఎఫ్ఐ త్రీవంగా ఖండిస్తోందన్నారు. సంక్షేమ హాస్టళ్ల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నిర్మాణ మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

డెంగీతో బాలిక మృతి

ప్రజాశక్తి- వి.కోట (చిత్తూరు జిల్లా)

డెంగీ జ్వరంతో బాధపడుతూ ఓ బాలిక మృతి చెందిన సంఘటన చిత్తూరు జిల్లా వి.కోటలో చోటుచేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... వి.కోటలోని బాపూజీ వీధిలో ఉంటున్న షేక్ సిద్ధిక్ కుమార్తె నిజ ఫాతిమా (4) స్థానిక అంగన్‌వాడీ స్కూల్లో చదువుతోంది. వారం రోజులుగా తీవ్రమైన జర్వంతో బాధపడుతుండడంతో పలు ప్రయివేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించారు. అయినా, జ్వరం తగ్గలేదు. పలమనేరులోని ఓ ప్రయివేట్ ఆస్పతిలో నిర్వహించిన వైద్యపరీక్షల్లో డెంగీ జ్వరం అని తేలడంతో తిరుపతిలోని స్విమ్స్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ఆ చిన్నారి మరణించింది. కాగా, ఇటీవల ఈ గ్రామానికి చెందిన నలుగురు చిన్నారులు డెంగీతో మృతి చెందారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలపై దశలవారీ పోరాటం

- యుటిఎఫ్ కార్యవర్గంలో నిర్ణయం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలకు పరిష్కారం కోరుతూ దశలవారీ పోరాటం నిర్వహించనున్నట్లు యుటిఎఫ్ కార్యవర్గం నిర్ణయించింది. ఫెడరేషన్ రాష్ట్ర కార్యాలయంలో ఈ సమావేశం ఆదివారం జరిగింది. నిర్ణయాలను ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీస్‌లు విద్యాశాఖ పరిధిలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా ప్రధాన సమస్యలు నేటికీ పరిష్కారం కాలేదని తెలిపారు. ఎస్‌జిటి, స్కూల్ అసిస్టెంట్ పోస్టుల అప్‌గ్రేడ్ జరగలేదని పేర్కొన్నారు. 1820 పోస్టుల అప్‌గ్రేడేషన్‌కు ఆర్థికశాఖ అనుమతి లేకపోవడంతో డిఎస్‌సి-2000 ఉపాధ్యాయులు నష్టపోతున్నారని తెలిపారు. పిఎఫ్ సమస్య కూడా నేటికీ పరిష్కారానికి నోచుకోలేదని, పలుమార్లు విజ్ఞప్తి చేసినా విద్యాశాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. అందువల్ల ఈ నెల 26 నుంచి అక్టోబరు 24 వరకు దశలవారీ పోరాటం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 26 నుంచి 28 వరకు అధికారులకు నోటీసులు ఇచ్చి, అక్టోబరు 2న మున్సిపాల్టీ కార్యాలయాల వద్ద సత్యాగ్రహ దీక్షలు చేపడతామని వివరించారు. స్పందించకుంటే అక్టోబరు 17 నుంచి డిఇఒ కార్యాలయాల వద్ద ధర్నా, అక్టోబరు 24న విద్యాశాఖ డైరెక్టరేట్ వద్ద 24 గంటల ధర్నా చేస్తామని వెల్లడించారు. ఈ పోరాట కార్యాచరణను ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ గౌరవాధ్యక్షులు కె శ్రీనివాసరావు, సహాధ్యక్షులు కె సురేష్‌కుమార్, ఎఎన్ కుసుమకుమారి, కార్యదర్శులు బి లక్ష్మిరాజా, ఎస్‌పి మనోహర్ కుమార్, ఎన్ మురళీమోహన్, ఎన్ అరుణకుమారి, ఎస్ఎస్ నాయుడు, నవకోటేశ్వరరావు, వి కోటేశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న రవీంద్రనాథ్

బీమా ప్రీమియంపై జిఎస్‌టి ఉపసంహరించాలి

- సౌత్ సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

బీమా, ఆరోగ్య బీమా ప్రీమియంపై కేంద్ర ప్రభుత్వం విధించిన 18 శాతం జిఎస్‌టిని వెంటనే ఉపసంహరించాలని సౌత్ సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం జిఎస్‌టిని ఎత్తివేయని పక్షంలో ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. విజయవాడలోని ఎంబివికె భవన్‌లో సౌత్ సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ 56వ మహాసభ ఆదివారం జరిగింది. ఈ సభలో పలు రాష్ట్రాల నుంచి సుమారు 500 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. సభకు ముఖ్యఅతిథిగా ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం బీమా రంగాన్ని మరింత శక్తివంతం చేస్తే జిడిపిలో ప్రీమియం వాటా పెరుగుతుందని సూచించారు. బీమా, ఆరోగ్య బీమా ప్రీమియంపై కేంద్ర ప్రభుత్వం విధిస్తున్న 18 శాతం జిఎస్‌టిని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 300 మందికిపైగా పార్లమెంట్ సభ్యులను, పలువురు కేంద్ర మంత్రులను కలిసి వినతిపత్రాలు అందజేసినట్లు చెప్పారు. ఈ సమస్యపై పార్లమెంటులో చర్చ జరిగిందని, జిఎస్‌టి కౌన్సిల్ ఇటీవల సమావేశమై ఒక మంత్రుల సబ్ కమిటీని ఏర్పరచి తదుపరి సమావేశాలలో దీనిపై నిర్ణయం తీసుకోవాలని తీర్మానించిందని తెలిపారు. ఈ సభలో డివిజన్ అధ్యక్షులు జె.సుధాకర్, ప్రధాన కార్యదర్శి జి.కిషోర్ కుమార్, ఎల్ఐసి సీనియర్ డివిజన్ మేనేజర్ జి.సుధాకర్ బాబు, వివిధ ఉద్యోగ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన సౌత్ జోన్ ఫిజీషియన్ల సదస్సు

- వైద్య రంగంలో వచ్చిన మార్పులపై 67 మంది నిపుణుల ప్రసంగం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ (విశాఖపట్నం)

విశాఖపట్నం కేంద్రంగా సిరిపురంలోని విఎంఆర్‌డిఎ చిల్డ్రన్ ఎరీనా వేదికగా మూడు రోజులపాటు జరిగిన సౌత్ జోన్, సౌత్ మిడ్ జోనల్ అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియన్ వార్షిక సదస్సు ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాష్ట్ర ఫిజీషియన్ల సంఘం అధ్యక్షులు, విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ (విమ్స్) డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు మాట్లాడుతూ.. మూడు రోజులపాటు నిర్వహించిన ఈ సదస్సులో పలు రాష్ట్రాల నుంచి 1200 మంది ఫిజీషియన్లు పాల్గొని విజయవంతం చేశారని తెలిపారు. దేశంలోని 67 మంది వైద్య నిపుణులు సదస్సులో ప్రసంగించారన్నారు. ప్రభుత్వ వైద్యుల రక్షణ అంశాల్లో ప్రసంగించేందుకు కేంద్ర ప్రభుత్వ వైద్య పరిరక్షణ కమిటీ సభ్యులు డాక్టర్ నాగేశ్వరరెడ్డితోపాటు ప్రముఖ వైద్యులు డాక్టర్ శాకిర్ హుస్సేన్, సతీష్‌చంద్ర వారి పరిశోధనలు, అనుభవాలు, సూచనలను రానున్న తరం నూతన వైద్యులతో పంచుకున్నారని తెలిపారు. ఈ సమావేశాల్లో లండన్‌కు చెందిన వైద్యులు నిక్ స్మాల్ వుడ్ లైవ్ స్క్రీన్ ద్వారా ప్రసంగించారని చెప్పారు. మొత్తం మూడు వేదికలుగా జరిగిన ఈ సమావేశాల్లో మన రాష్ట్రంతోపాటు కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు, కేరళ రాష్ట్రాల నుంచి వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. ఈ సదస్సులో డెంగీ, మలేరియా, గుండె నొప్పిని ముందు ఎలా గుర్తించాలి, ప్రమాదకర స్థితిలో రోగి వస్తే ఏ విధంగా వైద్య సేవలందించాలో నిపుణులు వివరించారు. జ్వరం నుంచి గుండె నొప్పి వరకు అనేక పరీక్షలు అవసరం లేకుండా మల్టీ పర్పస్ కిట్‌లను ఉపయోగించాలని నూతన వైద్యులకు సూచించారు. నూతన టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని, టెలీ మెడిసిన్, డిజిటల్ ల్యాబ్ రిపోర్టులు భద్రపరచడం, సిఎంఎస్ (కంటిన్యూ మెడిసిన్ సిస్టమ్) ద్వారా వైద్య వ్యవస్థ మార్పునకు వైద్యులు అడుగులు వేయాలని పేర్కొన్నారు. కోవిడ్, ఇతర వైరస్‌లు వచ్చినప్పుడు ప్రజలకు సేవ చేయడానికి సిద్ధంగా ఉంటూ రాష్ట్ర ప్రభుత్వానికి సహాయ సహకారాలు అందిస్తామని వైద్యులు చెప్పారు.

తిరుమల బ్రహ్మోత్సవాలకు రండి

- ముఖ్యమంత్రి చంద్రబాబుకు టిటిడి ఆహ్వానం

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

తిరుమలలో అక్టోబర్ 4వ తేదీ నుంచి జరిగే బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును టిటిడి ఆహ్వానించింది. గుంటూరు జిల్లా ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో దేవస్థానం ఇఒ జె శ్యామలరావు, అడిషనల్ ఇఒ వెంకయ్య చౌదరి ముఖ్యమంత్రికి ఆహ్వానపత్రిక అందించి బ్రహ్మోత్సవాలకు రావాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులకు, పండితులకు ముఖ్యమంత్రి ధన్యవాదాలు తెలిపారు.

पावरग्रिड
పవర్ గ్రిడ్

ప్రకటన

1) సదరన్ రీజియన్‌లోని **పిటిషన్-1:** ఫిక్స్‌డ్ లైన్ రియాక్టర్‌లను స్విచ్చబుల్ లైన్ రియాక్టర్‌లుగా మార్చడం, **పిటిషన్-2:** కడప, నెల్లూరు పిఎస్, కర్నూలు, రాయచూర్‌మరియు తిరువలం వద్ద బస్ రియాక్టర్ల ఏర్పాటు, **పిటిషన్-3:** ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణపట్నం ప్రాంతంలో ఐఎస్‌జిఎస్ ప్రాజెక్టులతో అనుబంధించబడిన ఉమ్మడి సిస్టం, **పిటిషన్-4:** నెల్లూరు (పిజీ)-నెల్లూరు పిఎస్ 400 కెవి(క్వాడ్)డి/సి లైన్ యొక్కఅధిక లోడింగ్‌ను నియంత్రించడం కోసం ట్రాన్స్‌మిషన్ సిస్టం(ట్రాన్స్‌మిషన్ సిస్టం & **పిటిషన్-5:** ట్రాన్స్‌ఫార్మేషన్ సామర్థ్యాన్ని అగ్మాంటేషన్ కొరకు 2019-24 కోసం ట్రాన్స్‌మిషన్ టారిఫ్‌ను ట్రూఅప్ చేయడానికి మరియు దిగువ 2024-29 టారిఫ్ బ్లాక్ కోసం ట్రాన్స్‌మిషన్ టారిఫ్‌ను నిర్ణయించడానికి పిటిషన్.

2) పైన పేర్కొన్న ట్రాన్స్‌మిషన్ సిస్టమ్ యొక్క లబ్ధిదారులు: (a) TANGEDCO (b) TSNPDCL (c) KSEB (d) TSSPDCL (e) ఎలక్ట్రిసిటి డిపార్ట్‌మెంట్ ఆఫ్ గోవా, (f) ఎలక్ట్రిసిటి డిపార్ట్‌మెంట్ ఆఫ్ పుదుచ్చేరి, (g) APEDCL (h) APSPDCL (i) CESC (j) MESCOM (k) BESCOM (l) GESCOM (m) HESCOM & (n) APCPDCL

3) టారిఫ్ వివరాలు:

ఎ) 2019-24 బ్లాక్ రూ.లక్షలలో

పిటిషన్ నెం.	అసెట్ వివరాలు	DOCO/ ECOD	31.03.2024 నాటికి పూర్తి చేసిన విలువ		2019-20	2020-21	2021-22	2022-23	2023-24
పిటిషన్ -1	కంబైన్డ్ అసెట్	05.04.2018	1702.45	ట్రూయింగ్అప్ ఆధారంగాAFC సవరించబడింది	807.45	818.08	828.50	842.84	861.70
పిటిషన్ -2	అసెట్ 1	31.10.2018	13233.90	ట్రూయింగ్అప్ ఆధారంగాAFC సవరించబడింది	2206.85	2199.46	2161.90	2164.70	2170.87
	అసెట్ 2	07.06.2019	9548.68	ట్రూయింగ్అప్ ఆధారంగాAFC సవరించబడింది	1203.13	1544.50	1525.67	1521.38	1521.45
పిటిషన్ -3	కంబైన్డ్ అసెట్	04.08.2014	180807.56	ట్రూయింగ్అప్ ఆధారంగాAFC సవరించబడింది	29025.7	28214.65	27503.81	27092.56	26776.63
పిటిషన్ -4	అసెట్ 1	30.04.2021	446.94	ట్రూయింగ్అప్ ఆధారంగాAFC సవరించబడింది	--	--	38.92	55.46	63.73
పిటిషన్ -5	కంబైన్డ్ అసెట్	18.04.2018	13536.80	ట్రూయింగ్అప్ ఆధారంగాAFC సవరించబడింది	3241.91	3342.12	3333.46	3357.70	3380.25

బి) 2024-29 బ్లాక్ రూ.లక్షలలో

పిటిషన్ నెం.	అసెట్ వివరాలు	31.03.2024 నాటికి పూర్తి చేసిన విలువ		2024-25	2025-26	2026-27	2027-28	2028-29
పిటిషన్-1	కంబైన్డ్ అసెట్	1702.45	AFC	731.15	749.74	769.67	791.11	814.00
పిటిషన్-2	కంబైన్డ్ అసెట్	22782.58	AFC	3903.53	3814.81	3677.21	3613.54	3553.53
పిటిషన్-3	కంబైన్డ్ అసెట్	180807.56	AFC	25146.57	24426.76	23664.11	16060.83	16014.59
పిటిషన్-4	అసెట్ 1	450.32	AFC	70.03	68.37	66.43	64.49	62.56
పిటిషన్-5	కంబైన్డ్ అసెట్	13536.80	AFC	2866.94	2841.24	2825.10	2821.86	2825.22

4. టారిఫ్ నిర్ణయం కోసం చేసిన దరఖాస్తు కాపీని దరఖాస్తుదారు వెబ్‌సైట్: www.powergrid.in లో పోస్ట్ చేయబడింది.

5. అప్లికేషన్‌లో ఉన్న సుంకాన్ని నిర్ణయించే ప్రతిపాదనలపై ఏవైనా సూచనలు మరియు అభ్యంతరాలు ఉంటే, లబ్ధిదారుడితో సహా ఎవరైనా సెక్రటరీ, సెంట్రల్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమీషన్, 6వ, 7వ & 8వ అంతస్తు, టవర్ బి, వరల్డ్ ట్రేడ్ సెంటర్, నౌరోజీ నగర్, న్యూఢిల్లీ-110029 (లేదా కమిషన్ కార్యాలయం ఉన్న ఇతరచిరునామా) వారికిదాఖలు చేయాలి,ఈ నోటీసును ప్రచురించిన 30 రోజులలోపు దరఖాస్తుదారునికి దాని కార్పొరేట్ కార్యాలయం చిరునామాలో ఒక కాపీని అందించండి.

ప్రదేశం: గుర్గామ్ సం/-
తేదీ: 18-09-2024 చీఫ్ జనరల్ మేనేజర్ (కమర్షియల్/ఆర్‌సి)

పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్
(భారత ప్రభుత్వరంగ సంస్థ)
రిజిస్టర్డ్ ఆఫీస్: బి-9, కుతాబ్ ఇన్స్టిట్యూషనల్ ఏరియా, కత్వారియా సరాయ్, న్యూఢిల్లీ-110 016
కార్పొరేట్ ఆఫీసు: "సౌదామిని", ప్లాట్ నెం.2, సెక్టార్-29, గురుగ్రామ్-122 001, (హర్యానా)
www.powergrid.in, CIN: L40101DL1989038121GOI038121
ఎ మహారత్న పిఎస్‌యు

PG/CC/Notice-72/Advt-99/2024-25

రాష్ట్ర వ్యాప్తంగా పిపిల బదిలీలు

ప్రజాశక్తి -గుంటూరు లీగల్

రాష్ట్రంలో వివిధ క్యాడర్లలో పని చేస్తున్న పలువురు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రాసిక్యూషన్స్ కార్యాలయం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లా ప్రధాన న్యాయస్థానంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేస్తున్న వి.రాజేంద్రప్రసాద్‌ను విజయవాడలోని ప్రాసిక్యూషన్ డైరెక్టర్ కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. ఖాళీ అయిన ఆయన స్థానంలో ప్రస్తుతం విజయనగరం జిల్లా ప్రధాన న్యాయస్థానంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేస్తున్న వి రఘురాంను నియమించారు. ప్రస్తుతం విజయవాడలో ప్రాసిక్యూషన్స్ జాయింట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న లాం అజయ్ ప్రేమ్ కుమార్‌ను నెల్లూరు జిల్లా ప్రధాన న్యాయస్థానంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం విజయ్‌ను విజయవాడలో ప్రాసిక్యూషన్స్ జాయింట్ డైరెక్టర్‌గా నియమించారు. విజయవాడలో పని చేస్తున్న మరో జాయింట్ డైరెక్టర్ వి సుబ్బ లక్ష్మమ్మను కడప జిల్లా ప్రధాన న్యాయస్థానంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బదిలీ చేశారు. గ్రేడ్ వన్ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లలో విజయనగరం ఎస్‌సి, ఎస్‌టి కోర్టులో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేస్తున్న పివిఎన్ జయలక్ష్మిని కాకినాడ నాలుగవ అదనపు జిల్లా కోర్టుకు, ఆమె స్థానంలో ప్రస్తుతం విశాఖపట్నం ఒకటవ అదనపు జిల్లా కోర్టులో ఎపిపిగా పని చేస్తున్న ఎం శైలజను నియమించారు. గుంటూరు రెండవ అదనపు జిల్లా కోర్టులో పని చేస్తున్న పి మధుసూదనరావును శ్రీకాకుళం ఎస్‌సి, ఎస్‌టి కోర్టుకు బదిలీ చేసి, ఆ స్థానంలో విశాఖపట్నం నాల్గవ అదనపు జిల్లా కోర్టులో ఎపిపిగా పనిచేస్తున్న బర్కత్ ఆలీ ఖాన్‌తో భర్తీ చేశారు. ఖాళీ అయిన ఆయన స్థానంలో విజయనగరం ఒకటవ అదనపు జిల్లా కోర్టులో ఎపిపిగా పనిచేస్తున్న ఎం ఖాజన రావును నియమించారు. కాకినాడ 4వ అదనపు జిల్లా కోర్టులో ఎపిపిగా పని చేస్తున్న వై ప్రశాంత కుమారిని ఒంగోలు ఎస్, ఎస్‌టి కోర్టుకు బదిలీ చేశారు. ఒంగోలులో ఖాళీ అయిన ఆమె స్థానంలో ప్రస్తుతం సిఐడి లీగల్ అడ్వైజర్‌గా పని చేస్తున్న ఎం లక్ష్మణరావును నియమించారు. గుంటూరు ఎస్‌సి, ఎస్‌టి కోర్టులో ఎపిపిగా పని చేస్తున్న నక్క శారదా మణిని ఏలూరు ఎస్‌సి, ఎస్‌టి కోర్టుకు, ఏలూరులో పనిచేస్తున్న డి శ్రీవాణి బాయ్‌ను రాజమండ్రి ఎస్‌సి, ఎస్‌టి కోర్టుకు బదిలీ చేశారు. ప్రస్తుతం కడప ఎస్‌సి, ఎస్‌టి కోర్టులో ఎపిపిగా పని చేస్తున్న షేక్ ముబీనా బేగంను గుంటూరు ఎస్‌సి, ఎస్‌టి కోర్టుకు, రాజమండ్రి ఒకటవ అదనపు జిల్లా కోర్టులో ఎపిపిగా పని చేస్తున్న జివిఎస్ఎన్‌వి ప్రసాద్‌ను విశాఖపట్టణం ఒకటవ అదనపు జిల్లా కోర్టుకు బదిలీ చేసి ఖాళీ అయిన ఆయన స్థానంలో ప్రస్తుతం ఏలూరు ఒకటవ అదనపు జిల్లా కోర్టులో ఎపిపిగా పనిచేస్తున్న కె లక్ష్మానాయక్‌ను నియమించారు. లక్ష్మానాయక స్థానంలో ప్రస్తుతం ఒంగోలు ఒకటవ అదనపు జిల్లా కోర్టులో ఎపిపిగా పని చేస్తున్న జెహెచ్ జోసెఫిన్‌తో బర్తీ చేశారు. చిత్తూరు ఎస్‌సి, ఎస్‌టి కోర్టులో ఎపిపిగా పని చేస్తున్న ఎంకె విజయలక్ష్మిని నెల్లూరు ఎనిమిదవ అదనపు జిల్లా కోర్టుకు, నెల్లూరులో పని చేస్తున్న ఎస్.వి.ఎన్.ఎల్.ఎస్.ఆర్.వి ప్రసాద్‌ను తిరుపతి నాలుగవ అదనపు జిల్లా కోర్టులో ఎపిపిగా నియమించారు. వీరితో పాటుగా రాష్ట్రంలోని పలు అసిస్టెంట్ సెషన్స్ కోర్టులలో పని చేస్తున్న 12 మంది గ్రేడ్-2 అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు, రాష్ట్రంలోని మేజిస్ట్రేట్ కోర్టులలో జోన్-1లో పని చేస్తున్న 13 మంది, జోన్-2లో 16 మంది, జోన్-3లో 11 మంది, జోన్-4లో పని చేస్తున్న 27 మంది అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు స్థానచలనం జరిగింది.

ఉసురుతీసిన అప్పులు

ఇద్దరు కౌలు రైతుల ఆత్మహత్య

(ఫైల్) నాగరాజు

(ఫైల్) రామాంజనేయులు

ప్రజాశక్తి-చిప్పగిరి/ గూడూరు

కర్నూలు జిల్లా చిప్పగిరి, గూడూరు మండలాల్లో అప్పుల బాధతో ఇద్దరు కౌలు రైతులు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. మృతుల కుటుంబాలు తెలిపిన వివరాల మేరకు... చిప్పగిరి మండలం బంటన్‌హాల్ గ్రామానికి చెందిన రైతు నాగరాజు (40) నాలుగెకరాలు కౌలు తీసుకొని పత్తి, మిరప సాగు చేసేవారు. రెండేళ్ల నుంచి సరైన దిగుబడులు రాలేదు. పెట్టిన పెట్టుబడులు చేతికి రాకపోవడంతో అప్పులు ఎక్కువయ్యాయి. నాలుగు లక్షల వరకూ అప్పులున్నాయి. తీవ్ర మనోవేదనకు గురై శనివారం రాత్రి పొలానికి వెళ్లి పురుగుమందు తాగి అక్కడే చనిపోయారు. ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులు గుర్తించారు. నాగరాజు మృతదేహానికి గుంతకల్లులో పోస్టుమార్టం నిర్వహించారు. ఆయనకు భార్య, ఒక కుమార్తె ఉన్నారు. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామ పెద్దలు, సర్పంచి కోరారు.

గూడూరు పట్టణం కొండగేరిలో నివాసముంటున్న జింకల నల్లబోతుల చిన్న రామాంజనేయులు (37) సొంత పొలం నాలుగెకరాలతో పాటు ఐదెకరాలు కౌలుకు తీసుకుని పత్తి, వరి, మొక్కజొన్న సాగు చేశారు. మూడేళ్లపాటు పత్తి , వరికి సరైన ధర లేక అతివృష్టి, అనావృష్టితో దిగుబడులు తగ్గి అప్పులు పెరిగాయి. దాదాపు రూ.ఐదు లక్షలు బ్యాంకులు, ఇతర ప్రయివేటు అప్పులు ఉన్నాయి. అప్పు తీర్చే మార్గం లేక శనివారం రాత్రి అందరూ నిద్రిస్తుండగా ఇంట్లో గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఆతనికి భార్య మహాలక్ష్మి, ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు.

మద్యం మత్తులో ఒకరి హత్య

ప్రజాశక్తి - శ్రీశైలం

మద్యం మత్తులో ఇద్దరు వ్యక్తులు గాజు సీసాతో సహచరుడ్ని హత్య చేసిన ఘటన శ్రీశైలం పాతాళగంగ పాత మెట్లమార్గంలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... అశోక్ ప్రకాశం జిల్లా మార్కాపురాన్ని చెందిన అశోక్ (40) శ్రీశైలానికి బతుకుదెరువు కోసం వలస వచ్చారు. ఆయన మరో ఇద్దరు వ్యక్తులు కలిసి స్థానికంగా క్షేత్రంలో వచ్చే యాత్రికులకు బొట్లు పెడుతూ వారు ఇచ్చే డబ్బులతో జీవనం సాగిస్తున్నారు. క్షేత్ర పరిధిలోని విభూది మఠం ప్రాంతంలో ముగ్గురు కలిసి స్నేహితులయ్యారు. శనివార అర్ధరాత్రి మద్యం తాగి తర్వాత గొడవ పడ్డారు. ఇద్దరు వ్యక్తులు అశోక్‌పై దాడి చేసి గాజుసీసాతో అత్యంత కిరాతకంగా గొంతు కోశారు. ఈ ఘటన పక్కనే ఉన్న చెత్త పేపర్లు సేకరించే వ్యక్తులు చూసి 108 కి ఫోన్ చేశారు. 108 వాళ్ల పోలీసులకు సమాచారం ఇవ్వడంతో శ్రీశైలం ఒకటవ పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి 108లోనే సుండిపెంట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే అశోక్ మృతి చెందారు. నిందితులిద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. పుణ్యక్షేత్రంలో మద్యం నిషేధించినా అర్ధరాత్రి మద్యం తాగడమే కాకుండా ఒక వ్యక్తిని అత్యంత కిరాతకంగా హత్య చేసిన ఘటనతో శ్రీశైలంలో ఈ ఘటన సంచలనమైంది. అరెస్ట్ చేసిన ఇద్దరి పేర్లు పోలీసులు చెప్పడంలేదు.


గుంటూరు - కర్నూలు జాతీయ రహదారిపై కంచెవేసి ఆందోళన చేస్తున్న ప్రజలు

మంచినీటి కోసం మహిళల రాస్తారోకో

ప్రజాశక్తి-పెద్దదోర్నాల (ప్రకాశం జిల్లా)

మంచినీటి కోసం గుంటూరు-కర్నూలు జాతీయ రహదారిపై మహిళలు ఆదివారం రాస్తారోకో నిర్వహించారు. ప్రకాశం జిల్లా పెద్దదోర్నాల మండలం ఐనముక్కల ఎస్‌సి పాలెంలోని డీప్‌బోర్లలో మోటార్లు బిగించకపోవడం, కనీసం ట్యాంకర్ల ద్వారానైనా నీటి సరఫరా చేయకపోవడంతో ఆ కాలనీవాసులు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను అధికారులు, పాలకుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా పరిష్కరించకపోవడంతో గుంటూరు-కర్నూలు జాతీయ రహదారిపై వెళ్లే వాహనాలకు ముళ్లకంప అడ్డంగా వేసి ఎస్‌సిపాలెం మహిళలంతా ఖాళీ బిందెలతో రాస్తారోకో చేశారు. మంచినీటి సమస్యను పరిష్కరించాలని నినా దాలు చేశారు. దీంతో జాతీయ రహదారికి ఇరువైపులా భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. పెద్దదోర్నాల ఎస్ఐ మహేష్ తన సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని మహిళలకు హామీ ఇచ్చారు. దీంతో, వాళ్ల ధర్నాను విరమించారు.

నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

ఇజ్రాయిల్ క్రూరత్వాన్ని ఖండించండి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

అమెరికా మద్దతుతో పాలస్తీనాపై ఇజ్రాయిల్ క్రూరంగా వ్యవహరించడంపట్ల తీవ్రంగా ఖండించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ఆదివారం నిరసన తెలిపారు. పార్వతీపురం కలెక్టరేట్ నుంచి మెయిన్ రోడ్డు మీదుగా మేదరవీధి జంక్షన్ వరకు ప్రదర్శనగా వెళ్లి తిరిగి కాంప్లెక్స్ కూడలికి చేరుకున్నారు. చేరి యుద్ధం వద్దు... శాంతి కావాలి అంటూ నినాదాలతో ప్రదర్శన నిర్వహించి, ప్లే కార్డులతో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మన్యం జిల్లా అధ్యక్షులు కె రాజు మాట్లాడుతూ ఎనిమిది నెలలుగా పాలస్తీనాలోని గాజా ప్రాంతంలో ఇజ్రాయిల్ పెద్దఎత్తున బాంబులతో దాడులు చేస్తుందన్నారు. ఈ దాడుల్లో లక్షలాది మంది ప్రజల ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ఐక్యరాజ్యసమితి, ప్రపంచ దేశాలు యుద్ధం వద్దు శాంతే ముద్దని ప్రతిపాదనలు చేపడుతున్నప్పటికీ ఇజ్రాయిల్ దాడులు విరమించకపోవడం అన్యాయమని అన్నారు. అమెరికా అండదండలతో ఇజ్రాయిల్ ఈ ఘాతుకానికి పాల్పడుతోందని, ఈ క్రూరత్వమైన దాడుల్లో పాలస్తీనా విద్యా సంస్థల్లోని 11 వేలమంది విద్యార్థులు మరణించారని ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా, ఇజ్రాయిల్ పక్కా ప్రణాళికతో విద్యాసంస్థలు, వైద్యశాలలపై అణుబాంబులతో దాడులు చేపడుతున్నాయన్నారు. నేటికీ విద్య, వైద్యం, ఆహారం అందకుండా ప్రజలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. మానవత్వాన్ని చాటి చెప్పాల్సిన భారతదేశ ప్రధాని నరేంద్ర మోడీ అమెరికాతో కుమ్మక్కై ఇజ్రాయిలు దాడులపై స్పందించకపోవడం దారుణమన్నారు. ఇజ్రాయిల్ దాడులకు వ్యతిరేకంగా పాలస్తీనకు మద్దతుగా మోడీ నిలవాలని కోరారు. పాలస్తీనాపై ఇంత దారుణమైన దాడులు జరుగుతున్నా మన రాష్ట్ర అధికార, ప్రతిపక్ష పార్టీలు కనీసం స్పందించకపోవడం అన్యాయమని, ఆయా పార్టీలు నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చి మానవత్వాన్ని చాటి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు కె డేవిడ్, జి సురేష్, శివ, జై, శ్రీను, అంజలి, జ్యోతి, పల్లవి, విద్యార్థులు పాల్గొన్నారు.

kotak®
కోటక్ మహీంద్రా బ్యాంక్ లిమిటెడ్
రిజిష్టర్డు ఆఫీస్: 27బికెసి, సి-27, జి-బ్లాక్, బాంద్రా కూర్ల కాంప్లెక్స్, బాంద్రా(ఇ), ముంబయి-400051.
బ్రాంచ్ ఆఫీస్: నెం.6-3-1109/1, 2వ అంతస్తు, నవభారత్ చాంబర్స్, రాజ్‌భవన్ రోడ్, సోమాజిగూడ, హైదరాబాద్-500082.

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)
(సెక్యూరిటి ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(1)తో చవదగల అనుబంధం 4 ప్రకారం)

ఏదైతే, క్రింది సంతకందారుడు **కోటక్ మహీంద్రా బ్యాంక్ లిమిటెడ్,** బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టం, 1949 నియమాల్లోపు బ్యాంకింగ్ కంపెనీ, దీని **రిజిష్టర్డు ఆఫీస్:** 27 బికెసి, సి-27, జి-బ్లాక్, బాంద్రా కూర్ల కాంప్లెక్స్, బాంద్రా(ఇ), ముంబయి-400051 మరియు **బ్రాంచ్ ఆఫీస్:** నెం.6-3-1109/1, 2వ అంతస్తు, నవభారత్ చాంబర్స్, రాజ్‌భవన్ రోడ్, సోమాజిగూడ, హైదరాబాద్-500082 యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 9తో చదువగల సెక్షన్స్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ, సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజుల్లోగా నోటీసులో పేర్కొన్న మొత్తం **14-05-2024 నాటికి బకాయిలు రుణ ఒప్పందం నెం.HF38225735** నకుగాను **రూ.79,16,373.82/-**(రూపాయలు డెబ్బైతొమ్మిది లక్షల పదహారువేల మూడువందల డెబ్బైమూడు & ఎనభైరెండు పైసలు మాత్రమే)లను తిరిగిచెల్లించమని రుణగ్రహీత/లు/పార్టీలు: **1) శ్రీమతి మోడెం జయమ్మ, భర్త లేట్ మోడెం చినప్ప,** డి.నెం.3-146-14-1410, రామారావు కాలనీ, బి కె పల్లి, మదనపల్లి, చిత్తూరు-517325. **ఇక్కడ కూడా: శ్రీమతి మోడెం జయమ్మ, కెరాఫ్/ మెసర్స్ రెడ్డి ఎంటర్‌ప్రైజెస్,** డోర్ నెం.32-26-16-1, విజయ్ లక్ష్మి నివాస్, మాచవరం, వాణి పబ్లిక్ స్కూల్ పక్కన, విజయవాడ-520013. **ఇక్కడ కూడా: శ్రీమతి మోడెం జయమ్మ, భర్త లేట్ మోడెం చినప్ప,** విల్లా నెం.1, బి టైప్, మహా లక్ష్మి అఫ్ట్స్, తాడేపల్లి(మం), గుంటూరు-522001. (రుణగ్రహీత), **2) శ్రీ మోడెం వీరాంజనేయ ప్రసాద్, తండ్రి లేట్ మోడెం చినప్ప,** డోర్ నెం.3-1, మల్లూరు, చిన్న మండెం, వైఎస్ఆర్ కడప-516214. **ఇక్కడ కుడా: 2) శ్రీ. మోడెం వీరాంజనేయ ప్రసాద్, కెరాఫ్ మెసర్స్ రెడ్డి ఎంటర్‌ప్రైజెస్,** డోర్ నెం.32-26-16-1, విజయ్ లక్ష్మి నివాస్, మాచవరం, వాణి పబ్లిక్ స్కూల్ పక్కన, విజయవాడ-520013. (సహ-రుణగ్రహీత/హామీదారు), **3) శ్రీమతి బొమ్మిశెట్టి రెడ్డి పరమ జ్యోతి, భర్త మోడెం వీరాంజనేయ ప్రసాద్,** డోర్ నెం.3-1, మల్లూరు, చిన్న మండెం, వైఎస్ఆర్ కడప-516214. ఇక్కడ కుడా: **3) శ్రీమతి బొమ్మిశెట్టి రెడ్డి పరమ జ్యోతి, కెరాఫ్/ మెసర్స్ రెడ్డి ఎంటర్‌ప్రైజెస్,** డోర్ నెం.32-26-16-1, విజయ్ లక్ష్మి నివాస్, మాచవరం, వాణి పబ్లిక్ స్కూల్ పక్కన, విజయవాడ-520013 (సహ-రుణగ్రహీత/హామీదారు) వారిని కోరుతూ **రుణ ఖాతా నెం: HF38225735 CRN37308156** ఆధారంగా **17 మే, 2024 తేదినాటి డిమాండ్ నోటీసు** జారీచేయడమైనది.

పై పేర్కొన్న రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతలు/హామీదారులు/తాకట్టుదారులు పూర్తి మొత్తాలను తిరిగిచెల్లించుటలో విఫలం చెంది యున్నందున, ఇందుమూలంగా రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతలు/హామీదారులు/తాకట్టుదారులు మరియు సాధారణ ప్రజలకు నోటీసు ఇవ్వడమేమనగా, క్రింది సంతకందారు సదరు రూల్స్ యొక్క రూల్ 9తో చవదగల చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ వివరించిన ఆస్తిని **20 సెప్టెంబర్, 2024**న **స్వాధీనంలోకి** తీసుకోవడమైనది. ప్రధానంగా రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతలు/హామీదారులు/తాకట్టుదారులు మరియు సాధారణప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, ఆస్తితో ఏవిధమైన లావాదేవీలు జరుపరాదని మరియు సదరు ఆస్తితో లావాదేవీలను జరపదలచిన వారు **కోటక్ మహీంద్రా బ్యాంక్ లిమిటెడ్** వారికి మొత్తం **14-05-2024** నాటికి బకాయిలు **రుణ ఒప్పందం నెం.HF38225735** నకుగాను **రూ.79,16,373.82/-**(రూపాయలు డెబ్బైతొమ్మిది లక్షల పదహారువేల మూడువందల డెబ్బైమూడు &ఎనభైరెండు పైసలు మాత్రమే)లను పూర్తిగా చెల్లించునాటికి/ రియలైజేషన్ తేదినాటికి **15-05-2024** నుండి కాంట్రా క్చువల్ రేటుతోవడ్డీ, సబ్ట్యూట్ వడ్డీ, ఇన్సిడెంటల్ వ్యయాలు, ఖర్చులు మరియు చార్జీలను చెల్లించుటకు లోబడి ఉంటుంది.

సెక్యూర్డు ఆస్తుల విమోచనానికి అందుబాటులోఉన్న సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13 యొక్క ఉప-సెక్షన్ (8) నియమాల క్రింద రుణగ్రహీత శ్రద్ధను కోరుతున్నారు.

కెఎంబిఎల్‌కు తాకట్టుపెట్టిన ఆస్తుల వివరణాత్మక వివరణ:

ఐటం నెం.1: మోడెం జయమ్మ పేరునగల తాడేపల్లి గ్రామం మరియు మండలం, గుంటూరు రెవెన్యూ డివిజన్, గుంటూరు జిల్లాలోని సర్వే నెం.99/2, 101/1, 101/2, మరియు 102/2 లోగల 33,946.4చ.గ.ల విస్తీర్ణపు పూర్తి స్థలం మొత్తం భాగం, **సరిహద్దులు: ప్లాట్ సరిహద్దులుగా: ఉత్తరం:** సర్వే నెం.లు 102/1,101/1 & 99/1లో స్థలం, **దక్షిణం:** సర్వే నెం.లు100,101/2 & 89లో స్థలం, **తూర్పు:** సర్వే నెం.లు 99/1, 99/2,100, 101/2 &89 లోని స్థలం, **పడమర:** సర్వే నెం.లు 101/1,103/ఏ,102/1 లోని స్థలం & రోడ్డు.

ఐటం నెం.2: మోడెం జయమ్మ పేరునగల తాడేపల్లి గ్రామం మరియు మండలం, గుంటూరు రెవెన్యూ డివిజన్, గుంటూరు జిల్లాలోని సర్వే నెం.102/2 లోగల 10,793.2 చ.గ.ల విస్తీర్ణపు పూర్తి స్థలం మొత్తం భాగం, **సరిహద్దులు: ప్లాట్ సరిహద్దులుగా: ఉత్తరం:** సర్వే నెం.లు 102/2 లోని స్థలం, **దక్షిణం:** సర్వే నెం.88లోని స్థలం, **తూర్పు:** సర్వే నెం.101/2 & 89లోని స్థలం, **పడమర:** రోడ్డు.

ఐటం నెం.3: మోడెం జయమ్మ పేరునగల తాడేపల్లి గ్రామం మరియు మండలం, గుంటూరు రెవెన్యూ డివిజన్, గుంటూరు జిల్లాలోని సర్వే నెం.102/1 (పార్ట్) లోగల 4888.4 చ.గ.ల విస్తీర్ణపు పూర్తి స్థలం మొత్తం భాగం, **సరిహద్దులు: ప్లాట్ సరిహద్దులుగా: ఉత్తరం:** సర్వే నెం.103/ఏ(పార్ట్)లోని స్థలం, **దక్షిణం:** సర్వే నెం.102/2లో స్థలం, **తూర్పు:** సర్వే నెం.101/2లో స్థలం, **పడమర:** సర్వే నెం.102/1(పార్ట్) &103/ఏ (పార్ట్).

ఐటం నెం.4: మోడెం జయమ్మ పేరునగల తాడేపల్లి గ్రామం మరియు మండలం, గుంటూరు రెవెన్యూ డివిజన్, గుంటూరు జిల్లాలోని సర్వే నెం.88లోగల 414.79 చ.గ.ల విస్తీర్ణపు పూర్తి స్థలంమొత్తం భాగం, **సరిహద్దులు: ప్లాట్ సరిహద్దులుగా: ఉత్తరం:** సర్వే నెం.102/2లోని స్థలం, **దక్షిణం:** సర్వే నెం.88లోని స్థలం, **తూర్పు:** సర్వే నెం.102/2& 88లోని స్థలం, **పడమర:** రోడ్డు.

ఐటం నెం.5: మోడెం జయమ్మ పేరునగల తాడేపల్లి గ్రామం మరియు మండలం, గుంటూరు రెవెన్యూ డివిజన్, గుంటూరుజిల్లాలోని సర్వే నెం.102/1 లోగల రెవెన్యూ రికార్డుల ప్రకారం 2565.2 చ.గ.లు, మార్చబడిన లింక్ డాక్యుమెంట్ ప్రకారం 2589.4 చ.గ.ల విస్తీర్ణపు పూర్తి స్థలం మొత్తం భాగం, **సరిహద్దులు: ప్లాట్ సరిహద్దులుగా: ఉత్తరం:** సర్వేనెం.102/1లోని స్థలం, **దక్షిణం:** సర్వే నెం.102/2 లోని స్థలం, **తూర్పు:** సర్వే నెం.101/2లోని స్థలం, **పడమర:** సర్వే నెం.102/1లోని స్థలం.

ఐటం నెం.6: మోడెం జయమ్మ పేరునగల తాడేపల్లి గ్రామం మరియు మండలం, గుంటూరు రెవెన్యూ డివిజన్, గుంటూరుజిల్లాలోని సర్వే నెం.103/సి లోగల 2662 చ.గ.ల విస్తీర్ణపు పూర్తి స్థలం మొత్తం భాగం, **సరిహద్దులు: ప్లాట్ సరిహద్దులుగా: ఉత్తరం:** సర్వేనెం.103/డి లోని స్థలం, **దక్షిణం:** సర్వే నెం.103/ఏ లో స్థలం, **తూర్పు:** సర్వే నెం.101/1లోని స్థలం, **పడమర:** సర్వే నెం.103/బిలోని స్థలం.

ఐటం నెం.7: మోడెం జయమ్మ పేరునగల తాడేపల్లి గ్రామం మరియు మండలం, గుంటూరు రెవెన్యూ డివిజన్, గుంటూరు జిల్లాలోని సర్వేనెం.100 లోగల 108.88 చ.గ.ల విస్తీర్ణపు పూర్తి స్థలం మొత్తం భాగం, **సరిహద్దులు: ప్లాట్ సరిహద్దులుగా: ఉత్తరం:** స్థల యజమానికు చెందిన స్థలం, **దక్షిణం:** నిల్, **తూర్పు:** పొరుగువారి స్థలం, **పడమర:** స్థల యజమానికు చెందిన స్థలం.

అమ్మకపు డీడ్ నెం.4726/2020 తేది.21 అక్టోబర్, 2020 క్రింద కవరుచేసిన ఆస్తి: తాడేపల్లి గ్రామం మరియు మండలం గుంటూరు రెవెన్యూ డివిజన్, గుంటూరు జిల్లాలోగల మోడెం జయమ్మ వారి పేరునగల సర్వే నెం.లు 88, 103/ఏ, 99/2, 100, 101/1, 101/2, 102/1, 102/2 మరియు 103/సిలోని స్థలంపై అభివృద్ధిచేసిన హౌసింగ్‌ప్రాజెక్టులో భాగంగా 695చ.అ.ల ప్రత్యేకమైన పార్కింగ్ స్థలంతోపాటుగా 7812 చ.అ.లవిస్తీర్ణంలో విక్రయించదగిన నిర్మితమైన ఏరియాతోపాటు 371.24చ.మీ.లకు సమానమైనన 444 చ.గ.ల విస్తీర్ణంలో ఇల్లు/విల్లా నెం.1 కలిగిన స్థలం మొత్తం భాగం మరియు **ఆస్తి సరిహద్దులు: ఉత్తరం:** ఓపెన్ స్పేస్, **దక్షిణం:** విల్లా నెం.2, **తూర్పు:** డి.నాగేంద్ర ప్రసాద్ మరియు డి.సాయి ప్రసాద్ స్థలం, **పడమర:** 40' వెడల్పాటి రోడ్డు.

విక్రేతలు ఈ సేల్ డీడ్‌ని అమలు చేసినసాక్షిగా మరియు వారి సమక్షంలో తేదీ మరియు పైన పేర్కొన్న స్థలంలో ఎటువంటి బలవంతం లేదా అనవసర ప్రభావం లేకుండా వారి స్వేచ్ఛా సంకల్పం మరియు సమ్మతితో సంతకం చేసారు.

తేది: 23 సెప్టెంబర్, 2024 సం/- అధీకృత అధికారి,
ప్రదేశం: గుంటూరు కోటక్ మహీంద్రా బ్యాంక్ లిమిటెడ్ తరపున

ప్రపంచీకరణ సంస్కృతి సాంప్రదాయ వ్యతిరేకి అని భావించటం తప్పు. దానికి ఏది లాభాలను తెస్తుంది అనుకుంటే దానిని నిరభ్యంతరంగా స్వీకరించి, విపరీత ప్రాచుర్యం కల్పిస్తుంది. ప్రపంచీకరణకు సాహిత్య, సాంస్కృతిక విలువల కన్నా తన ప్రయోజనాలే ముఖ్యం.

– సీతారాం ఏచూరి



మన్నించు, గురజాడ!

కన్యను కొనక్కర్లేదు, అమ్మనక్కర్లేదు
డేగ కళ్ళు పడగానే
కసిగా, కర్కశంగా చిదిమేస్తారు,
ఢిల్లీ నిర్భయైనా, కలకత్తా వైద్యురాలు అభయైనా
ఆంధ్ర ముచ్చుమర్రి అయినా
స్థలం మార్పే తప్ప, బుద్ధి మారదు
ఆనాడు స్త్రీకి వెల కట్టొద్దన్నావు
ఆమె మనసుకు వెలే లేదంటున్నారు ఈనాడు
గురజాడా! మన్నించు.

దేవుళ్ళారా! మీ పేరేమిటి అని ప్రశ్నించావు
దేవాలయాల్లో, మసీదులో, చర్చిలో,
దండి గానే ప్రార్థనలు జరుగుతున్నాయి
కానీ ఆధిపత్యం కోసం మతాన్ని
ఎరవేసి ఎదురు ప్రశ్నించుకుంటున్నారు పాలకులు
గురజాడా! మన్నించు.

కట్టుబాట్ల చట్రంలో స్త్రీ మనసుకు
గిరి గీయొద్దన్నావు
కట్టుబాట్లేందుకు, కరెన్సీ ఉంటే చాలనీ
'దిద్దుబాటు'లకు అవకాశం లేని
విడాకుల కేసులు పెరిగి పోతున్నాయి
సర్దుబాటు లేదు, దిద్దుబాటు అవసరమే లేదు
గురజాడా! మన్నించు.

సినీ 'కన్యక'లు, కార్పొరేట్ మహారాజులు
యూట్యూబ్లో అనేక 'కన్యక' కథలు
మానవ మస్తిష్కంలో మాలిన్యం
పారదోలాలని నువ్వు ఎంత కృషి చేసినా
మానవ మనుగడ స్థాయిలు మారలేదు
గురజాడా! మన్నించు.

నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు
పత్రికల్లో నీలి వార్తలు వస్తే నాకేటి ఎగ్గు
సొంత లాభం చూసుకున్నాకే
పొరుగు వాడికి ఓట్ల కోసం
తాయిలాల రూపంలో సహాయం అందిస్తాం
అదీ పదవీ స్వార్థంతోనే!
గురజాడా! మన్నించు.

– డాక్టర్ జివిఎస్.జయపాల రావు,
94920 20115

పదు ముందుకు ...

తడారిన గొంతుకు
ఎడారి భయం ఉండరాదు
కాలుకదప కష్టమంటూ
ఉన్నచోటనే కూలబడితే
అయ్యో పాపమంటూ
ఒయాసిస్సులు వెంట రావు
గుండె నిండిన మబ్బులేవీ
వాన చుక్క కురిసిపోవు
పొంగి పొరలే కన్నీటికి
దాహపు శిల కరిగిపోదు
ఇసుక తును కెదురీదకపోతే
ఏ నీటి చుక్కా దక్కబోదు
ఏ నాటికీ దప్పిక తీరబోదు!

– డా.డి.వి.జి. శంకరరావు,
9440836931

ఆ ఒక్క నిజమే ...

శ్రమకు ఏదేదో జమైంది
కాళ్ళ శ్రమ బళ్ళెక్కింది
చేతి శ్రమ కీబోర్డు పరమైంది
నోటి శబ్దం స్పీకర్లో దూరింది
శ్రామికుడి యూనిఫారం
తెల్ల బట్టల్లో మెరుస్తోంది
శ్రమజీవులిప్పుడు
ఏసీ గదుల్లో నిలపబడ్డారు
అన్నీ నిజాలే .. ఏదీ అబద్ధం కాదు

కానీ చెప్పని కఠోర నిజం ఒకటుంది
కష్టజీవుల బతుకుల్లో మెరుపులు నింపే
ఉత్పత్తిలో శ్రమకు వాటా పెట్టలేదు
అది జీతమై జీవితానికి జమ కాలేదు
పని గంటల ముల్లుకు
స్కేటింగ్ చక్రాలు తొడిగి
ఎనిమిదిని పన్నెండుకు పెంచి
ఇబ్బడిముబ్బడిగా దోచడం ఆపలేదు
కష్టం మేరకు ధనం దక్కని జనం
పెరిగిన ధరలు .. చమురు భారాల్లో
సలాసలా మరిగి చిక్కి పోతున్నారు
ఆ ఒక్క నిజమే వారిని
తూర్పు మార్పుకు కదం తొక్కిస్తుంది
అరుణ పతాకను చేత పట్టిస్తుంది!

– ఉన్నం వెంకటేశ్వర్లు

రెండో మనిషి

ఎడారిలో ఒంటె పాదాల అచ్చుల్లో నడుస్తూ
వొంటెనై పోవాలని వూహిస్తావు
నువ్వు తల్లకిందుల తపస్సు చేసినా కాలేవు
నదిలో ఈతకొడుతూ
చేపనైతే అయితే ఎంత బాగుంటుంది అనుకుంటావు
చేప కాదు కదా కప్పవైనా కాలేవు.

సాయంత్రోదయాల్లో చెట్టు పెట్టిన కచేరీ వింటూ
పక్షినైతే బావుండునని భావిస్తావు
సంభవం కాని భావనవై
ధ్వజస్తంభంలా నిలుచుంటావు

తోట నిండుగా పూచిన పూవుల్ని చూచి
సీతాకోకచిలుకైపోటానికి ఉవ్విళ్ళూరుతావు
సీతాకోక కాదు కదా
చివరికి ఆకు పురుగ్గానైనా పుట్టలేని నిస్సహాయత!

అయినా నీలోని రెండో మనిషి
పగటి కలలు కనటం మానడు
నీ లోపల అతనే గనుక లేకపోతే
ఈ ప్రపంచం నీకోసం ఓ నిర్జీవ స్థాణువు!

– ఈతకోట సుబ్బారావు
94405 29785

ధిక్కార స్వరం జాషువా

సాంస్కృతిక విప్లవానికి రచయితల కలాలు, కవులూ కళాకారుల గళాలు ఊపిరిపోస్తాయి. అనేక అవమానాలు, ఆవేదనా తరంగాలు జీవితంతో ఎదుర్కొని తెలుగు పద్య సాహిత్యంలో ఎదిగిన అభ్యుదయ, సామాజిక పద్య కవి గుర్రం జాషువా. కులాధిపత్యాన్ని ఎదిరించి కవిగా ఎదిగాడు. కులమతాలు గీసుకొన్న గీతలజొచ్చి/ పంజరాన గట్టు వడను నేను/ నిఖిల లోకమెట్లు నిర్ణయించిన నాకు/ తిరుగులేదు, విశ్వనరుడ నేను.. అన్నాడు. ఇటువంటి ప్రగతిశీల భావజాలంతో సమసమాజం కోసం నిరంతరం పాటు పడిన మహోజ్వలిత సామాజిక పద్యకవి, నవయుగ కవితా చక్రవర్తి గుర్రం జాషువా. తను రాసిన కవితా ఖండికలు తెలుగునాట సంచలనాలయ్యాయి. ఆలోచింపజేశాయి.

ఈనాటి సమాజంలోనూ కులవివక్ష ఇంకా కొనసాగుతూనే వుంది. దళితులపై, బలహీనులపై, మహిళలపై దాడులు, హత్యలు, అత్యాచారాలు కొనసాగుతూనే వున్నాయి. ధిక్కార స్వరాలు జనియించాల్సిన తక్షణ అవసరముంది. జాషువా అంటే 'గబ్బిలం' గుర్తొస్తోంది. వర్ణవ్యవస్థను తూర్పారబట్టిన ఖండకావ్యమది. "ఆ యభాగ్యుని రక్తంబునాహరించి/ యినుప గజ్జెల తల్లి జీవనము సేయు/ కసరి బుసకొట్టు నాతని గాలి సోక/ నాల్గు పడగల హైందవ నాగరాజు" అన్నది వర్ణవ్యవస్థను తీవ్రంగా ఎండగట్టిన పద్యం.

కులాల కుమ్ములాటలు, మతోన్మాదాల మారణ హోమాలు, అసమానతలూ ఈ ఏడుపదులు దాటిన స్వతంత్ర భారతంలో కొనసాగుతూనే వున్నాయి. ఆకలి, దారిద్ర్యం లేని దేశాన్ని చూడాలని తపన పడేది అభ్యుదయవాదులు. వారి కల సమసమాజమే. ప్రగతిశీల సాహిత్యమంతా కష్టాల్లోంచి, కన్నీళ్ళల్లోంచి, బాధల్లోంచి, ఆకలి, ఆక్రందనల్లోంచి పురుడుబోసుకుంది. పిడికిలి బిగించి సమ సమాజ నిర్మాణానికి రాళ్ళెత్తాలంటోంది. కవులకు కలాలే ఆయుధాలు. ప్రజాచైతన్యమే పరమావధిగా తమ రచనల్లో పోరాటం సాగిస్తారు. పద్య కవిత్వంతో సమాజ రుగ్మతలపై యుద్ధం సాగించిన మహోన్నత కవి గుర్రం జాషువా. ఎన్నో రచనలు ఆయన్ని సాహిత్యలోకంలో నిలబెట్టాయి. ఆయన కవిత్వంలో మానవత్వం, సామాజికత, నైతికత, దార్శనికత కనిపిస్తాయి. సమాజం కోసమే బతికి, అసమానతల అంతానికి పంతం పట్టిన కవి జాషువా. దేశాభిమానం, జాతీయాభిమానం ఉన్న తెలుగు కవి. ఆయన సాహిత్యాన్ని సామాన్య జనంలోకి తీసుకెళ్ళాలి. ప్రస్తుత పాలకులు జాతిని జాగృతం చేసిన మహాకవి జాషువా భావాల పట్ల వివక్ష చూపిస్తున్నారు. సామాన్య కుటుంబంలో జన్మించి అసమాన్యమైన రచనలు చేసి తెలుగు సాహిత్యానికందించిన కీర్తి పతాక జాషువా. గబ్బిలం (1941) ఆయన రచనల్లో సర్వోత్తమమైనది. అంటరాని కులానికి చెందిన కథానాయకుడు తన గోడును కాశీ విశ్వనాథునికి చేరవేయమని గబ్బిలంతో సందేశం పంపడమే దీని కథాంశం. ఎందుకంటే గుడిలోకి అతడికి ప్రవేశం లేదు, కానీ గబ్బిలానికి అడ్డు లేదు. కథానాయకుడి వేదనను వర్ణించిన తీరు హృదయాలను కలచివేస్తుంది. గబ్బిలం మాత్రమే ఆ కాశీ విశ్వనాథుడి చెవి దగ్గరకు వెళ్ళ సందేశం చెప్పగలదు. గబ్బిలం నలుపువర్ణం. అణగారిన వర్గాల సంకేతం.

ఈ కావ్యంలో తన భావాలను ఎంతో చక్కగా వివరించారు.

ఈ దేశ పాలకులు చాతుర్వర్ణ వ్యవస్థకు జీవం పోస్తూ దేశంలో మనువాదమే రాజ్యాంగంగా అమలు చేయనారంభించారు. జాషువా ఆవేదన చెందిన కాలం కన్నా వెనక్కు ప్రజలను తీసుకుపోతున్నారు.

జాషువా కొత్త సమాజ ఆవిర్భావం కోసం కలలు కన్నాడు. తన కలంతో నవీన సమాజానికి పునాదులు వేయాలనుకున్నాడు.'గబ్బిలం' నిజమైన సామాజిక వాస్తవికతావాద కావ్యంగా మలిచాడు. కర్మ సిద్ధాంతం నుంచి కవిత్వం దాకా, వినుకొండ నుంచి వెండికొండ దాకా, నన్నయ నుండి వేమన దాకా ఇలా ఆయన హృదయాన్ని స్పృశించి, స్పందింపజేసిన ప్రతి అంశాన్ని రసవత్తరంగా మలచి సామాజిక సందేశాన్ని వర్తమాన సమాజానికందించిన మహాకవి జాషువా. దళిత వేదనకు ప్రతీకగా నిలిచిన మహత్తర కావ్యం గబ్బిలం.జీవితంలో పేదరికాన్ని, అవమానాన్ని సమాంతరంగా అనుభవించాడు. అందుకే జాషువా "నాకు గురువులు ఇద్దరు. పేదరికం, కులమత బేధం. ఒకటి సహనాన్ని నేర్పితే, రెండవది నాలో ఎదిరించే శక్తిని పెంచింది." అంటూ చెప్పుకున్నాడు. అందుకే

'కులమతాలు గీచుకున్న గీతలు జొచ్చి/ పంజరాన గట్టు వడను నేను
నిఖిలలోక మెట్లు నిర్ణయించిన/ నాకు తరుగు లేదు విశ్వనరుడ నేను'

అని విశాలమైన దృక్పథాన్ని చాటుకున్నాడు. ఉన్నతమైన రచనలతో భారతీయ సాహిత్యంలో చిరస్మరణీయమైన స్థానం సంపాదించుకున్నాడు. మానవత్వం, హేతువాదం ఆయన రచనకు మూలాధారాలు.

'ప్రతిమల పెండ్లి సేయుటకు వందలు వేలు వ్యయించు గాని
దు:ఖితమతులైన పేదల ఫకీరుల శూన్యములైన పాత్రలన్
మెతుకువిదల్పదీ భరతమేదిని ముప్పది మూడు కోట్లదే
వతలెగవడ్డ దేశమున భాగ్యవిహీనుల క్షుత్తులార్తురే..' అంటూ

ధనవంతుల అపవ్యయాన్ని ఎండగట్టారు. ఇందులో జాషువా హేతువాద దృష్టి స్పష్టంగా తెలుస్తుంది. దీనుల పట్ల, సంఘం అణచివేసిన వారి పట్ల అపారమైన సానుభూతితో కలం కదలించిన కవి జాషువా స్మరణీయుడు, ఆచరణీయుడు. ఈ 129వ జయంతి సందర్భంగా అతడాశించిన సమాజ నిర్మాణం కోసం, ఆ మహకవి ఆలోచనల దారుల్లో ఆచరాణాత్మక అడుగులేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– కెంగార మోహన్
రాష్ట్ర అధ్యక్షులు, సాహితీ స్రవంతి

27న గుంటూరులో సాహిత్య పురస్కార సభ

నేటి సమాజిక, ఆరిక రాజకీయ పరిణామాల నేపధ్యంలో గుర్రం జాషువా సాహిత్యాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకవెళ్ళాల్సిన అవసరం వుంది. జాషువా 1895 సెప్టెంబర్ 28న ఉమ్మడి గుంటూరు జిల్లా వినుకొండ సమీపంలోని చాట్రగడ్డపాడులో జన్మించారు. నాటి సమాజిక పరిస్థితుల్లో కుల వివక్షకు గురై తన జీవితాంతం సామాజిక రుగ్మతులకు వ్యతిరేకంగా తన గళాన్ని, కలాన్ని ఎక్కుపెట్టారు. కుల, మత, ప్రాంతీయ తత్వాలు, కుల వివక్ష, అంటరానితనం, పేదరికం, మూఢచారాలు, అంధ విశ్వాసాలు, కర్మ సిద్ధాంతం, విగ్రహారాధన, మహిళలపై అకృత్యాలకు వ్యతిరేకంగా తన సాహిత్యాన్ని ప్రజలకు అందించి చైతన్యం చేశారు. జాషువా విజ్ఞాన కేంద్రం గత 10 ఏళ్ల నుంచి జాషువా జయంతి సందర్భంగా అనేక సమకాలీన అంశాలపై సదస్సులు, గోష్టులు, కవి సమ్మేళనాలు నిర్వహిస్తూ సాహిత్యరంగంలో సేవలందించిన ప్రముఖులకు ఈ సందర్భంగా జాషువా సాహిత్య పురస్కారాన్ని అందిస్తుంది. 2014 నుంచి ఇప్పటివరకూ గోరటి వెంకన్న, సుద్దాల అశోక్ తేజ, చంద్రబోస్, నల్లి ధర్మారావు, పాపినేని శివశంకర్, కత్తి పద్మారావు, పిల్లి జయధీర్, పాటిబండ్ల ఆనందరావు, ఓల్గా, రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి తదితర ప్రముఖులకు జాషువా సాహిత్య పురస్కారాన్ని అందించడం జరిగింది. 2024 జాషువా సాహిత్య పురస్కార ప్రదాన సభ ఈ నెల 27న సాయంత్ర 4 గంటలకు గుంటూరులోని జాషువా విజ్ఞాన కేంద్రంలో జరుగుతుంది. ప్రముఖ అభ్యుదయ కవి ఆచార్య గుమ్మా సాంబశివరావు; 'పాడుదమా స్వేచ్ఛాగీతం' రచయిత, సాహితీ వేత్త గంటేడ గౌరునాయుడుకు ఈ ఏడాది పురస్కారం ప్రదానం చేయాలని కమిటీ నిర్ణయించింది.

డా॥ గుమ్మా సాంబశివరావు... గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వేజెండ్ల గ్రామంలో జన్మించి నాగార్జున విశ్వవిద్యాలయంలో తెలుగు ఎంఎ విద్యను అభ్యసించారు. సర్వ ప్రథమునిగా ఉత్తీర్ణత సాధించి, బాలిశెట్టి వెంకట సుబ్బమ్మ మెమోరియల్ బంగారు పతకాన్ని అందు కున్నారు. 'అన్నమాచార్య కీర్తనలలోని వర్ణనలు' అనే అంశంపై డాక్టరేట్ చేశారు. విజయవాడ లయోలా కళాశాల అద్యాపకునిగా పనిచేశారు. వివిధ సామాజిక, సాంస్కృతిక అంశాలపై 27 రచనలు చేశారు. ఆకాశవాణి, దూరదర్శన్‌లలోనూ, వివిధ జాతీయ సదస్సుల్లోనూ వందలాది ప్రసంగాలు చేశారు. గంటేడ గౌరునాయుడు .. పార్వతీపురం మన్యం జిల్లాలో కొమరాడ మండలం దళాయి పేటలో సాధారణ రైతు కుటుంబంలో జన్మించారు. తెలుగు ఉపాధ్యాయునిగా పనిచేస్తూ సాహిత్య రంగంలో ఎనలేని కృషి చేశారు. వీరు రాసిన "పాడుదమా స్వేచ్ఛాగీతం ఎగరేయుదమా జాతిపతాకం' గేయం విస్తారమైన ప్రాచుర్యం పొందింది. మహారాష్ట్ర ప్రభుత్వం ఈ గీతాన్ని విద్యార్థులకు వారి సిలబస్‌లో చేర్చింది. ప్రాజెక్టుల ప్రాధాన్యతను వివరిస్తూ ఆయన వ్రాసిన కవితలు అంబేద్కర్ యూనివర్శిటీ పాఠ్యాంశాల్లో చేర్చారు. గౌరు నాయుడు అనేక కథలు, కవితలు, వ్యాసాలూ రాశారు. వివిధ సాహితీ సంస్థల ద్వారా 9 పురస్కారాలను అందుకున్నారు. వీరిద్దరికీ 2024 గుర్రం జాషువా సాహితీ పురస్కారం చేయడం జరుగుతుంది. శాసనమండలి సభ్యులు కె.ఎస్.లక్ష్మణరావు అధ్యక్షతన పురస్కార ప్రదాన సభలో మాజీ ఎమ్మెల్సీలు ఎం.వి.ఎస్.శర్మ, వి.బాలసుబ్రమణ్యం; సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ తదితరులు ప్రసంగిస్తారు. సాహితీమిత్రులు హాజరు కావాల్సిందిగా మనవి.

– పాశం రామారావు, మేనేజింగ్ ట్రస్టీ,
గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం, గుంటూరు.
94900 98624

అభ్యుదయ నాటకానికి అండ బెల్లంకొండ

గురజాడ, చలం, జాషువా, బెల్లంకొండ రామదాసు... వీరందరూ తెలుగు భాషా సాహిత్యాన్ని మలుపుతిప్పిన ఘనా పాఠీలు. సమాజాన్ని భావ విప్లవ ధోరణిలో ఆలోచించి, ఆలోచింపచేసి ఆనాటి సమాజం కంటే ఎంతో ముందు చూపుతో రచనలు చేసి ముందు తరాలకు దశా దిశా నిర్దేశం చేసి యుగకర్తలుగా నిలిచారు. వారి రచనల్లోని భాష, భావోద్వేగాలు గమనిస్తే, మనం రెండు శతాబ్దాలకు వెనుక కంటే ఇంకా వెనకబడి ఉన్నామని ఒప్పుకోవాల్సి వస్తుంది. సాంకేతికంగా అభివృద్ధి చెందినా మానసికంగా పైన పేర్కొన్న మేధావులతో పోల్చుకుంటే మనం ఇంకా ఆదిమానవ, అంధ యుగంలోనే ఉన్నామని తెలిసి సిగ్గుపడతాం. అలా సిగ్గుపడడం వివేకాన్ని మేల్కొల్పి, రెట్టించిన సమరోత్సాహంతో పని చేస్తే కానీ, ఇప్పటి సంఘాన్ని కాలానికి తగ్గ వేగంతో ముందుకు నడిపించినవారం కాలేము.

సంస్కారం, సంప్రదాయం, సంపద త్రివేణిలా సంక్రమించిన కుటుంబంలో బెల్లంకొండ రామదాసు 1923 ఆగస్టు 23న అప్పటి నరసరావుపేట తాలూకా పమిడిపాడులో జన్మించారు. ఆయన ఎదిగే క్రమంలో తల్లిదండ్రుల వారసత్వం నుంచి అబ్బిన సృజనశీలత, బ్రహ్మ సమాజం, కాంగ్రెస్, నవ్య సాహిత్య పరిషత్తు ప్రభావం ఆయనను కాలం కంటే ముందుగా ఆలోచింపచేసి నడిపించిందని చెప్పుకోవాలి. అడుగులు శ్రీశ్రీ బాటలో ముందుకు పడినా, ఆపైన తనదైన మార్గాన్ని నిర్దేశించుకొని తన సమకాలీకులు కుందుర్తి ఆంజనేయులు, ఏల్చూరి సుబ్రహ్మణ్యంలతో కలిసి 'నయాగరా' కావ్యాన్ని వెలువరించారు 1940 లోనే. రామదాసు తన తొలి కవితా సంపుటి 'శ్మశానం' వెలువరించారు. 1953లో రామదాసు తన తొలి నాటకం 'అతిథి'ని రచించారు. గ్రామ రాజకీయ వ్యవస్థలో అధికారానికి అంతస్తుకు ప్రతినిధులైన వారికీ, వారి చేత అణగదొక్కబడుతున్న పీడిత వర్గాలకి మధ్య జరిగిన ఘర్షణను ఆ నాటక ఇతివృత్తంగా తీసుకున్నారు. సంఘర్షణ సమాజాన్ని ప్రగతిశీలం చేస్తుంది. సంఘ చైతన్యం వ్యక్తికి మార్పిడి అయ్యే దశలో వ్యక్తి శక్తికి పర్యాయపదంగా, వ్యక్తికి బహువచనంగా నిలబడగలుగుతాడు. ఈ క్రమంలో మనిషి యొక్క అంతరంగ భేదాలు విస్మరిస్తే అది సమగ్ర స్వరూపాన్ని సంతరించుకోజాలదు' అని నమ్మిన రామదాసు, మాస్టార్జీ (1953), ఆకాశమన్న (1957) అనే మరో రెండు నాటకాలుగా తన భావ తీవ్రతను మలచగలిగారు.

ఒక స్త్రీ జీవితంలో ఎదురైన విషమ పరిస్థితుల కారణంగా పొందే ఆవేదనను, ఓదార్పును 'అతను' పాత్రధారి రూపంలో అతిథి నాటకంలో అండగా నిలబడతాడు. మాస్టార్జీ నాటకంలో– 'మనిషి ఈ సంఘంలో దేవతలా బతకడం అసాధ్యం. బతకాలంటే మనిషి రాక్షసుడు కావాలి. అంటే అన్యాయం చేయాలి. అక్రమం చేయాలి. అబద్ధం ఆడాలి. అదే న్యాయం. ఈరోజు నేను అదే చేశాను' అని న్యాయస్థానంలో కన్ఫెషన్ చేస్తాడు 'రజిని' పాత్రధారి.

1956లో రాసిన 'పునర్జన్మ' నాటకం హరింద్రనాథ్, కమలాదేవి చటోపాధ్యాయల ఆంధ్ర పర్యటన కారణంగా మాస్కో ఆర్ట్ థియేటర్ స్టానిస్లవిస్కీ ప్రభావం తెలుగు నాటక

రచయితలపైనా, నటనారీతులు, ప్రవర్తన ధోరణులపైన పడింది. చైతన్యంతో రగిలిపోతున్న రామదాసు అందుకు దూరంగా ఎలా ఉండగలడు? 'ఒక గొప్ప వ్యక్తి యొక్క ఆంతరంగిక వేదనే ట్రాజెడీ' అని నమ్మిన స్టానిస్లవిస్కీ ప్రభావం బెల్లంకొండ రచనా విధానం, పాత్ర చిత్రణలోనూ ప్రతిఫలిస్తుంది. తాను ఒక భావుకుడిగా మిగిలిపోకుండా వాస్తవ జీవితంలో సమాజంలోని అన్యాయాల పట్ల ఆక్రోశించే వ్యక్తిత్వం, తిరుగుబాటు చేసే విప్లవ దృక్పథమూ కనిపిస్తాయి. విజయవాడ ఆకాశవాణి నాటకోత్సకం 'పునర్జన్మ' నాటకంతో ప్రారంభమైంది. మనుషుల ప్రవర్తనలను శాసించేది వారికి ఎదురయ్యే పరిస్థితులేనన్న నిజం ఈ నాటకంలో కనిపిస్తుంది. ఈ నాటకానికి ప్రేరణ రష్యన్ నాటకం 'రెసరెక్షన్' అని చెప్పబడ్డప్పటికీ ఇందులోని ప్రధాన పాత్ర శ్యామల టాల్‌స్టాయ్ అన్నా కెరినినాను గుర్తుకు తెస్తుంది" అంటారు రంగస్థల అనుభవశాలి డాక్టర్ కొల్లి మోహనరావు. 'నాకు కావాల్సింది నీవు, నీ గత చరిత్ర కాదు' అన్న డాక్టర్ మూర్తి మాటలు .. ఆ తర్వాతే ఎన్నో కథలకు, సినిమాలకు మూలం అయిందన్న విషయం మనకు తెలిసిందే! అలా మూర్తి జీవిత భాగస్వామి అవుతుంది శ్యామల. అయితే తనను పతితను చేసిన రామ్ కుమార్ దుశ్చర్యల వల్ల తిరిగి ఆమె జీవితం భర్త నిరాదరణ వల్ల అల్లకల్లోలం అవుతుంది. మూర్తి తండ్రి జనార్దనరావు జోక్యంతో తిరిగి ఒడ్డున పడుతుంది.

సమస్యా ప్రధానమైన నాటకాలను సందేశ నాటకాలుగా మార్చి ఉద్వేగపూరిత సంభాషణలతో బలం చేకూర్చి అప్పటి ప్రదర్శన రీతులను మార్చివేసిన నాటకాలుగా మాస్టర్జి, పునర్జన్మ నాటకాలు నిలిచాయి. పరిషత్తులలో ఎన్నో బహుమతులు గెల్చుకున్నాయి. 1956లో రాసిన 'పంజరం', 1957లో రాసిన 'ఆకాశ రామన్న' నాటకాలు పీడిత ప్రజానీకం కష్టాలకు, ధనవంతుల అవినీతికి నిలువుటద్దాలు. ఆకాశరామన్న .... నికొలాయ్ గొగోల్ రచించిన ఇన్‌స్పెక్టర్ జనరల్ నాటకానికి స్వేచ్ఛానువాదమే అయినప్పటికీ, ఆ విషయం మనకు స్మరణకే రాదు. రామదాసు అనువాద పటిమ అలాంటిది. 'పాలనా వ్యవస్థలో చోటు చేసుకున్న లొసుగులు, అలసత్వం, లంచగొండితనంపై బెల్లంకొండ ధ్వజమెత్తి చీల్చి చెండాడిన తీరు అవిస్మరణీయం. ఆనాటి అస్తవ్యస్త వ్యవస్థపై విచ్చుకత్తులు వంటి విసురులను రామదాసు విసిరారా'ంటారు డాక్టర్ కందిమళ్ళ.

ఆకాశరామన్న నాటకంలో వర్గ పోరాటాన్ని అద్భుతమైన ప్రతీకాత్మక ధోరణిలో చిత్రించారు. అందుకే 'అందరికీ అనుకూలమైనదే న్యాయం' అనే సందేశంతో రాసిన ఈ నాటకంలో బెల్లంకొండ పరిపూర్ణ తాత్విక చింతన స్పష్టంగా వ్యక్తం అవుతుంది. రామదాసు తన నాటకాల్లో పతిత స్త్రీజనోద్ధరణ, అవినీతి నిర్మూలనలో ద్వంద్వ ప్రవృత్తులను ప్రస్ఫుటంగా చిత్రించారు.

'సంఘం భయానికి మరో పేరు. మనలోని భయాన్నే సంఘం అంటాం. పాలు తాగే పిల్లి లాంటిదే సంఘం. ఆ సంఘం కంటే గొప్పది, మంచిది, అంతరాత్మ. ఆ అంతరాత్మకు ప్రతి ఒక్కరూ తలవంచాల్సిందే! చెడును మంచితో జయించాలి. బురదను నీటితో కడగాలి. కాబట్టి భయాన్ని జయించు' అన్న ఈ అమృతోపమానమైన మాటలు బెల్లంకొండ రామదాసు పునర్జన్మ నాటకంలోనివి. బెల్లంకొండ రచనలు ఎంతో అధ్యయనం, జీవితానుభవం, ఆంతరంగిక, బహిరంగ సంఘర్షణ, సూక్ష్మ పరిశీలనతో రచించబడ్డాయి.

రామదాసు అనువాద కళలో అందెవేసిన చేయి. ఆయన ఠాగూర్ 'రాజు– రాణి', 'బలిదానం' నాటకాలను తెలుగులోకి అనువదించారు. 'అమ్మణి', 'గతానుగతం' కూడా అనువాద నాటకాలే.. ఈ రెంటిలోనూ స్త్రీ పాత్ర మనస్తత్వ చిత్రణే ప్రధానంగా కనిపిస్తుంది.

పత్రికారంగంలో ఉద్యోగించటం, ప్రసిద్ధ కవులు రచయితలతో పరిచయాలు, ప్రముఖ ప్రచురణ సంస్థల ప్రోత్సాహం, కళారంగంలో నిష్ణాతులు నూతన ప్రయోగాభిలాషల తోడ్పాటుతో రామదాసు నాటక రచనా కషీవలత్వం కొత్త పుంతలు తొక్కిందంటారు, పరిశీలకులు. దేశం విముక్తం అయిన తర్వాత రోజుల్లో యువత మార్క్సిజం పట్ల ఆసక్తి, గాంధీవాదం పట్ల అనాసక్తీ అలుముకున్న కాలంలో... అభ్యుదయ దృక్పథం, స్త్రీల సమస్యలు రచయితలను వెంటాడుతున్న రోజుల్లో బెల్లంకొండ గొప్ప నాటకాలను సృజయించారు. తన రచనలను సమాజపక్షం కావించి, తెలుగు నాటక రంగానికి ఒక దారి దీపంగా నిలిచారు.

ఇటీవల కేంద్ర సాహిత్య అకాడమీ నరసరావుపేటలో పల్నాడు కళాక్షేత్రం సంయుక్తంగా నిర్వహించిన ఒకరోజు సమావేశంలో తెలుగు సలహా సంఘం కన్వీనర్ డాక్టర్ సి.మణాళిని సభను ప్రారంభిస్తూ "రామదాసు గారి నిష్క్రమణ కవితను గుర్తుచేస్తూ.. ఆయన తన నిర్గమనం తర్వాత మూసేయమన్న తలుపులను ఈ శతజయంతి వత్సర సందర్భంలో తెరిచి, బెల్లంకొండ రచనలపై సర్వ సమగ్రంగా సభలు సదస్సులు, వ్యాసాలు, పత్రికా కథనాలు ఇంకా రావాల్సిన అవసరం ఉందని అన్నారు. 1969 సెప్టెంబర్ 19న బెల్లంకొండ భౌతికకాయాన్ని విడిచిపెట్టినా, ఆయన ఆలోచనలు రచనలు తెలుగు భాషా సాహిత్య సంపదగా భావించి వాటిని భద్రం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పరిపూర్ణుడైన ఒక రచయిత భావజాలం, రచనలూ కాలానికి అతీతంగా సూర్యకాంతి లాగే అనునిత్యం ప్రదీప్తం చేస్తుంటాయి, ప్రక్షాళన చేస్తుంటాయి, ప్రగతి పథంలో పురోగమింప చేస్తుంటాయి.

– మల్లేశ్వర రావు ఆకుల
79818 72655

కార్మికులకు అండగా అక్షర సంకల్పం



రాష్ట్రంలో, దేశంలో, మొత్తంగా తీసుకుంటే ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో కార్మిక, ప్రజా పోరాటాలు జరుగుతూ ఉన్నాయ్. ఆ పోరాటాలకు వెన్నుదన్నుగా నిలబడుతున్న శక్తులూ ఉన్నాయ్. యువకవి చౌశా విశాఖ ఉక్కు కార్మిక పోరాటానికి మద్దతుగా 'ఉక్కు సంకల్పం' పేరిట కవితా సంపుటిని వెలువరించారు. అనంత పురం జిల్లాకు చెందిన ఈ కవి ఏడెనిమిదేళ్ళ క్రితం కొద్దికాలం విశాఖలో ఉద్యోగ రీత్యా ఉన్నప్పుడు అక్కడి ఉక్కు ఫ్యాక్టరీని, వారి ఉద్యమాలను దగ్గరనుంచి గమనించారు. అందుకే విశాఖ ఉక్కును ప్రయివేటుపరం చేయాలని సంకల్పించిన నాటి ప్రభుత్వాన్ని ఎండగడుతూ, కార్మిక శక్తుల పోరాటాన్ని కీర్తిస్తూ, సెప్టెంబరు 2022లో ఈ 'ఉక్కు సంకల్పం' వినిపించారు. ఇది నేటికీ ప్రాధాన్యత కలిగి, సమకాలీనంగా ఉంది.

ఇందులో మొదటగా ఉక్కు సంకల్పం శీర్షికా కవిత దర్శనమిస్తుంది. ఈ పుస్తక సారాంశాన్నీ తెలుపుతుంది. "ఉద్యమాల ఫలితమిది/ ప్రాణాల త్యాగమిది/ జాతి సంపదది/ జనుల కష్టమది!" అంటూ విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు నినాదాన్ని, సాధించిన విజయాన్ని గుర్తు చేస్తారు. శ్రమను ధారపోశామని, స్వేదం చిందించామని, జీవితాలనే అర్పించామని విత్తును వృక్షం చేశామని అంటూనే "భూములు మావి/ పెట్టుబడి మాది/ స్టీల్ ప్లాంట్ మాది!" అని నిర్ణయిస్తాడు. 'అమ్మేందుకు నువ్వెవరు?/ కొనేందుకు వారెవరు?/ ఎవరి సొమ్మిది?/ ఎవరి జాగీరది?' అని ప్రశ్నిస్తూనే ఏళ్ళ పోరాటాన్ని వధాగా పోనీం అని, మా జోలికొస్తే మౌనంగా ఉండలేం అనీ 'ఉక్కు సంకల్పం మా సొంతం/ ఉప్పెనలా మారుతాం/ ఉరుములా దూకుతాం/ ఉగ్రరూపం దాల్చుతాం!' అని తన మనసులో దాగున్న సంకల్పాన్ని చాటుతాడు. నిజానికి అది కార్మిక, ప్రజా సంఘాల సంకల్పమది. అందుకే దానికి మద్దతు తెల్పుతున్నాడు చౌశా. ఉక్కు వినబడలేదా అన్న కవితలో ఆటగా ఉందా, తమాషాగా ఉందా అని హెచ్చరిస్తూ ఎగసిన ఉద్యమ నినాదం తలకెక్కలేదా అని కళ్ళెర్రజేస్తాడు. 'పోస్కో కోసమో/ ఇంకెవరి కోసమో.../ కార్మిక జీవితాలు బలి పెడుతుంటే?/ ప్రజల ఆస్తిని అమ్మేస్తుంటే?/ కారుచౌకగా కట్టబెట్టేస్తుంటే?' దాన్ని దేశభక్తి అనుకోవాలా, నిరంకుశత్వమనుకోవాలా? ఇది పెట్టుబడి దారుల ప్రయోజనం కోసం చేస్తున్నదే కదా అని నిలదీస్తాడు. 'ఉక్కు ఉద్యమం/ చల్లారదని గుర్తు పెట్టుకో!/ దేశమంతా వ్యాపిస్తుందని/ గుర్తుంచుకో...!' అని జాగ్రత్తగా ఉండమంటాడు.

ఉక్కు ఉద్యమం 200 (ఉద్యమం రెండువందల రోజులు దాటినప్పుడు), భారత్ బంద్ సెప్టెంబరు 27 దేశవ్యాప్త సమ్మెను గుర్తు చేస్తూ రాసిన కవితల్లో ఉద్యమ స్ఫూర్తిని కొనియాడతాడు. ఇక నిర్వాసితులు, అధికారం కోసం, ఖద్దరు గద్దలు, విధానం అమ్మకమేనా?, చిత్తశుద్ధి ఉందా?, మీ ఉద్దేశం ఏమిటి, రెండు నాల్కలు మొదలైన కవితల్లో ప్రభుత్వాల ద్వంద్వనీతిని ఎండగడతాడు. మొత్తంగా ఈ కవితా సంపుటి కార్మిక, కర్షకులందరి కంఠధ్వనిగా వినిపిస్తుంది. పిడికిలి బిగించేలా చేస్తుంది.

'ప్రయివేటు ఎందుకు?' కవితలో కరోనా కాలం నాటి సంగతులను గుర్తు చేస్తూ "ఆక్సిజనో రామ చంద్రా అంటూ/ దేశం అల్లాడుతుంటే/ ప్రాణ వాయువు లేక/ వేలమంది పిట్టల్లా రాలి పోతుంటే" నేనున్నానంటూ/ ఉత్పత్తి చేస్తున్నం దులా?/ దేశం ఊపిరిని నిలబెట్టి నందుకా? ఈ ప్రవేటీకరణ' అని ఉక్కు ఉత్పత్తి నిలిపేసి ఆక్సిజన్ అందించిన విశాఖ ఉక్కును ఇంకెందుకు ప్రయివేటీకరిస్తారని ప్రశ్నించాడు కవి.

కవికి కార్మిక వర్గ భావజాలముంటే, కవి ప్రజా పక్షపాతిగా ఉంటే కవిత్వం ఇలాగే ఉంటుందని మనం నిర్ధారణ చేయవచ్చు. 'చరిత్ర చేసిన శాసనం' అన్న కవిత రష్యా నవంబర్ మహా విప్లవం సందర్భంగా 12.11.2021న రాసింది. ఈ కవితలో 'తిరుగుబావుటా ఎగరేసి/ విప్లవశంఖం పూరించి/ సత్తా ఏంటో చూపించి../ శత్రువును తరిమికొట్టి'ందెవ్వరో చెబుతాడు. ఆ అభాగ్యులే, ఆ అనాథలే, ఆ అలగాజనమే వీరులుగా, శూరులుగా, విజేతలుగా నిలిచారంటాడు. కవిత చివర్లో 'రష్యా మహావిప్లవం వెలుగులో/ ఎర్ర సైన్యం స్ఫూర్తితో/ పోరాడుదాం రారండి!' అని పిలుపునిస్తాడు. వ్యవసాయ చట్టాలను కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకున్నప్పుడు 2021 నవంబరు 19న రాసిన కవిత 'గెలుపు పోరాటం'. ప్రభుత్వాన్ని ముసలి ఆంబోతుగా పోలుస్తూ "పాపం.../ ముసలి ఆంబోతుకు/ ఆ రైతులు భయపడలేదు/ పారిపోలేదు" ఎదురు తిరిగి రోజులు కాదు, నెలలు కాదు, ఏకంగా సంవత్సర కాలం పోరు చేశారని ఆ పోరాటంలో ఏడు వందల మంది అమరులయ్యారని నివాళి అర్పిస్తాడు. "ముక్కుకు తాడేశారు/ కొమ్ములు విరిచి/ గాట్లో కట్టేశారు!/ చేసేదేంలేక/ సలాం చేసింది/ ఓటమిని అంగీకరించింది" అంటాడు.

ప్రభుత్వాలన్నీ ఇంకో చెరువులో నీళు ళ్నాయని చేపలను మోసం చేసి కడుపు నింపుకున్న కొంగ లాగా తమ నటనతో, మాటలతో ఈ ఉక్కు ఫ్యాక్టరీని పెద్దోళ్ళకు అప్పజెప్పాలని చేస్తున్న విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న కార్మికులకు తన ఉక్కు సంకల్పంతో ఉక్కు పిడికిలి బిగించేలా ఈ కవితా సంపుటి ప్రేరణ కలిగిస్తుంది. అలాంటి కవిత్వాన్ని తీసుకొచ్చిన కవికి విప్లవాభినందనలు.

– జంధ్యాల రఘుబాబు
98497 53298

ఇండియా-ఇజ్రాయిల్ బిజినెస్ సమ్మిట్ రద్దు చేయండి

- ఐఐఎస్‌సిని కోరిన దేశ, విదేశాల్లోని పలు యూనివర్సిటీల ఫ్యాకల్టీ సభ్యులు, విద్యార్థులు
- ఉన్నత విద్యా సంస్థకు 1300 మందికి పైగా లేఖ
- పాలస్తీనా, పొరుగు దేశాల్లో ఇజ్రాయిల్ దుశ్చర్యలపై తీవ్ర ఆందోళన

బెంగళూరు : బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సి)లో నిర్వహించతలపెట్టిన 'ఇండియా - ఇజ్రాయిల్ బిజినెస్ సమ్మిట్'పై దేశ, విదేశాల్లోని పలు యూనివర్సిటీల అధ్యాపకులు, విద్యార్థుల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తున్నది. ఈ సమ్మిట్‌ను రద్దు చేయాలంటూ భారత్, విదేశాలలో పలు యూనివర్సిటీల నుంచి 1300 మందికి పైగా ఫ్యాకల్టీ సభ్యులు, విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు ఐఐఎస్‌సికి వారు లేఖ రాశారు. అందులో వారు తమ ఆందోళనలను వెలిబుచ్చారు. 'ఇండియా-ఇజ్రాయెల్ బిజినెస్ సమ్మిట్' సోమవారం ఐఐఎస్‌సిలో జరగాల్సి ఉన్నది. ఈ సమ్మిట్‌ను థింక్ ఇండియా సంస్థ, ది ఇండియన్ చాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్, ది మైసూర్ లాన్సెర్స్ హెరిటేజ్ ఫౌండేషన్ నిర్వహించతలపెట్టాయి.

ఈ కార్యక్రమాన్ని అనుమతించటం ద్వారా పాలస్తీనాలో ఇజ్రాయిల్ మారణ హోమాన్ని, పొరుగుదేశాలపై ఆ దేశ దూకుడు చర్యలకు నేరుగా మద్దతుచ్చినట్టవుతుందని విద్యార్థులు, అధ్యాపకులు తమ లేఖలో పేర్కొన్నారు. గాజాలో ఇజ్రాయిల్ యుద్ధంలో విధ్వంసాన్ని వారు ఐఐఎస్‌సి డైరెక్టర్ గోవిందన్ రంగరాజన్‌కు రాసిన లేఖలో ఎత్తి చూపారు. ఇన్‌స్టిట్యూట్ ఈ కార్యక్రమాన్ని స్పాన్సర్ చేస్తూ నిర్వహించటంపై వారు తీవ్ర ఆందోళన వెలిబుచ్చారు. గాజాలోని ప్రతి యూనివర్సిటీనీ ఇజ్రాయిల్ ధ్వంసం చేసిందని పేర్కొన్నారు. ఆరోగ్య సౌకర్యాలను కూడా విధ్వంసం చేసిందని వివరించారు. గాజాలో 96 శాతం మంది ఆహార అభద్రతలో ఉన్నట్టు ప్రపంచ ఆహార సంస్థ అంచనా వేసిందని పేర్కొన్నారు. లెబనాన్‌లోనూ ఇజ్రాయిల్ ఉగ్రదాడులను చేసిందని ప్రస్తావించారు.

పాలస్తీనా ప్రాంతాలలో ఇజ్రాయిల్ ఉండటమనేది అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘించటమేనని, దానికి తప్పక ముగింపు పలకాలన్న అంతర్జాతీయ న్యాయస్థానం ఆదేశాలను లేఖలో వారు ఉటంకించారు. 12 నెలల్లో ఆక్రమిత పాలస్తీనా ప్రాంతంలో ఇజ్రాయిల్ చట్టవ్యతిరేక ఉనికికి ముగింపు పలకాలంటూ ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ తీసుకొచ్చిన తీర్మానాన్ని విద్యార్థులు, ఫ్యాకల్టీ సభ్యులు గుర్తు చేశారు.

ఇలాంటి తరుణంలో భారత్, ఇజ్రాయిల్‌ల మధ్య సహకారాన్ని ప్రోత్సహించటం అనాలోచితమని వివరించారు. ఈ కార్యక్రమాన్ని రద్దు చేయాలనీ, మారణహోమం, వలసవాదాన్ని చేయటానికి ఐఐఎస్‌సి వేదికగా ఉపయోగించటానికి అనుమతించొద్దని ఐఐఎస్‌సి డైరెక్టర్ రంగరాజన్‌ను వారు కోరారు.

బిజినెస్ సమ్మిట్‌ను రద్దు చేయాలని ఆందోళన చేస్తున్న యూనివర్శిటీల ఫ్యాకల్టీలు, విద్యార్థులు

శ్రీలంక అధ్యక్షునిగా ఎన్నికైన మార్క్సిస్టు నేత దిసనాయకె గతంలో సీతారాం ఏచూరిని కలిసినప్పటి చిత్రం (ఫైల్‌ఫొటో)

దిసనాయకెకు సిపిఎం కేంద్ర కమిటీ అభినందనలు

న్యూఢిల్లీ : శ్రీలంక అధ్యక్షుడిగా జెవిపి, నేషనల్ పీపుల్స్ పవర్ (ఎన్‌పిపి) నాయకుడు అనుర కుమార దిసనాయకె ఎన్నికవడం పట్ల సిపిఎం అభినందనలు తెలిపింది. ఈ మేరకు జనతా విముక్తి పెరమున కేంద్ర కమిటీకి సిపిఎం కేంద్ర కమిటీ సందేశం పంపించింది. శ్రీలంక 10వ అధ్యక్షుడిగా దిసనాయకె ఎన్నికవడం పట్ల అభినందనలు తెలియజేసింది. శ్రీలంక చరిత్రలోనే తొలిసారి వామపక్ష అభ్యర్థి అధ్యక్ష ఎన్నికల్లో ఘనవిజయం సాధించడం ఎంతో ప్రాముఖ్యత కలిగిన, గుర్తించదగిన సందర్భమని తెలిపింది. శ్రీలంక సర్వతోముఖాభివృద్ధికి, ప్రజల భాగస్వామ్యంతో కూడిన సాంఘిక, ఆర్థికాభివృద్ధికి, సంక్షేమానికి ఈ విజయం తోడ్పడుతుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేసింది. మరోసారి జెవిపి కేంద్రకమిటీకి శుభాకాంక్షలు తెలియజేసింది.

నేను దొంగనా? వారు దొంగలా?

(మొదటిపేజీ తరువాయి)

విద్యుత్ లేదా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించారా? అని నిలదీశారు.

ఆర్‌ఎస్‌ఎస్‌కు ఐదు ప్రశ్నలు

ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌కు కేజ్రీవాల్ ఐదు ప్రశ్నలు వేశారు. 'ప్రధాన మంత్రి మోడీ దేశంలోని వివిధ పార్టీలకు ఎరచూపించడం, ఇడి, సిబిఐతో బెదిరించడం ద్వారా వాటిని చీల్చడం, ప్రభుత్వాలను కుప్పకూల్చడం చేస్తున్నారు. ఇది సరైనదేనంటారా? మోడీ ఎవరినైతే అవినీతి పరులని అంటున్నారో వారిని పార్టీలోకి తీసుకుంటున్నారు. ఇలాంటి రాజకీయాలతో మీరు ఏకీభవిస్తారా? ఆర్‌ఎస్‌ఎస్ నుంచి బిజెపి పుట్టింది. మోడీ తప్పుడు విధానాలను ఆపే ప్రయత్నం ఎప్పుడైనా ఆర్‌ఎస్‌ఎస్ చేసిందా? ఆర్‌ఎస్‌ఎస్ అవసరం లేదని లోక్‌సభ ఎన్నికల్లో జెపి నడ్డా చెప్పారు. మాతృ సంస్థపై ఆయన ఇంత అసంతృప్తి వ్యక్తం చేసినప్పుడు మీకు బాధ అనిపించ లేదా? మీ వ్యక్తులే (బిజెపి) 75 ఏళ్లకు రిటైర్మెంటు అనే రూల్ పెట్టారు. మోడీకి ఈ నిబంధన వర్తించదని అమిత్ షా అంటున్నారు. అద్వానీకి వర్తించిన ఈ రూల్ మోడీకి ఎందుకు వర్తించదు?' అని ప్రశ్నించారు.

బిజెపిలో చేరాలని ఆఫర్లు వచ్చాయి : సిసోడియా

తన బ్యాంకు ఖాతాలో ఉన్న రూ.10 లక్షలను ఇడి ఫ్రీజ్ చేయడంతో కొడుకు కాలేజీ ఫీజు చెల్లించడానికి సహాయం కోసం అడుక్కోవలసి వచ్చిందని ఆప్ సీనియర్ నేత, ఢిల్లీ మాజీ డిప్యూటీ సిఎం మనీష్ సిసోడియా ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం పాలసీ కేసులో ఏడాదిన్నరపాటు జైలులో ఉంచి తనను అనేక విధాలుగా ఇబ్బందులకు గురి చేశారని తెలిపారు. బిజెపిలోకి మారడానికి చాలా ఆఫర్లు వచ్చాయని, పార్టీ మారకపోతే జైలులో చంపేస్తామని బెదిరించారని ఆయన అన్నారు. కేజ్రీవాల్ మాదిరిగానే తాను కూడా ఎన్నికల్లో ప్రజా తీర్పు తరువాతే ఢిల్లీ ప్రభుత్వంలో బాధ్యతలు చేపడతానని సిసోడియా చెప్పారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ సిఎం అతిషి మర్గెనా, మంత్రులు సౌరభ్ భరద్వాజ్, గోపాల్ రాయ్, కైలాశ్ గెహ్లాట్, ముకేశ్ అహ్లావత్, ఇమ్రాన్ హుస్సేన్, ఆప్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దిసనాయకె ఘన విజయం

(మొదటిపేజీ తరువాయి)

రెండుస్థానాల్లో నిలిచిన అభ్యర్థులకు రెండవ ప్రాధాన్యతా ఓట్ల లెక్కింపు ద్వారా లభించిన ఓట్లు కలిపారు. కీలకమైన ఈ రెండో రౌండ్ ఓట్ల లెక్కింపు తర్వాత దిసనాయకె తిరుగులేని ఆధిక్యత సాధించినట్లు ఎన్నికల సంఘం చైర్మన్ ఆర్ ఎల్ ఎం రత్నాయకె ప్రకటించారు. శనివారం జరిగిన ఎన్నికల్లో 70 శాతానికిపైగా ఓట్లు పోలయ్యాయి.

ఇది మార్పు కోసం ఇచ్చిన తీర్పు: దిసనాయకె

ఇది మార్పు కోసం ఇచ్చిన తీర్పు అని అధ్యక్షునిగా ఎన్నికైన మార్క్సిస్టు నేత అనుర కుమార దిసనాయకె అభివర్ణించారు.దిసనాయకెపై శ్రీలంక ప్రజలు ముఖ్యంగా యువత చాలా ఆశలు పెట్టుకున్నారు. చెల్లింపుల సంక్షోభం, అధిక ధరలు, నిరుద్యోగం, ఉరితాళ్లులా పరిణమించిన ఐఎంఎఫ్ అప్పులు వంటి వాటి నుంచి శ్రీలంకను గట్టెక్కించడం ఆయన ముందున్న అతిపెద్ద సవాళ్లు. వీటిని ప్రజల తోడ్పాటుతో పరిష్కరించేందుకు కృషి చేస్తానని దిసనాయకె చెప్పారు. తాము అధికారంలోకి వస్తే శ్రీలంక ప్రజలకు పెనుభారంగా మారిన అదానీ ఎనర్జీ ప్రాజెక్టును రద్దు చేస్తానని, ఐఎంఎఫ్‌తో రణిల్ విక్రమ సింఘె ప్రభుత్వం కుదుర్చుకున్న 290 కోట్ల డాలర్ల బెయిలవుట్ అగ్రిమెంట్‌ను తిరగదోడతానని ఎన్నికల ప్రచార సందర్భంగా దిసనాయకె హామీ ఇచ్చారు.

యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉదయ్ భాను చిబ్

ఢిల్లీ: ఇండియన్ యూత్ కాంగ్రెస్ (ఐవైసి)కు నూతన అధ్యక్షుడిగా ఉదయ్ భాను చిబ్‌ను కాంగ్రెస్ నియమించింది. శ్రీనివాస్ బివి స్థానంలో ఉదయ్ భానును నియమించినట్లు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం ఐవైసి ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న ఆయన గతంలో జమ్ము కాశ్మీర్ ప్రదేశ్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేశారు.

రాహుల్‌తో ఉదయ్ భాను చిబ్

లాల్ సలాం ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న నేతలు

ఏచూరి నిత్య స్ఫూర్తి

(మొదటిపేజీ తరువాయి)

వ్యతిరేకించారని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలోనూ, రాష్ట్రాల హక్కుల విషయంలో ఆయన ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను బలోపేతం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్న ఈ సమయంలో ఆయనను కోల్పోవడం తీరని లోటని పేర్కొన్నారు.

భారత రాజకీయాల్లో తీరని లోటు : అంబటి రాంబాబు

వైసిపి నాయకులు అంబటి రాంబాబు మాట్లాడుతూ.. కమ్యూనిస్టు ఉద్యమంలో కీలకపాత్ర పోషించారని తెలిపారు. ముఖ్యంగా పేద ప్రజల కోసం నిరంతరం పోరాడుతున్న శక్తిగా దేశవ్యాప్తంగానూ, ప్రపంచ వ్యాప్తంగానూ భావించే పార్టీలో నిబద్ధతగా విద్యార్థి దశ నుండి అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారని తెలిపారు. ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమంలో కీలక పాత్ర వహించే స్థాయికి ఏచూరి ఎదిగారని తెలిపారు. నమ్మిన సిద్ధాంతం కోసం జీవితాన్ని అంకితం చేశారని పేర్కొన్నారు. ఆయన మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి, భారత రాజకీయాలకు తీరని లోటని తెలిపారు. ఒక మంచి పార్లమెంటేరియన్‌గా ఆయన విశేషమైన సేవలు అందించారని అన్నారు.

ఏచూరి మరణం దేశానికి నష్టం : బి.వి.రాఘవులు

ఏచూరి మరణం కమ్యూనిస్టు ఉద్యమంతోపాటు, దేశానికి కూడా నష్టమని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు పేర్కొన్నారు. విప్లవకారుడు, కమ్యూనిస్టు దేశంలో సిపిఎంను అభివృద్ధి చేసి నిర్మించే కర్తవ్యంలో ముఖ్యపాత్ర వహించారని తెలిపారు. దేశంలో బిజెపికి సొంత మెజార్టీ లేకపోయినా తన ఎజెండాలోని ముఖ్యమైన అంశాలను కొనసాగిస్తోందని తెలిపారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను పరిరక్షించడం కోసం అన్ని రాజకీయపక్షాలను ఒకతాటిపైకి తేవడంలో ఆయన అత్యంత కీలకంగా వ్యవహరించారని పేర్కొన్నారు. ఒకే దేశం, ఒకే ఎన్నిక పేరుతో మోడీ ముందుకు వెళుతున్నారని పేర్కొన్నారు. మతాలు, భాషలు, కులాలు కలిగిన దేశంలో ఒకేసారి ఎన్నిక ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ఇది ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తుందన్నారు. దీనివల్ల ఖర్చు కూడా తగ్గదన్నారు. ఈ దేశంలో ప్రజాస్వామ్యం ఉండకూడదనే విధంగా వ్యవహరిస్తున్నారని, రాష్ట్రాల హక్కులు లేకుండా చేస్తున్నారని అన్నారు. గతంలో ఎన్‌టిఆర్‌ను దించేసిన సమయంలో ప్రజలు నిలబడి ఆయనను మరలా తెచ్చుకున్నారని, ఒకే దేశం ఒకే ఎన్నిక వస్తే ఆ అవకాశం వుండదన్నారు. ఈ విషయంలో అందరూ కలిసి పనిచేయాల్సిన సందర్భమని, అటువంటి వారిని కలిపి ఉమ్మడిగా ముందుకు తీసుకెళ్లడంలో సీతారాం దిట్టని పేర్కొన్నారు. ఈ దేశం సమైక్యంగా ఉండాలంటే లౌకిక వాదం ఉండాలని బలంగా నమ్మారని వివరించారు. తిరు మల లడ్డూ తయారీ కలుషితం అయిందన్న విషయాన్ని అందరూ ఖండిస్తున్నారని, కారకులను శిక్షించొచ్చని, కానీ రాజకీయం చేయకూడదని తెలిపారు. దీంతోపాటు అన్ని పదార్థాల్లోనూ కల్తీ జరుగుతుండొచ్చని, వాటినీ నిలువరించాలని కోరారు. దేవుడి సొమ్మును దోచుకునే వారిని వదిలేస్తూ పవిత్రతను ప్రస్తావిస్తే చాలదన్నారు.

పేదల ముద్దుబిడ్డ ఏచూరి : వి.శ్రీనివాసరావు

సీతారాం ఏచూరి పేదల ముద్దుబిడ్డ అని సభకు అధ్యక్షత వహించిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. జీవించినంత కాలం పేదల సంక్షేమం కోసం కృషి చేశారని, చట్టసభల్లోనూ పోరాడారని పేర్కొన్నారు. భాషా సాంస్కృతిక వైవిధ్యంతోనూ, ప్రజలతోనూ ఆయనకు సంబంధం ఉందని తెలిపారు. అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారని వివరించారు. రాష్ట్ర విభజన సమయంలో రాష్ట్ర ఐక్యత కోసం గళం విప్పారని పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా సీతారాం ఏచూరి అందరికీ ఇష్టమైన వ్యక్తని పేర్కొన్నారు.

ఆయన పోరాటమే మాకు స్ఫూర్తి : వైఎస్ షర్మిల

ఏచూరి లౌకిక వాది, మానవతావాది, ఉత్తమ పార్లమెంటేరియన్ అని పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల పేర్కొన్నారు. బిజెపి మీద చిరకాలం పోరాటం చేశారని, ఆ పోరాటమే తమకు స్ఫూర్తి అని ఆమె అన్నారు. 2004లో యుపిఎ ఏర్పాటుకు, ప్రభుత్వం నిలబడటానికి ఎంతో కృషి చేశారన్నారు. ఇప్పుడున్న ఇండియా బ్లాక్ ఏర్పాటుకు ఆద్యుడు ఏచూరి అని, రాహుల్ గాంధీ కూడా ఏచూరి సలహాలు తీసుకుంటారని తెలిపారు. పదవులు, పైసలు ముఖ్యం కాదని, నమ్మిన సిద్ధాంతం కోసం నిలబడిన గొప్ప వ్యక్తి ఏచూరి అని పేర్కొన్నారు.

అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన నేత : రామకృష్ణ

అంతర్జాతీయ స్థాయిలో తనకంటూ ప్రత్యేకంగా గుర్తింపు పొందిన కమ్యూనిస్టు నేత సీతారాం ఏచూరి అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ అన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ అధ్యక్షుని స్థాయి నుంచి పార్టీ జనరల్ సెక్రటరీ స్థాయికి ఎదగడంతో పాటు ఉత్తమ పార్లమెంటేరియన్‌గా తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారన్నారు. దేశ వ్యాప్తంగా కమ్యూనిస్టు ప్రాబల్యం తగ్గిన నేపథ్యంలో వామపక్ష భావజాలాన్ని గట్టిగా వినిపించడంతో పాటు యువతను ప్రోత్సహించి పార్టీ బలోపేతానికి కృషి చేయడంలో ఏచూరి పాత్ర అనిర్వచనీయమన్నారు. అందరితో కలుపుగోలుగా వ్యవహరిస్తూ పార్టీలకు అతీతంగా అందరినీ కలుపుకుని వెళ్లేవారని తెలిపారు. వామపక్ష నాయకుల్లో అగ్రగణ్యునిగా ఏచూరి నిలిచారన్నారు. దేశంలో లౌకికవాదం బలపడేందుకు, ప్రజాస్వామ్యం పరిఢవిల్లేందుకు ఆయన చేసిన కృషి ఎంతో ఉందన్నారు.

చిరస్మరణీయుడు : వడ్డే శోభనాద్రీశ్వరరావు

ఏచూరి కోట్లాది మంది హృదయాల్లో చిరస్మరణీయుడుగా నిలిచిపోతారని రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనరు వడ్డే శోభనాద్రీశ్వరరావు పేర్కొన్నారు. విలక్షణమైన వ్యకి అని, అందరినీ కలుపుకుని పోయే ఆయన మనస్తత్వం అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపును తెచ్చిందని అన్నారు. యుపిఎ-1లో కామన్‌మినిమమ్ ప్రోగ్రామ్, ఆహార భద్రతా చట్టం, ఆర్‌టిఐ లాంటి పలు చట్టాలు కాంగ్రెస్ తీసుకురావడంలో ఏచూరి కీలక పాత్ర పోషించారన్నారు. తాను ఎంపిగా ఉన్న సమయంలో తరచూ సూర్జిత్, ఏచూరిని కలుస్తుండే వాడినని ఆయన గుర్తు చేసుకున్నారు. 'లాల్ సలాం' ప్రజాశక్తి ప్రత్యేక సంచికను బి.వి.రాఘవులు ఆవిష్కరించారు. సీతారాం ఏచూరి భారతదేశపు ఆంటోనియో గ్రాంషీ అనే పుస్తకాన్ని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ ఆవిష్కరించారు. సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి హరనాథ్ మాట్లాడుతూ.. ఏచూరి మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు అని అన్నారు. సిపిఐ(ఎంఎల్) రాష్ట్ర నాయకులు జాస్తి కిషోర్‌బాబు మాట్లాడుతూ.. ప్రజలందరికీ సేవ చేయడమే అత్యున్నత వృత్తి అని కారల్ మార్క్స్ భావించారని అన్నారు. మార్క్స్ భావనను పుణికిపుచ్చుకొని విద్యార్థి దశ నుంచే అణగారినవర్గాల ప్రతినిధిగా ఏచూరి వ్యవహరించారని చెప్పారు. ఆమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ శీరం రమేష్ మాట్లాడుతూ.. ఏచూరి దేశానికి చేసిన సేవలు మరువలేనివని అన్నారు. విసికె పార్టీ రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్ మాట్లాడుతూ.. దేశం సంక్షోభంలో ఉన్న సమయంలో ప్రజల పక్షాన కమ్యూనిస్టుగా ఏచూరి గొప్ప పాత్ర నిర్వహించారని చెప్పారు. ప్రజాస్వామ్య శక్తులను ఏకతాటిపై నడిపించగలిగారని అన్నారు. ఎంసిపిఐయు నాయకులు కాటం నాగభూషణం మాట్లాడుతూ.. ఇతర పార్టీలతోనూ ఆయన ఆప్యాయత, స్నేహశీలతతో ఉండేవారని అన్నారు. ఐలు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. సీతారాం ఏచూరి ఆయన జీవితకాలం మొత్తం బిజెపికి, మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడారని తెలిపారు. అనేక గొప్ప చట్టాలను తీసుకురావడంలో సీతారాం ఎలా ఆద్యుడో, చెత్తచట్టాలకు వ్యతిరేకంగా పోరాడటంలోనూ ఆయన అంతే కీలక పాత్ర పోషించారని అన్నారు. ప్రజాస్వామానికి అనుగుణంగా సుప్రీంకోర్టులో తీర్పులు వచ్చాయంటే దానివెనుక సీతారాం కృషి వుందన్నారు. ఫార్వర్డ్‌బ్లాక్ రాష్ట్ర కార్యదర్శి జయవర్ధన్ మాట్లాడుతూ.. ఆయన అడుగుజాడలన్నీ పేద, బడుగు బలహీనవర్గాల కోసం పనిచేశారని వివరించారు. ఆర్‌ఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి జానకిరాములు మాట్లాడుతూ.. ఏచూరి ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు అందరం కృషి చేయాలన్నారు.

తమిళనాడులో కూలిన నిర్మాణంలోని ఫ్లైఓవర్

చెన్నై : తమిళనాడులోని తిరుపత్తూరు జిల్లా అంపూర్‌లోని చెన్నై - బెంగళూరు జాతీయ రహదారిపై నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్ కూలిపోయింది. ఈ ఘటనలో ఫ్లైఓవర్‌పై పనిచేస్తున్న బీహార్, జార్ఖండ్‌కు చెందిన ఆరుగురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు రక్షించి, చికిత్స నిమిత్తం అంబూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ANDHRA LOYOLA INSTITUTE OF ENGINEERING AND TECHNOLOGY
(Approved by AICTE, Recognized by Govt.of A.P., Affiliated to JNTU, Kakinada).
GOVT.POLYTECHNIC POST, VIJAYAWADA-520008, Ph:0866-2476161

SPOT ADMISSIONS APEAPCET - 2024
AT 10.30 AM ON 23.09.2024
B.TECH - I - YEAR

The vacant seats will be filled by the college at **10.30 AM on 23.09.2024** as per the guidelines issued by the Chairman, APSCHE.

All the candidates have to be present with all their Original Certificates. Including **APEAPCET - 2024** Rank Card, Hall Ticket and an amount to be paid as per norms.

The admissions will be made in merit order as prescribed under the rules. For category - wise vacancies, refer college web portal www.aliet.ac.in.

The admissions made at the Institution are provisional and subject to ratification by the Chairman. APSCHE, As per the guidelines, the students admitted through spot admissions are not eligible for tution fee reimbursement.

Place : VIJAYAWADA — Sd/- PRINCIPAL
Date : 23.09.2024

A.P. CAPITAL REGION DEVELOPMENT AUTHORITY
Lenin Centre, Governorpet, Vijayawada - 520 002 (A.P.)
NIT No. MAU01-ADMN0003(NET)/4/2024-IB — Dt. 21.09.2024
E PROCUREMENT SHORT TENDER NOTICE
Name of Work : "Supply & Installation of Analog Phones, Digital Phones and IP Phones to various departments of AP Secretariat, Amaravati" – Estimate Contract Value: Rs.4,09,304/- (Excl. of all taxes).
The bid can be downloaded on AP e-procurement portal from 23.09.2024 to 30.09.2024 up to 14.00 Hrs. Due date for submission of Bid 30.09.2024 up to 15.00 Hrs, Technical bid opening 30.09.2024 @16.00 Hrs. For further details please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in.
Sd/- Commissioner, APCRDA, Vijayawada

kotak
కోటక్ మహీంద్రా బ్యాంక్ లిమిటెడ్
[illegible]
స్వాధీనతా ప్రకటన
[illegible]

డిమాండ్ నోటీసు
CIN: U67100MH2007PLC174759
[illegible]

Edelweiss

ఏలేరు నది

రామవరం పక్కన ప్రవహించే ఏలేరు నది నీళ్ల శుభ్రంగా ఉండడంతో ఆ నీరే తాగేవాళ్లు ప్రజలు. పశువులు, పక్షులు దాహం తీర్చుకునేవి. నదిగట్ల మీద చెట్లు, పూల మొక్కలతో పచ్చదనం ఉండేది. చల్లగాలి కోసం అక్కడకి వచ్చి కూర్చునేవారు జనం. అలాంటి ఊరు కొన్నాళ్లకు బాగా అభివృద్ధి చెందింది. పరిశ్రమలు వచ్చాయి. కొన్నేళ్ల తరువాత ఊళ్ళోని గొట్టపు మోటారు బావులకు అలవాటు పడ్డారు జనం. నది వైపు చూడడం మానేసారు. నది లోపల, బయట ఉన్న ఇసుకని ఇష్టానుసారం తవ్వేసి కట్టడాలకు, నిర్మాణాలకు వాడుకున్నారు. ఇసుకమేటలన్నీ తరిగిపోయి గోతులేర్పడ్డాయి. వాటిల్లో చెత్తాచెదారం చేరిపోయేది. అక్కడే ప్లాస్టిక్, వ్యర్థాలు పడేసేవాళు.. దాంతో నది నీళ్లన్నీ కలుషితమయ్యాయి. మురికికాలువలా మారిపోయి దుర్వాసన వచ్చేది.

ఆ ఊళ్లో పదవ తరగతి చదివే రాము, ఆ నదిని చూసినప్పుడల్లా బాధపడేవాడు. ఒకరోజు పేపర్లోని వార్త రాముని ఆకర్షించింది. తమలాగే మురికిగా మారిన నదిని పర్యావరణ పరిరక్షకులు వచ్చి శుభ్రం చేసారన్నదే ఆ వార్త. పేపర్లో రాసినదాన్ని బట్టి వాళ్లకి ఉత్తరం రాశాడు రాము.

రాము ఉత్తరానికి స్పందించి పర్యావరణ పరిరక్షకులు వాళ్ల ఊరు వచ్చారు. పర్యావరణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం ఎంత అవసరమో జనానికి అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించమని చెప్పారు. ప్రజలందరి సహకారంతో అంతా కలసి నదిని శుభ్రం చేశారు.

పూర్తిగా చెత్తని వదిలించుకుని స్వచ్ఛంగా మారింది నది. ఇసుకలో ఆడడానికి పిల్లలు వెళ్లడం మొదలుపెట్టారు. అక్కడ చెత్త కనబడితే వాళ్లే బయట పారేశారు. కొన్నాళ్లకు పాత పరిస్థితులు వచ్చాయి నది చుట్టూ. అది చూసి రాము మనసు కుదుటపడింది.

– నారంశెట్టి ఉమామహేశ్వరరావు,
94907 99203.

లెక్క చేయండి

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన బొమ్మలను అంకెలుగా గణించి లెక్క చేశాం. చివరి లైను జవాబు మీరు రాబట్టండి చూద్దాం.



జవాబు : 50

నేను గీసిన బొమ్మ

సయ్యద్ అర్షియా బేగం,
8వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
నందలూరు, అన్నమయ్య జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

అపసవ్యతను సరిదిద్దే ఫిజియో థెరపీ

శరీర అవయవాల కదలిక, పనితీరును మెరుగుపరచ్చటంలో ఫిజియోథెరఫీ ఇప్పుడు కీలకపాత్ర పోషిస్తోంది. వైద్య చికిత్సలకు అనుసంధానంగానూ, విడిగానూ ఈ ప్రక్రియ ఇప్పుడు బాగా ప్రాచుర్యం పొందుతోంది. ఏ స్థాయిలోనైనా కండరాల సమస్యలను పరిష్కరించటానికి మాన్యువల్ థెరపీ, వ్యాయామం, తదితర చికిత్సా పద్ధతులను ఉపయోగిస్తారు. కండరాలు, కీళ్లను లక్ష్యంగా చేసుకోవటం ద్వారా ఫిజియోథెరపీ నొప్పిని తగ్గించటం, చలనశీలతను మెరుగుపర్చటం, మొత్తంగా మనిషి జీవించే కాలాన్ని పెంచే లక్ష్యంగా ఈ చికిత్సా పద్ధతులు కొనసాగుతాయి.

వాతావరణం బాగా చల్లగా ఉండే సమయంలో కండరాల సమస్యలు తీవ్రమవుతాయి. కాళ్లూ చేతులు పట్టేయడం, చేతివేళ్లు బొంగర్లు పోవటం, కీళ్ల నొప్పులు అనూహ్యంగా పెరుగుతుంటాయి. ఇలాంటి సమయంలో ఫిజియోథెరపీ నొప్పి నివారణకు గాను బహుముఖంగా పనిచేస్తుంది. సాధారణంగా చిన్నపాటి వ్యాయామాలు చేయటం ద్వారా, జాయింట్ మొబిలైజేషన్స్, సాఫ్ట్ టిష్యూ మానిప్యులేషన్ వంటి విధానాల ద్వారా కండరాలు, కీళ్లల్లో ఏర్పడే నొప్పుల స్థాయి, అనారోగ్య పరిస్థితులను తగ్గించొచ్చు. వీటితోపాటుగా చికిత్సా వ్యాయామాలు, స్ట్రెచ్‌లు కండరాలను బలోపేతం చేయటానికి, కీళ్లపై ఒత్తిడిని తగ్గించటానికి, నొప్పి ఉపశమనాన్ని కల్పిస్తాయి.

వ్యాయామంతో నొప్పులు నయం

ఫిజియోథెరపీతో అవయవాల అపసవ్యతలను నయం చేయడం ద్వారా శరీరానికి ఎలాంటి నష్టం జరగదు. ప్రస్తుత జీవనశైలిలో షుగర్, బిపి, గుండె జబ్బులు సర్వసాధారణమే అయ్యాయి. అన్ని వయస్సుల వారికి కీళ్ల, నడుం నొప్పులు, నరాల బలహీనత వంటి సమస్యలొస్తున్నాయి. ఈ సమస్యలన్నింటికీ ఎలాంటి సైడ్ ఎఫెక్ట్ లేనిచికిత్సా విధానం 'ఫిజియోథెరపి'. చాలావరకు మందులు వాడకుండా కేవలం వ్యాయామాలతో అవయవాలన్నీ మళ్లీ సక్రమంగా చేసేలా చేసే వైద్యమే ఇది. మందులతో వచ్చే సైడ్ ఎఫెక్ట్‌లను గుర్తించిన ఎంతోమంది దేశ విదేశాల్లోని వైద్యనిపుణులు ఈ చికిత్సలను ప్రోత్సహిస్తున్నారు.

పలు పద్ధతుల్లో నొప్పి నివారణ

ఫిజియోథెరపిలో నొప్పిని తగ్గించడానికి ఐఎఫ్‌టి, టెన్స్, అల్ట్రాసౌండ్, థెరపి, హీటింగ్ మెడాలిటీస్, క్రయోథెరపి, డ్రైనీడ్లింగ్, టేపింగ్, వ్యాక్స్ థెరపీ, కప్పింగ్ థెరపి, మయోఫేషియల్, రిలీజ్ వంటి ఆధునిక టెక్నిక్స్‌తో నొప్పిని తగ్గించొచ్చు. మ్యాన్యువల్ థెరపి, స్ట్రెచ్చింగ్ ఎక్సర్‌సైజుల ద్వారా జాయింట్ మూవెంట్‌ని పెంచవచ్చు. న్యూరాలజీ, కార్డియో గైనికాలజీ, స్పోర్ట్స్ మెడిసిన్, క్లైనిషియోలజీ ఫిడియాట్రిక్స్ లాంటి స్పెషలైజేషన్లు కూడా ఉన్నాయి. ఆపరేషన్ తర్వాత ఎలాంటి సమస్యలు రాకుండా పూర్వ స్థితిని పొందటానికి ఈ చికిత్సలు బాగా ఉపయోగపడతాయి. మోకాలు మార్పిడి, తొంటి మార్పిడి, ప్రమాదాల్లో గాయాలైన సందర్భాల్లో ఆపరేషన్ల తర్వాత ఫిజియోథెరపీ ఎంతో అవసరం. 50 శాతం దీని ద్వారా సమస్యలు తగ్గుతాయి. పక్షవాతం, నరాల బలహీనత, వెన్నుపూస విరగడం వంటి దీర్ఘకాలిక, న్యూరో కేసుల్లో రోజూ ఫిజియోథెరపీ చేయాల్సివుంటుంది. నిర్లక్ష్యం చేస్తే తీవ్రమైన ఇబ్బందులొస్తాయి. పిల్లలకు పుట్టుకతో వచ్చే సెరిబ్రల్ పాల్సి వల్ల ఎదుగుదల లోపాలతో సరిగ్గా నిలబడలేరు. నడవలేరు. అలాంటి వారికి ఫిజియోథెరపి రిహబిలిటేషన్ చాలా అవసరం. వృద్ధుల్లో వచ్చే పార్కిన్‌సన్, న్యూరోపతి వంటి సమస్యలకు ఈ చికిత్సతో మంచి ఫలితాలొస్తాయి. ఆటలు ఆడేటప్పుడు గాయాలు తగులుతుంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఫిజియోథెరపిస్టులు చికిత్సలు చేయటంతోపాటుగా వ్యాయామాలు చేయిస్తూ తిరిగి మళ్లీ ఆటలు ఆడేలా చేస్తారు. మానసికంగా, శారీకరంగా కృంగి పోయే రోగుల వికాసానికి ఫిజియోథెరపి నిజంగా సంజీవని వంటిది.

కరోనా ఛాయలు ఇంకా ...

కరోనా కల్లోలం సృష్టించిన మూడేళ్ల కాలంలో ఈ చికిత్సలు బాగా ఉపయోగపడ్డాయి. చెస్ట్ ఫిజియోథెరపీ, బ్రీతింగ్ ఎక్సర్‌సైజులు, మొబిలిటీ యాక్టివిటీ వల్ల చాలామంది కరోనా నుంచి కోలుకున్నారు. అయితే కరోనా తగ్గినా అప్పటి బాధితులు ఇప్పుడు కొత్త సమస్యలను ఎదుర్కొంటున్నారు. రోగ నిరోధక శక్తి మందగించటం, అలసట, ఎక్కువ సేపు పనిచేయకపోవటం, నడవలేకపోవటం, రోజువారీ పనులు చేసుకోవటం కష్టంగా బాధపడుతున్న వారూ ఉంటున్నారు. ఆర్థోపెడిక్, న్యూరాలజీ సమస్యలను సైతం ఎదుర్కొంటున్నారు. అందువల్ల ప్రతిఒక్కరూ శరీర వ్యాయామం చేయటం ఎంతో అవసరం.

ఇలా చేస్తే మేలు

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఒ) సూచనల ప్రకారం

- 18–24 వయస్సున్న వారు కనీసం వారానికి 150 నిముషాల మోడరేట్ ఇంటెన్సీటి ఏరోబిక్ ఫిజికల్ యాక్టివిటీ లేదా
- 75 నిముషాల విగరస్ ఫిజికల్ యాక్టివిటీ చేయాలి. ఇది ప్రతిరోజూ గానీ, వారానికి ఐదుసార్లు తగ్గకుండా చేయాలి
- ఫిజికల్‌గా ఇంకా ఫిట్‌గా ఉండాలంటే వారానికి 300 నిముషాలు మోడరేట్ ఇన్టెన్సిటీ 150 నిముషాలు, విగరస్ ఫిజికల్ యాక్టివిటీ చేయాలి. ఇలా చేయటం వల్ల కార్డియో రెస్పిరేటరీ, బోన్ మజిల్ హెల్త్‌కి కూడా తోడ్పడుతుంది.
- 65 ఏళ్ల పైబడినవారు వారానికి 150 నిమిషాల మోడరేట్ ఇంటెన్సిటి ఫిజికల్ యాక్టివిటి చెయ్యాలి. వీళ్ళల్లో పూర్ మొబిలిటి మోడరేట్ ఉండటం వల్ల బ్యాలెన్సు, ఫాల్ సమస్యలు ఉంటాయి. మసిల్ స్ట్రెంత్ బ్యాలెన్స్‌పై ఫోకస్ చేయాలి.
- 5–15 సంవత్సరాల పిల్లలు రోజుకి 60 నిమిషాలు మోడరేట్ టు విగరస్ ఇంటెన్సిటి ఫిజికల్ యాక్టివిటీ ఎక్సర్‌సైజ్ రూపంలో లేకుండా ఆటల రూపంలో కూడా చేయొచ్చు.
- స్త్రీలల్లో ముఖ్యంగా గర్భిణీలు, బాలింతలకు కూడా ఫిజికల్ ఎక్సర్‌సైజ్ అవసరం. అంతేకాకుండా ఇంట్లో ఉండే మహిళలు, తమ ఇంటి పనులు చేయటమే ఎక్సర్‌సైజ్‌గా భావిస్తుంటారు. కానీ వారి ఎనర్జీ ఖర్చుఅవుతుంది. వారానికి 150 నిముషాలు ఫిజికల్ ఎక్సర్‌సైజ్ చేయటం వల్ల ఎనర్జీ ఉత్పత్తి అయ్యి ఫిట్‌గా ఉంటారు. దానివల్ల స్త్రీలకు సంబంధించిన వ్యాధులు, హార్మోన్ల అసమతుల్యత సమస్యలు రాకుండా చేసుకోవచ్చు.
- గర్భిణీలు ఎక్సర్‌సైజ్ చేయటం వల్ల నార్మల్ డెలివరీ అయ్యే అవకాశం మెరుగుపడుతుంది. బాలింతలకు కూడా పోస్టునేటర్ ఎక్సర్‌సైజులు ఉంటాయి. వీటివల్ల నార్మల్ స్థితికి రావడానికి, డిప్రెషన్ తగ్గించు కోవడానికి, ఫిజికల్ ఫిట్నెస్ మెయింటెయిన్ చేసుకోవచ్చు.

డాక్టర్ దుబ్బ నాగరాజు, ఎంపిటి (ఆర్థో),
అసోసియేట్ ప్రొఫెసర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజియోథెరపీ, పిహెచ్‌డి రీసెర్చ్ స్కాలర్, ఎన్ఆర్ఐ జనరల్ ఆస్పత్రి, మంగళగిరి,
97032 12170.

'దేవర'తో ఆక్యుపెన్సీ పెరిగేనా?

ఈనెల 27న ఎన్టీఆర్ నటించిన 'దేవర' సినిమా విడుదల కానుంది. కొరటాల శివ దర్శకత్వంలో రూపొందించిన యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ సినిమా తెరకెక్కింది. బాలీవుడ్ నటి జాన్వీకపూర్ హీరోయిన్. పాన్ ఇండియా మూవీగా ఈ సినిమా తెరకెక్కింది. సినిమా విడుదల సందర్భంగా రాష్ట్రప్రభుత్వం స్పెషల్ షోలతోపాటుగా టిక్కెట్ ధరల పెంపునకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీచేసిన సంగతి తెలిసిందే. దీంతో ఎన్టీఆర్ సిఎం చంద్రబాబు, రాష్ట్ర సినిమాటోగ్రఫీమంత్రి కందుల దుర్గేష్‌కు అభినందనలు తెలిపారు ఎన్టీఆర్. విడుదలరోజు అర్ధరాత్రి 12 గంటలషోతోపాటు ఆరు ఆటలు, మరుసటిరోజు నుంచి ఐదు ఐదు ఆటలకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. అలాగే టిక్కెట్ ధరలను సైతం పెంచుకోవటానికి అనుమతిచ్చింది. సింగిల్ స్క్రీన్స్‌లో జీఎస్టీతో కలిసి అప్పర్ క్లాస్ రూ.110, లోవర్ క్లాస్ రూ.60, మల్టీప్లెక్స్ థియేటర్లలో రూ.135 వరకూ పెంచుకునేందుకు అవకాశం కల్పించింది. మరోవైపు తెలంగాణాలోనూ స్పెషల్ షోలు, టిక్కెట్ ధరలకు ప్రభుత్వం అనుమతిచ్చింది. రోజూ ఆరు ఆటలను 14 రోజులపాటు ప్రదర్శించించేందుకు అంగీకరించారు. దీంతో టాలీవుడ్‌లో ఆక్యుపెన్సీపై మళ్లీ చర్చ కొనసాగుతోంది. గతంలో యువ కథానాయకుల చిత్రాలు, పరిమిత వ్యయంతో రూపొందిన సినిమాలకి బాగుందనే టాక్ వచ్చాకే ప్రేక్షకులు థియేటర్లకి వస్తున్నారు. అదే అగ్ర హీరోల సినిమాలతో కొన్ని రోజులపాటు కళకళలాడుతుండే విషయం తెలిసిందే. డిసెంబర్ 6న పుష్ప–2, సెప్టెంబర్ 27న దేవర, డిసెంబర్ 20న గేమ్ ఛేంజర్ విడుదల కానున్నాయి. చిరంజీవి నటిస్తున్న 'విశ్వంభర' 2025 సంక్రాంతికి విడుదల కానుంది. ప్రభాస్ కల్కి 2898 ఏడీ తర్వాత 'రాజాసాబ్‌'లో, దేవర తర్వాత ఎన్టీఆర్ 'వార్2'లో నటిస్తున్నారు. పవన్‌కళ్యాణ్, సుజీత్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న గ్యాంగ్‌స్టార్ యాక్షన్ చిత్రం 'ఓజీ'. పవన్ కళ్యాణ్, ఎఎం రత్నం కాంబినేషన్‌లో 'హరిహర వీరమల్లు' కూడా సెట్స్‌పైకి వచ్చే అవకాశాలున్నాయి. హీరో మహేష్‌బాబు, ఎస్ఎస్ రాజమౌళి సినిమాకు ఏర్పాట్లు పెద్దఎత్తున జరుగుతున్నాయి.

హనుమాన్‌కు సీక్వెల్‌గా 'జై హనుమాన్', ఎఫ్4 సీక్వెల్‌లు కొనసాగుతున్నాయి.

పెద్ద సినిమాలొస్తున్నాయ్...

కరోనా మహమ్మారి వీడినా సినిమా పరిశ్రమపై ఇంకా ఆ ఛాయలు వెంటాడుతూనే ఉన్నాయి. కరోనా సమయంలో థియేటర్లు మూతపడటంతో ఓటీటీ ప్లాట్‌ఫాంపై సినిమాల విడుదలలు పెరిగాయి. అప్పటి నుంచీ నేటికీ ఆ ట్రెండ్ కొనసాగుతోంది. పెద్ద, చిన్న సినిమాలు థియేటర్లలో విడుదలవుతున్నా ఆక్యుపెన్సీ నిండే పరిస్థితులు ఉండటం లేదు. ఈ ఏడాది వేసవిలో కుర్చీలు నిండక యజమానులు థియేటర్ల మూసేసిన పరిస్థితులు కూడా తెలిసిందే. వేసవి తర్వాత వచ్చిన సినిమాల్లో 'కల్కి' కొద్దిమేర థియేటర్లలో ఆక్యుపెన్సీ పెంచేందుకు దోహదపడింది. పెద్ద హీరోల సినిమాలు ఈ మధ్యకాలంలో రాలేదు. అన్నీ దసరా, దీపావళి, క్రిస్మస్, సంక్రాంతి పండుగలకు మార్చుకున్నారు. దీంతో చిన్నబడ్జెట్ సినిమాలైనా కుటుంబ కథా చిత్రాలైతే అందులో కథనం ఉండి మెలోడి, ట్రాజెడీ, కామెడీలను జొప్పిస్తే ఓ మేర ఆదరణ చూరగొంటున్నాయి. పెద్ద బడ్జెట్ సినిమాలైనా అందులో పైన పేర్కొన్న అంశాలు లేకపోతే ప్రేక్షకులు వాటి వైపు కూడా చూడటం లేదు. ఇక పెద్ద హీరోలను సినిమాలను పండుగలు, ఇతరత్రా అకేషన్లలో మాత్రమే విడుదల చేసేందుకు వారు ఇష్టపడుతున్నారు. ఈ క్రమంలో దక్షిణాది చిత్ర పరిశ్రమలో పాన్ ఇండియా పేరుతో ఐదారు భాషల్లో సినిమాలు ఏకకాలంలో చేస్తూ అన్ని ప్రాంతాల్లో స్థానికంగా కొందరు క్యారెక్టర్ ఆర్టిస్టులు పెట్టి విడుదల చేస్తున్నారు. తమిళం, కన్నడ, తెలుగు, మలయాళ హీరోల సినిమాలు ఈ తరహాలోనే ఎక్కువగా వస్తున్నాయి. ఈ క్రమంలో తమిళ హీరో నటించిన 'తంగలాల్' ప్రేక్షకారణ పొందింది. తాజాగా చిన్న సినిమా 'కమిటీ కుర్రాళ్లు' ఆదరణ చూరగొంటోంది. తమిళ హీరో విజయ్ ఆంటోనీ నటించిన సినిమా 'హిట్లర్' ఈనెల 27న విడుదల కానుంది. రజనీకాంత్ నటించిన 'వేట్టైయాన్'ను దసరా సందర్భంగా అక్టోబర్ 10న విడుదల కానుంది. అదేరోజు హీరో సూర్య నటించిన 'కంగువా' విడుదల కావాల్సివున్నా రజనీకాంత్ సినిమా రావటంతో సూర్య వెనక్కి తగ్గారు. నవంబర్ 14న విడుదల చేయాలని మేకర్లు నిర్ణయం తీసుకున్నారు.

దులీప్ ట్రోఫీ విజేత ఇండియా–ఎ

- రన్నర్స్‌గా ఇండియా– సి
- ముగిసిన దులీఫ్ ట్రోఫీ

దులీప్‌ట్రోఫీ విజేత జట్టు

ప్రజాశక్తి – అనంతపురం

దులీఫ్ ట్రోఫీని ఇండియా– ఎ జట్టు కైవసం చేసుకుంది. టోర్నీలో 12 పాయింట్లతో ఇండియా–ఎ జట్టు అగ్రస్థానంలో ఉండి టోర్నీ విజేతగా నిలిచింది. 9 పాయింట్లతో ఇండియా– సి జట్టు రన్నర్స్‌గా ఉంది. అనంతపురం ఆర్‌డిటి స్పోర్ట్స్ విలేజ్‌లో చివరి రౌండ్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఇండియా ఎ జట్టు 132 పరుగులతో ఇండియా సి జట్టుపై, ఇండియా డి జట్టు 257 పరుగుల భారీ తేడాతో ఇండియా– బి జట్టుపై విజయం సాధించాయి. ఇండియా బితో జరిగిన మ్యాచ్‌లో ఇండియా –డి బ్యాట్స్‌మెన్ రిక్కీభుయ్ (56, 119) ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు. ఇండియా ఎతో జరిగిన మ్యాచ్‌లో సి జట్టు క్రీడాకారుడు సాయిసుదర్శన్ సెంచరీ సాధించాడు. ఇండియా – సితో జరిగిన మ్యాచ్‌లో ఎ జట్టు క్రీడాకారుడు శశ్వత్ రావత్ (124, 53) ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు. ఇండియా సి జట్టు క్రీడాకారులు అన్షుల్ కాంబోజ్ ప్లేయర్ ఆఫ్ ద సిరిస్‌గా (16 వికెట్లు, 41 పరుగులు) నిలిచాడు. టోర్నీ విజేత ఇండియా–ఎ జట్టుకు ఎసిఎ కార్యదర్శి సానా సతీష్ బాబు విన్నర్స్ కప్‌ను అందజేశారు. రన్నర్స్‌కు రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నుల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కప్‌ను అందించారు. స్ట్రైకర్ ఆఫ్ ది సిరీస్ కింద రికీభుయ్‌కి మంత్రి పయ్యావుల కేశవ్, ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌కు సంబంధించి ఏ గ్రౌండ్‌లో శాశ్వర్‌రావత్‌కు ఆర్‌టిడి ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్, బి గ్రౌండ్‌లో రిక్కీభుయ్‌కి ఎసిఎ అతిథి ఆర్‌విఎస్‌కె. రంగారావ్ చెక్కులను అందజేశారు.

చెస్‌లో చారిత్రక స్వర్ణం

- ఓపెన్ విభాగంలో భారత్‌కు పసిడి

బుడాపెస్ట్ : 2024 ఫిడె చెస్ ఒలింపియాడ్‌లో భారత్ చారిత్రక స్వర్ణం సాధించింది. ఓపెన్ విభాగంలో భారత్ అగ్రస్థానంలో నిలిచి బంగారు పతకం కైవసం చేసుకుంది. ఆదివారం జరిగిన 11వ రౌండ్ పోటీల్లో డి. గుకేశ్, ఆర్. ప్రజ్ఞానంద, అర్జున్ , విదిత్ గుజరాతీ, పెంటాల హారికృష్ణలు సత్తా చాటారు. స్లోవేనియాపై గుకేశ్, అర్జున్ విజయాలతో భారత్ 2–0తో ఆధిక్యం సాధించింది. హారికృష్ణ, విదిత్ గుజరాతీ మ్యాచ్ ఫలితాలతో సంబంధం లేకుండా మనోళ్లు పసిడి పతకం ఖాయం చేసుకున్నారు. రెండో స్థానంలో నిలిచిన చైనా సిల్వర్ మెడల్‌కు పరిమితమైంది. చెస్ ఒలింపియాడ్‌లో భారత్‌కు ఇదే తొలి పసిడి పతకం కావటం విశేషం. మహిళల విభాగంలో భారత్ పసిడి దిశగా దూసుకెళ్తోంది. హారిక ద్రోణవల్లి, ఆర్. వైశాలి, దివ్య దేశ్‌ముఖ్, వి అగర్వాల్, తానియ సచ్‌దేవ్‌లు ఆఖరు రౌండ్లో అజర్‌బైజాన్‌పై 1–0తో ముందంజలో కొనసాగుతున్నారు. చెస్ ఒలింపియాడ్‌లో ఓపెన్, మహిళల విభాగాల్లో పసిడి నెగ్గి చెస్ చరిత్రలోనే నవ శకానికి భారత్ నాంది పలకనుంది.

అశ్విన్ మాయలో.. చతికిలబడ్డ బంగ్లా

- **1–0తో టెస్టు సిరీస్‌లో భారత్ ఆధిక్యం**

చెన్నై : తొలి టెస్టులో టీమ్ ఇండియా అలవోక విజయం సాధించింది. ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ (113, 133 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్స్‌లు) (6/88) బ్యాట్‌తో, బంతితో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో చెలరేగాడు. నాల్గో రోజు ఆటలో స్పిన్ మాయజాలం సృష్టించిన అశ్విన్.. బంగ్లాదేశ్ కథ ముగించాడు. రవీంద్ర జడేజా (3/58) సైతం మ్యాజిక్‌లో జత కలవటంతో 515 పరుగుల ఛేదనలో బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్‌లో 234 పరుగులకు కుప్పకూలింది. భారత బౌలర్ల ధాటికి 62.1 ఓవర్లలోనే బంగ్లాదేశ్ చతికిల పడింది. 280 పరుగుల భారీ తేడాతో భారత్ తొలి టెస్టులో ఘన విజయం సాధించింది. బంగ్లాదేశ్ కెప్టెన్ నజ్ముల్ హొస్సేన్ శాంటో (82, 127 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఒక్కడే ఒంటరి పోరాటం చేశాడు. లోకల్ స్టార్ రవిచంద్రన్ అశ్విన్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు. రెండు మ్యాచుల టెస్టు సిరీస్‌లో భారత్ 1–0తో ఆధిక్యం సొంతం చేసుకుంది. భారత్, బంగ్లాదేశ్ రెండో టెస్టు సెప్టెంబర్ 27 నుంచి కాన్పూర్ గ్రీన్ పార్క్ స్టేడియంలో ఆరంభం కానుంది.

తొలి సెషన్లోనే.. : ఓవర్‌నైట్ స్కోరు 158/4తో నాల్గో రోజు బ్యాటింగ్‌కు వచ్చిన బంగ్లాదేశ్ ఉదయం సెషన్లోనే చేతులెత్తేసింది. 25 ఓవర్లలోనే బంగ్లా పులుల కథ ముగిసింది. నిజానికి తొలి గంట ఆటలో బంగ్లాదేశ్ గొప్పగా ప్రతిఘటించింది. కెప్టెన్ నజ్ముల్ శాంటో (82), షకిబ్ అల్ హసన్ (25) ఆచితూచి ఆడారు. బుమ్రా, సిరాజ్, ఆకాశ్ దీప్‌లు కట్టుదిట్టంగా బంతులేసినా.. వికెట్ లభించలేదు. ఉదయం సెషన్లో పేస్‌కు వికెట్ దక్కలేదు, దీంతో బంగ్లాదేశ్ శిబిరంలో ఆశలు రేకెత్తాయి. కానీ బంతి అశ్విన్ చేతికి అందిన తర్వాత సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. పేసర్లు వికెట్ల వేటలో చెమటోడ్చిన పిచ్‌పై అశ్విన్ ఆడుతూ పాడుతూ వికెట్ల జాతర సాగించాడు. బంగ్లా బ్యాటర్లు ఎదురుదాడి చేయాలనే ప్రణాళికలో వికెట్లు కోల్పోయారు. బంగ్లాదేశ్ ఆఖరు ఆరు వికెట్లను 40 పరుగుల వ్యవధిలోనే కోల్పోయింది. ప్రమాదకర షకిబ్ అల్ హసన్‌ను తన తొలి ఓవర్లోనే అవుట్ చేసిన అశ్విన్.. మెహిది హసన్ మిరాజ్ (8), టస్కిన్ అహ్మద్ (5)లను సాగనంపాడు. అర్ధ సెంచరీతో విసిగించిన నజ్ముల్ సహా ఫామ్‌లో ఉన్న లిటన్ దాస్ (1), హసన్ మహ్మద్ (7)లను జడేజా పెవిలియన్‌కు చేర్చాడు. దీంతో 62.1 ఓవర్లలోనే బంగ్లాదేశ్ 234 పరుగులకు కుప్పకూలింది. భారత్ 280 పరుగుల భారీ తేడాతో అలవోక విజయం నమోదు చేసింది. ఆఫ్ స్పిన్నర్ అశ్విన్ ఆరు వికెట్లు పడగొట్టగా.. రవీంద్ర జడేజా మూడు వికెట్లు తీసుకున్నాడు. ఓ టెస్టులో శతకం సహా ఐదు వికెట్ల ప్రదర్శన చేసిన అత్యంత పెద్ద వయస్కుడిగా రవిచంద్రన్ అశ్విన్ రికార్డు నెలకొల్పాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68